
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

స్కూళ్ల వద్ద ఫాస్ట్‌ఫుడ్ స్టాల్స్ తొలగించాలి!



చిన్నారులు, యువత ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి
యువతలో గుండెపోట్లు పెరగడానికి ఇదే కారణం
జీర్ణాశయ, కాలేయ సమస్యలకు ఆహారపు అలవాట్లే కారణం
కుప్పంలో జీర్ణకోశ వ్యాధుల బ్యాక్టీరియాపై పరిశోధనలు
ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి 2

శనివారం | 14-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 339
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి సా.4:02 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాషాఢ రా.6:16 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.2:46-4:28, దుర్ముహూర్తం: ఉ.6:46-8:17, అమృతఘడియలు: మ.1:03-2:47, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:46, సూర్యాస్తమయం: 6:12 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సిమెంట్ స్కామ్‌లో భారతి



పేదల ఇళ్ల పేరుతో సొంత వ్యాపారం

నాడు సిమెంట్ కొనుగోళ్లలో 'భారతి'కి పెద్దపీట

అర్హతకు మించి 3 రెట్లు కొనుగోలు
భారతీ సిమెంట్స్‌కు రూ.165 కోట్లు చెల్లింపులు
అదనంగా రూ.110 కోట్లు బిజినెస్
జగన్ కుటుంబానికి అయాచిత లబ్ధి
పైగా టన్ను ధరపై అధికంగా రూ.60 చెల్లింపు
'భారతి' కంటే ఎక్కువ ప్లాంట్ సామర్థ్యం ఉన్న కంపెనీలకు తక్కువ ఆర్డర్లు
ఆలస్యంగా వెలుగులోకి విజిలెన్స్ నివేదిక
బంధుప్రీతి, రాజకీయ కుట్ర ఉన్నట్టు వెల్లడి

అధికారం వాళ్లదే! 'మీడియా' వాళ్లదే! ఇంకేముంది... ప్రభుత్వ ప్రకటన రూపంలో వందల కోట్లు 'సంపాదించారు'!

అధికారం వాళ్లదే! సిమెంట్ కంపెనీ కూడా వాళ్లదే! ఎదురేముంది... లెక్కకు మిక్కిలి ఆర్డర్లు ఇచ్చి బిజినెస్ పెంచుకున్నారు!

'సొంత లాభం కొంత మానుకో' అనేది గురజాడ వారి మాట! 'సొంత లాభమే బాగా చూసుకో' అనేది ఐదేళ్ల పాలనలో జగన్ నడిచిన బాట!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదలకు గృహ నిర్మాణం పేరిట జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్‌కు అర్హతకు మించి ఆర్డర్లు ఇచ్చిన వైనం ఇప్పుడు బయటపడింది. దామాషా పద్ధతిన భారతీ సిమెంట్స్ నుంచి కొనాల్సిన దానికంటే మూడు రెట్లు అదనంగా కొనుగోలు చేశారు. నాడు అధికారంలో ఉన్న జగన్... ఆ మేరకు తన కుటుంబ వ్యాపారాన్ని పెంచుకున్నారు. దీనికోసం ఇతర సిమెంట్ కంపెనీల ఆర్డర్లకు గండి కొట్టారు. ఈ అక్రమ వ్యవహారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెలుగు చూసింది. పేదల ఇళ్ల నిర్మాణం పేరిట భారతీ సిమెంట్స్ నుంచి పరిమితికి మించి ఏకంగా 3,31,528 టన్నుల సిమెంట్ కొనుగోలు చేశారు. ఇందుకోసం జగన్ కుటుంబానికి రూ.165 కోట్లు చెల్లించారు. అంటే.. రూ.55 కోట్ల

మిగతా 14వ పేజీలో...

'శ్రీశైలం ఘటన'లో తొలి వికెట్ 14

ఫీల్డ్ డైరెక్టర్ బదిలీ..
త్వరలో మరికొందరిపైనా వేటు!



లిక్కర్ స్కామ్‌లో మరో 'స్కీమ్'

మద్యం రవాణాలో రూ.400 కోట్లు దోపిడీ
సూత్రధారుల కథ తేల్చాలని సిట్‌కు ఆదేశం
బాక్స్ రవాణా చార్జీ 13 నుంచి 34కు పెంపు
టెండర్ దక్కించుకున్న కసిరెడ్డి బినామీ కంపెనీ
తర్వాత పలువురు వైసీపీ నేతలకు సబ్ కాంట్రాక్టు
సీఐడీ కేసు నమోదు.. దర్యాప్తు బాధ్యత 'సిట్'కు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)


ఒక పెద్ద కుంభకోణం... దానికి అనుగుణంగా మరిన్ని కుంభకోణాలు! జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో తవ్వే కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. డిపోల నుంచి మద్యం దుకాణాలకు లిక్కర్ బాక్సుల సరఫరా పేరుతో రూ.400 కోట్లు దోచేసినట్లు తేలింది. దీని వెనుక

మిగతా 14వ పేజీలో...

దొంగ సొమ్ము దోపిడీ

లిక్కర్ స్కామ్ నిందితుల ఇంట్లో డబ్బు కొట్టేసి
పొరుగు రాష్ట్రాల్లో ఆస్తుల కొనుగోలు 14
తాజాగా వాటిని అటాచ్ చేసిన సిట్

వైసీపీ హయాంలో అసెంబ్లీలో నాకు జరిగిన అవమానానికి కన్నీళ్లు పెట్టుకున్నాను. ఆ ఐదేళ్లలో నాలాగే చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్నారు. నోటీసు ఇవ్వకుండానే నన్ను అరెస్టు చేశారు.. విశాఖ వెళ్తే పవన్ కల్యాణ్‌ను అడ్డుకున్నారు. ఇప్పుడు నీతులు చెబుతున్నారు. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనిస్తుంటారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు.
- సీఎం చంద్రబాబు



సంక్షేమం, అభివృద్ధి.. సమతూకం

20 నెలల్లో ఎంతో చేశాం: ముఖ్యమంత్రి

జగన్ విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది
పీపీపీ విధానంతో సంపద సృష్టి
ముఖ్యమంత్రే చట్ట వ్యతిరేకంగా చేస్తే ఎవరికి చెప్పుకోవాలి?
తాడేపల్లి ప్యాలెస్ సమీపాన హెలిప్యాడ్ కోసం భూమి అడిగారు
ఇవ్వలేదని 22ఏ‌లో పెట్టేశారు
ఆ హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్డుకు రూ.33 లక్షల ప్రజాధనం ఖర్చు
ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం
వాటిని ఈ ఏడాదే ప్రక్షాళన చేస్తాం
జగన్ పాలనలో జనంపై రూ.32,166 కోట్ల విద్యుత్ భారం
మూడేళ్లూ కరెంటు చార్జీలు పెంచం

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 20 నెలల్లో ఎంతో చేశామని, సంక్షేమం-అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన ప్రజలకు అందుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన ప్రసంగించారు. జగన్ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందన్నారు. ఆ విధ్వంసంపై అధికారంలోకి వస్తూనే 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని చెప్పారు. రాష్ట్రంలో పీపీపీ విధానంతో సంపద సృష్టి జరుగుతోందన్నారు. రోడ్లు, రేవులు, విమానాశ్రయాలను ఈ పద్ధతిలోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్ (పీ-4) కార్యక్రమంతో భవిష్యత్‌లో మంచి ఫలితాలొస్తాయన్నారు. గత

మిగతా 12వ పేజీలో...

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు మూడేళ్లలో పూర్తి

కల్తీ నెయ్యి సరఫరా చేసిందే కాక హెరిటేజ్‌ను వివాదంలోకి లాగుతారా?
పత్రిక ఉందని అడ్డగోలుగా కథనాలు
అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ధ్వజం
గవర్నర్ ప్రసంగానికి సభ ధన్యవాదాలు

16న రాష్ట్రానికి బిల్‌గేట్స్

₹ 3.32 లక్షల కోట్లతో నేడే బడ్జెట్ 13

11.20కి ప్రవేశపెట్టనున్న పయ్యావుల



బీఎన్‌పీ అధినేత తారిక్ రహ్మాన్

బంగ్లాదేశ్‌లో బీఎన్‌పీ భారీ విజయం

299 స్థానాలకు 212 సీట్లు కైవసం

70 స్థానాలకు పరిమితమైన జమాతే పార్టీ
ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న బీఎన్‌పీ అధినేత తారిక్ రహ్మాన్ 11
17 ఏళ్ల తర్వాత స్వదేశానికి వచ్చి అధికారం హస్తగతం చేసుకున్న తారిక్
అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ
హసీనాను అప్పగించాలని బీఎన్‌పీ విజ్ఞప్తి

వెనెజువెలా చమురు కోసం.. రిలయన్స్‌కు అమెరికా లైసెన్సు!

ఆంక్షలేవీ లేకుండా చమురు కొనుగోలు, శుద్ధి చేసిన ఉత్పత్తుల విక్రయాలకు చాన్స్
రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసిన నేపథ్యంలో వెసులుబాటు 11
భారత ప్రభుత్వ రంగ చమురు సంస్థలూ రిలయన్స్ బాటలో నడిచే అవకాశం

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

రూ.1.50 లక్షల వరకు.. 'పీఎం రాహత్'కు మోదీ శ్రీకారం.. 'సేవాతీర్థ్'లోకి పీఎంవో
కొత్త భవనాలు ప్రారంభించిన ప్రధాని
ఒకే గొడుగు కిందకు పీఎంవో, భద్రతా మండలి, క్యాబినెట్ సచివాలయాలు 11

సీఎం తల్లిని అవమానిస్తే.. 2 చిన్న మాటలా?



అంబటి రాంబాబు వ్యాఖ్యలను సమర్థిస్తారా?

వైసీపీ సభ్యులపై మంత్రి లోకేశ్ మండిపాటు

సొంత తల్లి, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు.. కానీ మాకుంది
జగన్ తల్లికైనా, ఏ మహిళకైనా ఒకే న్యాయం
మహిళల జోలికొస్తే వదిలిపెట్టేది లేదు
మండలిలో మండిపడిన మంత్రి
టీడీపీ, వైసీపీ మధ్య మాటల యుద్ధం

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'ఏవో రెండు చిన్న మాటలు అన్నారని' అంటూ అంబటి రాంబాబును వైఎస్ జగన్ వెనుకేసుకు రావడంపై మంత్రి లోకేశ్ మండిపడ్డారు. అవి చిన్న మాటలా అని నిలదీశారు. ముఖ్యమంత్రి తల్లిని అంబటి అవమానించారని, ఈ విషయంలో ఆయనను వదిలిపెట్టేది లేదన్నారు. శుక్రవారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి

మిగతా 13వ పేజీలో...

వైసీపీపై ఇక అఫెన్సే! గేమ్‌ప్లాన్ మారుద్దాం.. నేతలతో ఇష్టాగోష్ఠిలో లోకేశ్

వైసీపీ నుంచి వారసత్వంగా 'అరాచకం'



శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

చంద్రబాబు నేతృత్వంలో దాన్ని అధిగమించాం
అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం
రికార్డు స్థాయిలో రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం
'జల్ జీవన్'ను నిర్లక్ష్యం చేసిన వైసీపీ
అప్పట్లో వాడని 23 వేల కోట్లను కేంద్రాన్ని ఒప్పించి గడువు పెంచేలా చూశాం
ప్రతి ఇంటికీ కుళాయిని తెచ్చి చూపిస్తాం
ధన్యవాదాల తీర్మానంపై మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అరాచక, అసమర్థ, అవినీతి పాలన కూటమి ప్రభుత్వానికి పెను సవాలుగా మారిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా అనుభవంతో అన్నింటినీ అధిగమిస్తున్నామని, ప్రతి హామీనీ

మిగతా 12వ పేజీలో...

ఆలయాల పరిరక్షణ పాలక మండళ్ల బాధ్యత: పవన్ 2

కోస్టల్ కారిడార్‌లో మళ్లీ కదలిక!

విశాఖ నుంచి భోగాపురం వయా భీమిలి
ఆరు వరుసలు.. 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు
మాస్టర్ ప్లాన్‌లో పెట్టిన వీఎంఆర్‌డీఏ 2
కొన్ని ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లు
రూ.6,289 కోట్లు అవసరమని అంచనా



వీఎంఆర్‌డీఏ రివైజ్డ్ మాస్టర్ ప్లాన్‌లో కోస్టల్ కారిడార్ (బ్లూ రంగు చుక్కలు)

పేదల స్థలాలకు మళ్లీ క్రమబద్ధీకరణ 3

అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అమలు
దరఖాస్తులకు డిసెంబరు 31 వరకు గడువు



ఢిల్లీలో ప్రియాంకాగాంధీతో టీ-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

టీ-పట్టణం హస్తానిదే

తెలంగాణలోని 74 మునిసిపాలిటీలు, 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్ విజయబావుటా
14 మునిసిపాలిటీల్లో నెలకొన్న హంగ్
వీటిలోనూ అత్యధికం ఎంఐఎం, స్వతంత్రుల మద్దతు, ఎక్స్ అఫిషియో ఓట్లతో కాంగ్రెస్‌కే దక్కే చాన్స్
17 చోట్ల బీఆర్ఎస్, ఒకచోట బీజేపీకి మెజారిటీ
7 మునిసిపల్ కార్పొరేషన్లలో 4 కాంగ్రెస్ కైవసం
నిజామాబాద్, కరీంనగర్, కొత్తగూడెంలో హంగ్!
ఎంఐఎంతో కలిసి నిజామాబాద్, సీపీఐతో కలిసి కొత్తగూడెం కార్పొరేషన్లూ అధికార పార్టీకే? 2

ప్రశాంతంగా ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు

- 80 శాతానికి పైగా పోలింగ్..16 నుంచి కౌంటింగ్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల కోసం ఢిల్లీలోని సుప్రీంకోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 149 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. న్యాయవాదులు పెద్దఎత్తున ఓటింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. హైకోర్టు ప్రాంగణంలో ఈ నెల 16 నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి రిటర్నింగ్ అధికారిగా, జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. .

'హోల్డ్'లో తిరుపతి కార్పొరేషన్ విస్తరణ ప్రతిపాదన

- 2027 వరకు గ్రామాల విలీనం లేదు: మంత్రి నారాయణ

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సరిహద్దులను సవరించే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. అయితే ప్రస్తుతం కేంద్రం జనగణన నోటిఫికేషన్ ఇవ్వడంతో సరిహద్దుల్లో ఎలాంటి మార్పులూ చేయడటానికి వీల్లేదని స్పష్టం చేశారు. 2027 మార్చి 31 వరకు తిరుపతి కార్పొరేషన్ విస్తరణ ప్రతిపాదన హోల్డ్‌లో ఉంచామని చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థ విస్తరణపై వైసీపీ సభ్యుడు సిపాయి సుబ్రహ్మణ్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. పదేళ్లుగా ఎన్నికలు జరగని మున్సిపాలిటీలకు నిధులు రాక అభివృద్ధి ఆగిందని, ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ మోషేన్‌రాజు మంత్రికి సూచించారు.

అటవీశాఖలో డిజిటల్ ప్లాట్‌ఫారాల వినియోగం

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్లాట్‌ఫారాలను సమర్థంగా వినియోగించుకోవడం కోసం అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పాలనలో అంతర విభాగ సమన్వయం, డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా పర్యావరణ విభాగం పాలనను బలోపేతం చేయడానికి కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థలను వినియోగించుకోవడానికి అటవీశాఖ ముఖ్య దళాధికారి ప్రతిపాదన చేశారు.

ఆర్థిక మోసం కేసు కొట్టివేతపై సుప్రీంకు ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వంగపల్లి శశిభవాని అనే మహిళ వ్యాపార లావాదేవీల్లో భాగంగా ఆర్థికమోసం చేశారంటూ దాసరి నాగభూషణమ్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా, ధర్మవరం మొదటి పట్టణ పోలీసులు గత ఏడాది మార్చి 6న కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని సివిల్ వివాదంగా పేర్కొంటూ హైకోర్టు కేసును కొట్టివేసింది. ఈ మేరకు 2025 మార్చి 17న హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం నిర్ణయించింది. అప్పీల్ దాఖలుకు తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టులోని ఏపీ తరఫు ప్రత్యేక అధికారిని కోరుతూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం జీవో జారీ చేశారు.

జనగణన ప్రశ్నావళిలో ఓబీసీ కాలమ్ చేర్చాలి

- కేంద్ర మంత్రికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం వినతి


మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తదితరులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనగణన ఫార్మాట్‌లోని ప్రశ్నావళిలో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి వీరేంద్రకుమార్‌కు ఏపీ బీసీ సంక్షే మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జనగణన ఫార్మాట్ ప్రశ్నావళిలోని 12వ ప్రశ్నను పరిశీలిస్తే... కుటుంబ పెద్ద.. ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గం అని మాత్రమే ఉందని, వాటితోపాటు ఓబీసీ కాలమ్‌ను కూడా చేర్చి సమగ్ర కులగణన చేపట్టాలని విన్నవించారు. శుక్రవారం కేంద్రమంత్రితో ఆయన కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావుతో కలిసి శంకరరావు భేటీ అయ్యారు. మరోవైపు.. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేశ్ విజ్ఞప్తి చేశారు.

బీసీలకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి: ఆర్ కృష్ణయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బీసీల కోసం కేంద్రంలో ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయిలో గురుకులాలను స్థాపించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టాలని కోరారు. రాజ్‌నాథ్‌తో శుక్రవారం ఆయన భేటీ అయ్యారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను 27% నుంచి 56 శాతానికి పెంచడంతోపాటు క్రీమీ లేయర్‌ను తొలగించాలని అభ్యర్థించారు. పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదించి.. చట్టసభల్లో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

రాత్రి చలి.. పగలు ఎండ

విశాఖపట్నం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శీతాకాలం ముగిసి వేసవి ప్రవేశించే సమయం కావడంతో రాత్రి పూట చలి, పగటిపూట ఎండ తీవ్రత కొనసాగుతున్నాయి. ఉత్తరాది నుంచి పొడిగాలుల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో రాత్రి చలిగా ఉంటోంది. అల్లూరి జిల్లా అరకులోయలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉండడంతో పగలు ఎండ తీవ్రత పెరిగింది. కర్నూలులో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

జేఎల్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాలు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను ఏపీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. జేఎల్ పోస్టులకు 17 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 47 మందిని ఎంపికచేసినట్లు తెలిపింది. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానించి, వారి నుంచి తుది అభ్యర్థులను ఎంపిక చేసి, ఫలితాలు వెల్లడించింది.

రెండో శనివారమూ పని సరికాదు: ఫ్యాప్టో

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రెండో శనివారం కూడా పాఠశాలలు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఒత్తిడి చేయడం సరికాదని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి విమర్శించారు. విద్యా సంవత్సరంలో గరిష్ఠంగా 220 పనిదినాలు పని చేయాల్సి ఉందని, ఈ ఏడాది అంతకుమించి పనిచేసినా... ఇంకా రెండో శనివారాల్లోనూ పనిచేయాలనడం ఎందుకని ప్రశ్నించారు.

సృష్టి ఫెర్టిలిటీ కేసులో డాక్టర్ నమ్రత అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ సరగసి కేసు కేసులో విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అధినేత డాక్టర్ నమ్రతను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు ఆమెకు ఈ నెల 26వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

ఎల్విన్ ఎనర్జీకి రెండు సోలార్ అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఎల్విన్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ విజయభాస్కర్

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ప్రముఖ సోలార్ పరిశ్రమ ఎల్విన్ ఎనర్జీ రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకుంది. సోలార్ రంగానికి చెందిన ప్రముఖ గ్లోబల్ పబ్లికేషన్లు ఈక్వీ మ్యాగజైన్, సోలార్ క్వార్టర్ ఈ అవార్డులను అందజేశాయి. ఈక్వీ మ్యాగజైన్ నుంచి హైగ్రోత్ అండ్ క్వాలిటీ ఎక్సలెన్స్ అవార్డు దక్కించుకోగా, సోలార్ క్వార్టర్ నుంచి సోలార్ ఈపీసీ కంపెనీ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఎల్విన్ ఎనర్జీ దక్కించుకుంది. ఈ సందర్భంగా ఎల్విన్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ.. కస్టమర్ సంతృప్తిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న తమ ప్రయత్నాలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయన్నారు.


హెలికాప్టర్ నుంచి తాడు సాయంతో బోటులోకి దిగుతున్న నేవీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి

సాగరతీరంలో యుద్ధ విన్యాసాలు



విశాఖ తీరంలో కనువిందు చేస్తున్న యుద్ధ నౌకలు

విశాఖ సాగర తీరం యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ నెల 15 నుంచి అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష(ఐఎఫ్ఆర్), మిలాన్ కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశ, విదేశాల నుంచి యుద్ధనౌకలు, ట్యాంకులు విశాఖకు చేరుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం పదికిపైగా యుద్ధనౌకలు హార్బర్ వైపు పయనిస్తూ పర్యాటకులకు కనువిందు చేశాయి. అలాగే ఈ నెల 19న ఆర్కే బీచ్‌లో సాహస విన్యాసాల ప్రదర్శన నిర్వహించనున్నారు. దానికి సంబంధించిన రిహార్సల్స్ కూడా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి. హెలికాప్టర్ నుంచి తాడు సాయంతో సముద్రంలోని బోట్లపైకి దిగడం, పీ8 ఐ యుద్ధ విమానం వెలుగులు విరజిమ్ముతూ దూసుకెళ్లడం ఆకట్టుకున్నాయి. ఆర్మీకి చెందిన పలు యుద్ధ ట్యాంకులను ఆర్కే బీచ్‌లో ప్రదర్శనకు పెట్టారు. -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

కోస్టల్ కారిడార్‌కు మళ్లీ జీవం!

విశాఖ నుంచి భోగాపురం వయా భీమిలి.. ఆరు వరుసలు.. 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు

- మాస్టర్ ప్లాన్‌లో పెట్టిన వీఎంఆర్‌డీఏ
- కొన్ని ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లు
- ప్రాజెక్టుకు 6289 కోట్లు అవసరమని అంచనా



వీఎంఆర్‌డీఏ రివైజ్డ్ మాస్టర్ ప్లాన్‌లో కోస్టల్ కారిడార్ (నీలి రంగు చుక్కలు)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాది జూన్‌లో ప్రారంభం కానుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపాదిత కోస్టల్ కారిడార్ మళ్లీ జీవం పోసుకుంది. విశాఖపట్నం పోర్టు నుంచి రుషికొండ, భీమిలి మీదుగా భోగాపురం వరకూ బీచ్ కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. దీనికి నిధులు ఇవ్వడానికి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గతంలో అంగీకారం కూడా తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించి, ప్రాజెక్టును పట్టాలు ఎక్కించాలని ఆదేశించారు. దీంతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సమగ్ర ప్రణాళిక రూపొందించింది. ఈ నెల మొదటి వారంలో రవాణా శాఖ ఉన్నతాధికారులు దీనిపై జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) తన మాస్టర్ ప్లాన్-2041లో కారిడార్‌కు సంబంధించిన కొత్త వివరాలు నమోదు చేసి, ప్రజలకు అందుబాటులో ఉంచింది.


కొన్ని ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లు

కొత్త ప్రతిపాదనల ప్రకారం విశాఖ పోర్టు నుంచి కైలాసగిరి వరకు ప్రస్తుతం ఉన్న 30 మీటర్ల రహదారిని 40 మీటర్లకు విస్తరిస్తారు. అక్కడి నుంచి భోగాపురం వరకు రహదారిని 60 మీటర్ల వెడల్పున నిర్మిస్తారు. ఈ మార్గంలో కొన్నిచోట్ల ఎలివేటెడ్ కారిడార్లు కూడా వస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. విశాఖ నుంచి భీమిలి బీచ్ మార్గంలో ఎక్కడైతే పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు స్టార్ హోటళ్లు, రిసార్టులు నిర్మించారో.. వాటికి ఈ రహదారి విస్తరణ వల్ల ఇబ్బంది కలగకూడదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారని చెబుతున్నారు. సాగర్‌నగర్‌లో రాడిసన్ బ్లూ వద్ద 800 మీటర్ల వరకు ఎలివేటెడ్ కారిడార్ వస్తుందని సమాచారం. అదేవిధంగా భోగాపురం వద్ద విమానాశ్రయాన్ని ఈ రహదారిని కలిపే చోట కూడా ఎలివేటెడ్ కారిడార్ వేస్తారని అంటున్నారు.

55 కి.మీ పొడవున.. ఆరు వరుసల్లో


విశాఖలోని రాడిసన్ హోటల్ వద్ద రోడ్డు... ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్ రానుంది..

విశాఖ పోర్టుకు చెందిన కంటెయినర్ టెర్మినల్ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ 55 కిలోమీటర్ల పొడవున ఆరు వరుసల్లో బీచ్ కారిడార్ వేస్తారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల భూములకు లబ్ధి కలిగేలా భీమిలి సమీపాన కారిడార్ అలైన్‌మెంట్ మార్చేశారు. భీమిలి పట్టణంలో పురాతన కట్టడాలు దెబ్బతింటాయంటూ నేరెళ్లవలస మీదుగా మళ్లించారు. ఇప్పుడు మాస్టర్ ప్లాన్‌లో ఆ మార్గం తప్పించి, వేరే మార్గంలో కారిడార్‌ను ప్రతిపాదించినట్టు వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. కాగా, భీమిలి నుంచి భోగాపురం వరకూ 19.66 కిలోమీటర్ల పొడవున గ్రీన్ ఫీల్డ్ కారిడార్ వస్తుంది. అంటే ఇది కొత్తగా వేయాల్సిన మార్గం. దీనికి సుమారు 350 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ మొత్తం కోస్టల్ కారిడార్ ప్రాజెక్టు కోసం భూసేకరణకు రూ.4,315 కోట్లు, నిర్మాణాలకు రూ.1,974 కోట్లు అవసరం అవుతాయని అంచనా. వీటిలో కేంద్రం వాటా ఎంత? రాష్ట్రం వాటా ఎంత? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.



లక్ష మంది మన విద్యార్థులే!

- 'క్వాంటమ్' కోర్సులో ఏపీ విద్యార్థులు 1.1లక్షలు
- ఫీజు రాయితీకి 57 వేల మంది ఎంపిక
- దేశవ్యాప్తంగా కోర్సు చేస్తున్నవారు 3లక్షల మంది

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హేన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పీటీఈఎల్) అందిస్తున్న క్వాంటమ్ కోర్సుకు రాష్ట్ర విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. దేశవ్యాప్తంగా ఈ కోర్సును 3లక్షల మంది విద్యార్థులు నేర్చుకుంటుండగా, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే 1.1లక్షల మంది ఉండటం విశేషం. ఐఐటీ, మద్రాసు, ఐబీఎం సహకారంతో 'ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ కంప్యూటింగ్: క్వాంటమ్ ఆల్గారిథమ్స్ అండ్ క్విస్కిట్ కోర్సును అందిస్తోంది. ఉన్నత విద్యామండలి సూచనలతో రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఇతర కోర్సుల విద్యార్థులు కూడా ఈ కోర్సుకు నమోదుచేసుకున్నారు. మొత్తంగా 1.1లక్షల మంది విద్యార్థులు కోర్సు నేర్చుకునేందుకు ముందుకొచ్చారు. వారిలో డెంటల్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సులు చదివే విద్యార్థులూ ఉన్నారు.

రాయితీకి ఎంపిక

కాగా, రాష్ట్ర విద్యార్థులకు పరీక్ష రాసేందుకు రాయితీ ఇవ్వాలని ఎన్‌పీటీఈఎల్‌ను ఉన్నత విద్యా మండలి కోరింది. అందుకు అంగీకరించిన ఎన్‌పీటీఈఎల్ ఒక షరతు పెట్టింది. కోర్సులో కనీసం రెండు అసైన్‌మెంట్లలో 40శాతం మార్కులు రావాలని, ఆ మేరకు సాధించిన విద్యార్థులకు రూ.వెయ్యి ఫీజులో రూ.500 రాయితీ ఇస్తామని స్పష్టం చేసింది. 57,103 మంది విద్యార్థులు 40శాతం మార్కులు సాధించి పరీక్ష ఫీజులో రాయితీకి ఎంపికయ్యారు. మిగిలిన విద్యార్థులు రూ.వెయ్యి చెల్లించి పరీక్ష రాయొచ్చని ఉన్నత విద్యామండలి తెలిపింది.

ఆలయాల పరిరక్షణ పాలక మండళ్ల బాధ్యత

- గత పాలక మండలిలో తిరుమలలో అపచారాలు: పవన్ కల్యాణ్
- వర్చువల్‌గా శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గం ప్రారంభం


గిరిప్రదక్షిణ రోడ్డును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న పవన్ కల్యాణ్(స్క్రీన్‌లో)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాలక మండళ్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని.. రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమలలో ఎన్నో అపచారాలు జరిగాయని, నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే జరిగేవి కావన్నారు. కూటమి ప్రభుత్వంలో నియమించిన ఆలయ పాలక మండళ్లు.. ఆ తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాళహస్తిలో రూ .10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన గిరి ప్రదక్షిణ రోడ్డును శుక్రవారం ఉదయం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 'గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారం చేపట్టిన తర్వాత దేవదాయ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నారు. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా. శివరాత్రికి రెండు రోజుల ముందు శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. శివరాత్రి తరువాత అటవీ శాఖ ఆధ్వర్యంలో మార్గానికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నాం' అని అన్నారు.

త్వరలో శ్రీకాళహస్తి క్షేత్ర దర్శనం..

అరుణాచలంలో గిరిప్రదక్షిణ గురించి విన్నాక.. తనకు కూడా గిరిప్రదక్షిణ చేయాలనిపించిందని పవన్ కల్యాణ్ తెలిపారు. త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని దర్శించుకుంటానని వెల్లడించారు. అరుణాచలం లాగే ప్రతి పౌర్ణమికి ప్రత్యేకంగా శ్రీకాళహస్తి కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్ తదితరులు హాజరయ్యారు. శ్రీకాళహస్తి నుంచి వర్చువల్‌గా కలెక్టర్ వెంకటేశ్వర్లు, పాలక మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బాపిరెడ్డి, రాష్ట్ర హస్త కళల నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, అటవీ అధికారులు పాల్గొన్నారు.

స్కూళ్ల వద్ద ఫాస్ట్‌ఫుడ్ స్టాల్స్ తొలగించాలి!

- చిన్నారులు, యువత ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- కుప్పంలో జీర్ణకోశ వ్యాధుల బ్యాక్టీరియాపై పరిశోధనలు
- ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

విజయవాడ/భారతీనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు, యువత ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని.. యువతలో గుండెపోట్లు పెరగడానికి ఇదే కారణమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ డి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. స్కూళ్లు, విద్యాసంస్థల వద్ద ఫాస్ట్‌ఫుడ్ స్టాల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని, అక్కడున్న స్టాల్స్‌ను తొలగించాలని సూచించారు. చిన్నపిల్లల్లో జీర్ణాశయ, కాలేయ సమస్యలు రావడానికి ఫాస్ట్‌ఫుడ్డే కారణమని స్పష్టం చేశారు. ఈ ఆహారం వల్ల చెడు బ్యాక్టీరియా తయారవుతుందని చెప్పారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో జీర్ణకోశ వ్యాధులకు సంబంధించిన బ్యాక్టీరియాపై పరిశోధనలు చేస్తున్నామని, ఈ పరిశోధనల్లో మంచి బ్యాక్టీరియా, చెడు బ్యాక్టీరియాను గుర్తిస్తామని ఆయన తెలిపారు. ఏడాదిపాటు ఈ పరిశోధన జరుగుతుందన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో 'ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ ఏపీ చాప్టర్ ఎనిమిదో వార్షికోత్సవ సదస్సు 'ఏపీ ఈఎస్జీకాన్-2026' కార్యక్రమాలను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పిల్లల గట్ హెల్త్‌పై బాల్యం నుంచే శ్రద్ధ చూపించాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్రంలో కాలేయం, జీర్ణాశయ అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ సమస్యలను నయం చేయడానికి ఆధునిక చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. సంప్రదాయ ఆహారమే ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఫాస్ట్‌ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల పెద్దవారిలో మతి మరుపు, పిల్లలకు ఆటిజం వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఈఎస్జీకాన్ నిర్వాహక కమిటీ ప్రతినిధులు డాక్టర్ జవ్వాజి సతీశ్, డాక్టర్ జాలాది గోపీకృష్ణ, బత్తిన రాజేశ్, తాతా రవిశంకర్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ ప్రమోద్ గార్గ్, డాక్టర్ ఐ.ఆర్.ఎస్.గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్ కావాలో.. నేను కావాలో తేల్చుకోండి

- ప్రజలకు టీవీకే అధినేత విజయ్ పిలుపు.. సభలో మరొకరు బలి



చెన్నై, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ కావాలో, ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉండే తాను కావాలో తేల్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ ప్రజలకు పిలుపునిచ్చారు. 'నాకు అనుభవం లేదని కొంతమంది విమర్శిస్తున్నారు. నిజమే.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకునే అనుభవం నాకు లేదు. నాలాగా సొంతంగా పార్టీని స్థాపించి, ఒక్క శాతం ఓట్లయినా పొందే శక్తి ఉందా' అంటూ డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు సవాల్ విసిరారు. శుక్రవారం ఉదయం సేలం శివారు సీలనాయకన్‌పట్టిలో జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడిన విజయ్.. డీఎంకే, ఏఐడీఎంకేలపై విమర్శల వర్షం కురిపించారు. కాగా.. ఈ బహిరంగసభలో మరొకరు బలయ్యారు. చనిపోయిన యువకుడు మహారాష్ట్రకు చెందిన వెండి ఆభరణాల కార్మికుడు సూరజ్ (37)గా పోలీసులు గుర్తించారు. ఐదు వేల మంది మాత్రమే పట్టే ప్రాంగణానికి టీవీకే నేతలు పరిమితికి మించి కార్యకర్తలను తీసుకొచ్చారు. ప్రాంగణంలో కుర్చీలు వేయలేదు. దీంతో మూడు గంటలపాటు కార్యకర్తలు ఎండలో నిల్చోవల్సి వచ్చింది. దీంతో ఎండవేడిమిని తాళలేక సూరజ్ కుప్పకూలాడు. అతనిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. గత సెప్టెంబరు 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన రోడ్డు షోలో తొక్కిసలాట జరిగి 41 మంది చనిపోగా, వంద మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే.

సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం

తమిళనాడు ఎన్నికల్లో గానీ, తర్వాత గానీ 'ఇండియా', ఎన్డీఏ కూటములతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని విజయ్ స్పష్టం చేశారు. ఓ ఆంగ్ల చానల్ నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఇతర పార్టీల ర్యాలీలకు అనుమతి ఇస్తున్న ప్రభుత్వం.. టీవీకేకు మాత్రం అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

తెలంగాణ పట్టణం హస్తానిదే

74 మునిసిపాలిటీల్లో ఎగిరిన విజయబావుటా

- 17చోట్ల బీఆర్ఎస్ విజయం
- 24 మునిసిపాలిటీల్లో హంగ్ పరిస్థితి

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికార కాంగ్రెస్ మరోసారి సత్తా చాటింది. పంచాయతీ ఎన్నికల్లో సాధించిన విజయ పరంపరను కొనసాగిస్తూ.. మునిసిపల్ ఎన్నికల్లోనూ తిరుగులేని ఆధిపత్యం కనబరిచింది. రాష్ట్రవ్యాప్తంగా 116 మునిసిపాలిటీలకు ఎన్నికలు జరిగితే.. 74 మునిసిపాలిటీల్లో విజయబావుటా ఎగరేసింది. ఏడు కార్పొరేషన్లలో నాలుగింటిని స్పష్టమైన మెజారిటీతో కైవసం చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ 17 మునిసిపాలిటీల్లో మాత్రమే మెజారిటీ సాధించింది. ఏడు కార్పొరేషన్లలో ఒక్క చోట కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో డివిజన్లను గెలవలేకపోయింది. కాగా, బీజేపీ కరీంనగర్, నిజామాబాద్‌లో మెజారిటీ డివిజన్లను గెలుచుకుంది. ఈ రెండు చోట్ల పాలకవర్గాలను ఏర్పాటు చేయడానికి మద్దతు కోసం ప్రయత్నిస్తోంది. అయితే నిజామాబాద్‌ను ఎంఐఎం, స్వతంత్రులతో కలిసి కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్ యత్నిస్తోంది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, నల్లగొండ, రామగుండం కార్పొరేషన్లను హస్తం పార్టీ మెజారిటీతో దక్కించుకోగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో హంగ్ ఏర్పడింది. అక్కడ కాంగ్రెస్, సీపీఐ సమాన సంఖ్యలో డివిజన్లను గెలుచుకున్నాయి. అయితే సీపీఐ ఇప్పటికీ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉన్నందున ఆ పార్టీతో కలిసి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. మరోవైపు 24 మునిసిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. వీటిలో ఎక్కువ పట్టణాలను ఎంఐఎం, స్వతంత్రుల మద్దతుతో కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

ఉమ్మడి మెదక్ మినహా అన్ని జిల్లాల్లోనూ..

హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లాల్లో మునిసిపల్ ఎన్నికలు జరగగా.. మెదక్ తప్ప అన్ని జిల్లాల్లోనూ అత్యధిక మున్సిపాలిటీలను కాంగ్రెస్ దక్కించుకుంది. 70 శాతం మున్సిపాలిటీలను దక్కించుకుంది. బీఆర్ఎస్ కేవలం 12 శాతమే దక్కించుకోగలిగింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మాత్రమే బీఆర్ఎస్ పట్టు నిలబెట్టుకోగలిగింది.కేసీఆర్ సొంత నియోజకవర్గంలోని గజ్వేల్, కేటీఆర్ నియోజకవర్గంలోని సిరిసిల్ల మునిసిపాలిటీల్లో మెజారిటీ సాధించడం గులాబీ పార్టీకి ఊరటనిచ్చింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ గట్టి పోటీ ఇచ్చినా.. మునిసిపాలిటీల్లో మాత్రం నిలవలేకపోయింది.

కార్పొరేషన్లు	7
కాంగ్రెస్	రామగుండం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నల్లగొండ
బీజేపీ	కరీంనగర్
హంగ్	నిజామాబాద్, కొత్తగూడెం

మునిసిపాలిటీలు (116)	
కాంగ్రెస్	74
బీఆర్ఎస్	17
బీజేపీ	0
ఇతరులు	1
హంగ్	24



పుష్పపల్లకిపై విహరిస్తున్న ఆది దంపతులు

పుష్ప పల్లకిపై శ్రీశైలేశుడు

నేడు గజ వాహన సేవ

శ్రీశైలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవ సంబరాలు అంబరానంటుతున్నాయి. గ్రామోత్సవంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పుష్ప పల్లకి సేవ నిర్వహించారు. పుష్పపల్లకిలో ఆది దంపతుల దివ్య దర్శనంతో భక్తజనం పులకించింది. బ్రహ్మోత్సవాల్లో 6వ రోజైన శుక్రవారం సాయంత్రం అక్కమహాదేవి అలంకారమండపంలో ఉత్సమూర్తులకు షోడషోపచార పూజలు అర్చకవేదపండితులచే జరిపించి హారతులు ఇచ్చారు. అనంతరం స్వామిఅమ్మవార్లను మేళతాళాల నడుమ గంగాధర మండపం వద్దకు తొడ్కొని వచ్చి పుష్పపల్లకిపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు శనివారం స్వామిఅమ్మవార్లు గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.



శ్రీవారి ఆలయం ముందు కూల్ పెయింట్ వేస్తున్న సిబ్బంది

తిరుమలలో వేసవి ఏర్పాట్లు

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ చర్యలు

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఉపశమనం కల్పించేలా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లను ప్రారంభించింది. సాధారణంగా శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు ఎండ కారణంగా ఇబ్బంది కలగకుండా నడిచేందుకు వీలుగా టీటీడీ కూల్ పెయింట్ వేస్తోంది. అలాగే మాడవీధుల్లో గ్యాలరీ పక్కనే భక్తుల సౌకర్యం కోసం గ్రీన్‌మ్యాట్‌తో పందిళ్లు వేస్తోంది. ప్రస్తుతం తూర్పు మాడవీధిలో ఈ పందిళ్ల నిర్మాణం పూర్తయింది. త్వరలో మిగిలిన ప్రాంతాల్లోనూ ఈ గ్రీన్ మ్యాట్‌తో పైకప్పును ఏర్పాటు చేయనున్నారు.

రాష్ట్రంలో రాజకీయ అవినీతే ఎక్కువ!

రూ.వెయ్యి కోట్ల లంచాలతో డ్రగ్స్ మాఫియా

నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు: సీపీఐ ఈశ్వరయ్య

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక అవినీతి కంటే రాజకీయ అవినీతి అధికంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. శుక్రవారం నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి ఎక్కువగా ఉందని.. మెడికల్ మాఫియా, ఫార్మా మాఫియా విచ్చలవిడిగా సాగుతోందని ఆరోపించారు. యంత్రాంగం ఏడాదికి సుమారు రూ.వెయ్యి కోట్లు లంచాల రూపంలో తీసుకుంటూ బోగస్ డ్రగ్స్ మాఫియాను పెంచి పోషిస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు 60వేల ఔషధ దుకాణాలు ఉండగా, వీటిల్లో బీఫార్మసీ, డీ ఫార్మసీ వంటి అర్హత కలిగిన వారు ఎంతమంది ఉన్నారో స్పష్టత లేదని తెలిపారు. ఇందులో 30 వేల మంది అర్హులు ఉండగా మరో 30వేల మంది నకిలీ సర్టిఫికెట్లతో మందులు దుకాణాలు నడిపిస్తున్నారని చెప్పారు. దీనిపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోక పోవటం చూస్తుంటే దీనివెనుక ఎంతగా రాజకీయ అవినీతి ఉందో అర్థమవుతోందని విమర్శించారు. అర్హత లేని వారికి అధికారుల అండదండలతో మందుల షాపులు కొనసాగిస్తున్నారని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 21 ప్రకారం ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని, అయితే, కూటమి ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేస్తోందన్నారు. మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసనలో వామపక్ష అనుబంధ సంఘాలన్నీ పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నా కేవలం తిరుపతి లడ్డూ విషయంలో వివాదాలు చేసుకుంటూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన ఎరువులు, పురుగు మందులు సీజ్



కంతేరులో అనధికార గోదాము, ఇంట్లో నిల్వ ఉంచిన ఎరువులు

ఇరగవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం కంతేరులోని ఒక ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో రూ.కోటి విలువైన ఎరువులు, పురుగు మందులు సీజ్ చేయడం సంచలనం సృష్టించింది. ఒకే చోట భారీ ఎత్తున ఎరువులు, పురుగుమందులు నిల్వ చేయడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి అని విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. విజిలెన్స్ ఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కంతేరులోని దీవెన ఆగ్రోకెమికల్స్ ఎరువుల, పురుగుల మందుల దుకాణంలో దాడులు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి దాటే వరకూ ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ సందర్భంగా రూ.14,34,142 విలువైన ఎరువుల నిల్వల్లో వ్యత్యాసం గుర్తించారు. రూ.80,01,059 విలువైన 22,893.2 కిలోల పురుగు మందులు అనధికారిక నిల్వలు గుర్తించారు. గోదామును సీజ్ చేసి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ కె.సీతారాం తెలిపారు. దుకాణంతో పాటు ఇంటిలో నిల్వ ఉంచిన సరుకును స్వాధీనం చేసుకుని మండల వ్యవసాయ అధికారి వై.రాఘవేంద్రరావుకు అప్పగించారు.

పేదల స్థలాలకు మళ్లీ క్రమబద్ధీకరణ

అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అమలు

డిసెంబరు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2025 డిసెంబరుతో ఈ స్కీమ్ గడువు ముగిసిపోయింది. కొత్త ఏడాది కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని, క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా కోరారు. ఈ నేపథ్యంలో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ స్కీమ్‌ను మరోసారి అమల్లోకి తీసుకొస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో నం.115) జారీ చేశారు. గత ఏడాది ఇంటి స్థలాల క్రమబద్ధీకరణను జీవో నం.30 ద్వారా ఏడాదిపాటు అమలు చేశారు. అయితే, చాలా మంది పేదలు దరఖాస్తు చేసుకోలేదు. స్కీమ్‌పై సరైన అవగాహన లేకపోవడం, ఇంకా ఇతర భయాలతో దరఖాస్తు ప్రక్రియకు దూరంగా ఉన్నారు. దీంతో ఈ ఏడాది మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించాలని పల్లా శ్రీనివాసరావు కోరగా, రెవెన్యూశాఖ సానుకూలంగా స్పందించింది. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అంటే, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు, ఇంకా పూరిపాకలు, తాత్కాలిక షెడ్‌లు వేసుకుని నివసిస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చెరువులు, కుంటలు, కాలువ, చెరువు పోరంబోకు, డిఫెన్స్, ఇతర కీలకమైన ప్రభుత్వ ప్రయోజనాలతో ముడిపడిన భూముల్లో క్రమబద్ధీకరణకు అవకాశం ఉండదు. నివాస యోగ్యమైన ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని పక్షంలోనే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు అమల్లో ఉన్న నిబంధనల మేరకు ఈ పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ ఆదేశించింది.

గాజువాకలో వెయ్యి చ.గజాలు క్రమబద్ధీకరణ

భూముల క్రమబద్ధీకరణలో విశాఖ జిల్లా గాజువాకకు మరో స్కీమ్‌ను ప్రభుత్వం పునరుద్ధరించింది. గాజువాక గ్రామ పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇంటి నిర్మాణం చేసుకుంటే వెయ్యి చదరపు గజాల వరకు క్రమబద్ధీకరణకు అనుమతించనున్నారు. 2025 డిసెంబరులో ఈ స్కీమ్ గడువు ముగిసింది. గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు ఈ స్కీమ్ ఈ ఏడాది కూడా అమలు చేయాలని రెవెన్యూశాఖ ఉత్తర్వులు (జీవోనం.114)జారీ చేసింది. క్రమబద్ధీకరణ దరఖాస్తులను ఈ ఏడాది జూన్ 30 వరకు స్వీకరించాలని తాజా గడువును నిర్దేశించింది. జీవో నం. 45 ప్రకారం క్రమబద్ధీకరణ ప్రక్రియ ఉంటుందని తెలిపింది.





శ్రీ సచ్చిదానంద సరస్వతి, స్వామీజీకి నివాళులర్పిస్తున్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ

తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి శివైక్యం

తుని ఆశ్రమానికి తరలివచ్చిన ప్రముఖులు

తుని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలోని తపోవన ఆశ్రమం పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి జీ (52) శివైక్యం చెందా రు. శుక్రవారం తెల్లవారుజామున తపోవనం క్షేత్రంలో స్వామిజీ గుండె పోటుతో తుదిశ్వాస విడిచారు. స్వామిజీ నిత్యం గోసేవ, ధర్మ పరిరక్షణకు పరితపించేవారు. స్వామిజీ పార్థివ దేహానికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. శుక్రవారం సాయం త్రం తపోతన క్షేత్రంలో శాస్త్రోక్తంగా స్వామిజీ అంతిమ క్రతువులు ముగిశాయి.

శివరాత్రి తర్వాత శుభం: డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగ తర్వాత శుభం జరుగుతుందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. తుమకూరు జిల్లా తిపటూరు తాలూకా కాడసిద్దేశ్వర మఠాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో పెద్దలతో ఏం చర్చలు జరిపాననేది బహిరంగంగా చెప్పలేనని అన్నారు. ముందు ముందు ఏం జరుగుతుందనే అంశాలపై చర్చించలేదని, ఏం చేయాలనే ఆలోచనలో ఉన్నానని తెలిపారు. అవధూత అజ్జయ్య మఠంతో తనకు ఎనలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని, పేర్కొన్నారు.

అతని కోసం..

16 తులాల బంగారం, రూ.6 లక్షల నగదుతో పరార్

సామాజిక మాధ్యమంలో పరిచయం ప్రేమగా రూపాంతరం

తెలంగాణ యువకుడి వద్దకు వెళ్లిపోయిన శ్రీకాకుళం యువతి

15 రోజులుగా తల్లిదండ్రుల గాలింపు, ఎట్టకేలకు గుర్తింపు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమంలో పరిచయం ప్రేమగా మారి ఇంట్లో నగదు, నగలు తీసుకుని తల్లిదండ్రులకు తెలియకుండా యువతి వెళ్లిపోయిన ఉదంతమిది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెళ్లీడుకొచ్చిన యువతికి ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు.. ఎన్ని సంబంధాలు చూసినా ఆ అమ్మాయి అంగీకరించడంలేదు. ఇలా ఈ వ్యవహారం కొనసాగుతుండగానే 15 రోజుల క్రితం ఆమె కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు కంగారుపడి యువతి సెల్‌ఫోన్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు. బంధువుల ఇళ్లకు వచ్చిందేమోనని వాకబు చేస్తే రాలేదని సమాధానం వచ్చింది. ఎట్టకేలకు రెండ్రోజుల క్రితం కాల్ చేయగా ఆమె స్పందించింది. తాను తెలంగాణకు చెందిన యువకుడిని ప్రేమించానని, అతని వద్దకే వచ్చానని చెప్పింది. దీంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు ఇంట్లో బీరువా వెదకగా అందులో ఉండాల్సిన 16 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు కనిపించలేదు. దీంతో అమ్మాయి కుటుంబ సభ్యులు వజ్రపుకొత్తూరు పోలీసులను ఆశ్రయించారు. తన ఇష్టప్రకారమే ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నట్టు ఆమె పోలీసులకు చెప్పింది. అమ్మాయి మేజరు కావడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. ఈ విషయమై వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించగా కేసు నమోదు కాలేదని చెప్పారు.



పాకల గ్రామం రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

'ఉపాధి' నిర్వీర్యానికి బీజేపీ కుట్ర

వీబీజీ రామ్‌జీ చట్టం రాష్ట్రానికి పెనుభారం: షర్మిల

సింగరాయకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిలారెడ్డి విమర్శించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల అంబేడ్కర్ కాలనీలో ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా శుక్రవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత ఉపాధి కూలీలతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టంతో రాష్ట్రానికి ఏటా రూ.5వేల కోట్లు పెనుభారం పడుతుందని తెలిపారు. అది తెలిసి కూడా చంద్రబాబు ప్రభుత్వం ఆ చట్టానికి పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం దుర్మార్గమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల కోసం చిత్తశుద్ధితో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తే.. అలాంటి పథకాన్ని బీజేపీ చంపేస్తుంటే ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. బీజేపీని ఎదిరించే సత్తాలేక జగన్ మోదీకి అమ్ముడుపోయారని ఘాటు వాఖ్యలు చేశారు. పాత ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని కల్పించలేని వారు కొత్త పథకంలో 125రోజులు పని కల్పిస్తారా? అంటూ ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్, మండల అధ్యక్షుడు ఎస్కే. రసూల్ పాల్గొన్నారు.

24 లక్షల విలువైన మద్యం బాటిళ్లు ధ్వంసం



పేరుపాలెం తీరంలో రోడ్డు రోలర్‌తో మద్యం సీసాలను తొక్కిస్తున్న దృశ్యం

మొగల్తూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సీజ్ చేసిన అనుమతి లేని, నిషేధిత మద్యం సీసాలు, నాటు సారాను శుక్రవారం మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్ వద్ద ధ్వంసం చేశారు. రూ.24 లక్షలు విలువైన లిక్కర్‌ను జిల్లా ఎస్పీ నయీం అస్మి ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో అక్రమ మద్యం రవాణా, మద్యం, సారా తయారీదారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 4,650 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 2,136 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లతోపాటు 620 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ భీమారావు, నరసాపురం ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ శ్రీవేద, పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సింగరాయకొండ మండలం పాకల సముద్రతీరంలో బీచ్ ఫెస్టివల్‌కు సిద్ధమైన ప్రాంగణం

నేడు, రేపు ప్రకాశంలో బీచ్ ఫెస్టివల్

పాకల సముద్ర తీరంలో భారీ ఏర్పాట్లు

ఒంగోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్ జరగనుంది. శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని సింగరాయకొండ మండలం పాకల సముద్రతీరంలో ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేశారు. వివిధ సాంస్కృతిక, వినోద, క్రీడా కార్యక్రమాలతో పాటు బోట్ రైడింగ్, హెలికాప్టర్ ప్రయాణం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. తొలిరోజైన శనివారం సాయంత్రం జరిగే సాగర హారతి అనంతరం జరిగే కార్యక్రమాల్లో ఆ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామితో పాటు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొననున్నారు. రెండవ రోజు సాయంత్రం మంత్రి కొల్లు రవీంద్ర హాజరుకానున్నారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరగనుండగా జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాలో మళ్లీ బీఎన్పీ

తారీఖ్ రహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని కాబోతున్నారు. మూడున్నర దశాబ్దాల తరువాత ఆ పీఠం మీద ఒక పురుషుడు కూచోబోతున్నారు. ఆ దేశానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి మగ ప్రధాని కూడా. జీవితంలో ఒక్క ఎన్నిక కూడా గెలవని వ్యక్తి ఇప్పుడు నేరుగా దేశపాలకుడైనాడు. పదిహేడేళ్ళ ప్రవాసంలో ఉండి, ఓ యాభై రోజుల క్రితమే దేశంలో కాలూనిన తారీఖ్ నేతృత్వంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) మూడింట రెండువంతుల స్థానాలు గెలుచుకోవడం విశేషం. లండన్‌లో ఉంటూ, యూనిస్ ప్రభుత్వం మీద ఎప్పటికప్పుడు ఒత్తిడి పెంచుతూ, ఎన్నికల తేదీ ప్రకటించిన తరువాతే స్వదేశానికి రావడం, ఈ స్వల్పకాలంలోనే ఆయన తల్లి, బీఎన్పీ అధినాయకురాలు ఖలీదా జియా కన్నుమూయడం ఈ భారీ విజయానికి దోహదం చేశాయి.

హసీనా పార్టీ బరిలో లేకపోవడం ఓటింగ్ శాతాన్ని బాగా తగ్గించినా, అనుకున్నట్టుగానే ఖలీదా పార్టీకి లాభించింది. అవామీలీగ్ ఓట్‌బ్యాంక్ గణనీయంగా బీఎన్పీవైపు మళ్ళింది. పట్టణప్రాంతాలు, మధ్యతరగతి, మహిళలు జమాత్–ఏ–ఇస్లామీని ఆదరించలేదు కనుక, ఆది మనం భయపడినట్టుగా ఘన విజయాలు సాధించలేదు. తమ దేశం మరో అఫ్ఘానిస్థాన్ కాకూడదని బంగ్లా మహిళలు అనుకొని ఉంటారు. అధిక శాతం యువత కూడా జమాత్‌తో పోల్చితే బీఎన్పీ ఉత్తమమని భావించింది. హిందువులతో సహా మైనారిటీలంతా పెద్దసంఖ్యలో బీఎన్పీకే ఓటేశారు. అయినప్పటికీ, కొత్త సభలో జమాత్ పదకొండుపార్టీల కూటమితో బలమైన విపక్షంగా నిలబడగలిగింది. ఎన్నికల్లో లబ్ధికోసం హిందువుల మీద దాడులకు పాల్పడిన జమాత్‌ను యూనిస్ ప్రభుత్వం ఇతోధికంగా ఎగదోసింది. ఒకదశలో జమాత్ మహాద్భుత విజయం సాధిస్తుందన్న అంచనాలు కూడా వెలువడ్డాయి. చివరకు, ఈ పాకిస్థాన్ అనుకూల మతఛాందసశక్తి అధికారంలోకి రాకూడదన్న భారత్ కోరిక నెరవేరింది.

విద్యార్థి ఉద్యమమే హసీనా ప్రభుత్వాన్ని కుప్పకూల్చి, ఆమెను దేశం నుంచి వెళ్ళగొట్టినప్పటికీ, నేషనల్ సిటిజెన్స్ పార్టీ ఈ ఎన్నికల్లో స్వల్ప విజయాలు సాధించడం ఆశ్చర్యం. తిరుగుబాటు కాలంలో వల్లెవేసిన ఆదర్శాలు, ఎజెండాలు గాలికి కొట్టుకుపోయి, అంతిమంగా జమాత్‌తో చేయికలపడం వారిని అరడజను స్థానాలకు పరిమితం చేసింది. హసీనాను గద్దెదించడంలో కీలకంగా వ్యవహరించిన విద్యార్థి నాయకులంతా జమాత్ విద్యార్థి విభాగానికి చెందినవారే.

భవిష్యత్తులో జమాత్ మరింత బలపడవచ్చునేమో కానీ, ఇప్పటికైతే మూడింట రెండువంతుల మెజారిటీతో బీఎన్పీ గెలిచినందుకు సంతోషించాలి.

తొలి ప్రసంగంలోనూ, ఎన్నికల సందేశాల్లోనూ తారీఖ్ దృక్పథం ఏంటో తెలుస్తోంది. దేశంలో కాలూనగానే 'ఐ హేవ్ ఏ ప్లాన్' అంటూ యావత్ దేశాన్ని ఒక్కటిగా ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అన్ని మతాలను పేరుపేరునా ప్రస్తావించి సమానంగా చూస్తానన్న సందేశాన్ని ఇచ్చాడు. 'బంగ్లాదేశ్ ఫస్ట్' అంటూ భారత్, పాకిస్థాన్ తనకు సమదూరమన్నాడు. యూనిస్ ప్రభుత్వం చైనా, పాకిస్థాన్‌లతో రాసుకుపూసుకున్న నేపథ్యంలో, కొత్త ప్రధాని తన విధానం 'నాట్ డిల్లీ, నాట్ పిండి' అనడం సంతోషమే. భారత్‌తో ఘర్షణపడే ఉద్దేశంలో ఆయన లేడు. బీఎన్పీ మేనిఫెస్టో కూడా భారత్ పేరు ప్రస్తావించకుండా వాణిజ్యం, నీటిపంపకాలు ఇత్యాది విషయాల్లో సానుకూల వ్యాఖ్యలే చేసింది. యూనిస్ ప్రభుత్వం ఏలుబడిలో దిగజారిన ఉభయదేశాల సంబంధాలు ఇకపై మెల్లగా మెరుగుపడతాయని భావించాలి. హసీనా అధికారంలో ఉన్నప్పటి పూర్తి సానుకూలతనైతే కొత్త ప్రభుత్వం నుంచి ఆశించలేం. బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రిబ్యునల్ ఉరిశిక్ష విధించిన హసీనాను అప్పగించే అంశం రెండు దేశాల మధ్యా ఎన్నటికీ తెగని వివాదంగా, అతుకుపడేందుకు అడ్డంకిగా ఉంటున్నది వాస్తవం. 2001–06 మధ్యకాలంలో ఖలేదాజియా ప్రధానిగా ఉండగా, జమాత్ భాగస్వామిగా బీఎన్పీ అనుసరించిన భారత వ్యతిరేక వైఖరి తెలిసిందే. పాక్ ఉగ్రసంస్థలకూ, ఈశాన్య రాష్ట్రాల్లోని తిరుగుబాటుదారులకు ఆమె ప్రభుత్వం ఆర్థిక, ఆయుధసాయం అందించింది. ప్రధాని నివాసానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న హవా భవన్‌లో కూచొని, సర్వమూ తానే అయి అన్నీ చక్కబెట్టిన ఖలేదా కుమారుడు ఇప్పుడు తాను మారిన మనిషినని అంటున్నాడు. భారత్‌తో తారీఖ్ రహ్మాన్ 2.0 వ్యవహారం ఎలా ఉండబోతున్నదో చూడాలి.

సమరీతిలో లేని ఇచ్చిపుచ్చుకోవడాలు!

అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య చర్చలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చాయి. ఉభయ దేశాల ప్రభుత్వాలు 2026 ఫిబ్రవరి 6న ఒక సంయుక్త ప్రకటన జారీ చేశాయి. 'అది ఏమిటి?'. ఇది ఆ సంయుక్త ప్రకటనకు యోగ్యమైన ప్రశ్న. ఆ సంయుక్త ప్రకటన అంతులేని ఊహాగానాలను పురిగొల్పింది. దానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత ప్రభుత్వం వాణిజ్య ఒప్పందం వివరాలను విపులంగా వెల్లడించకపోవడం వల్ల ఆ అనుమానాలు పెరిగాయేగానీ తొలగిపోలేదు, తగ్గలేదు. ఉభయ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎలా ఉండాలనే విషయాన్ని ప్రభావదాయకంగా నిర్ణయించిందీ, నిర్దేశించిందీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నది నిరాకరించలేని వాస్తవం. కనుక ఆ సంయుక్త ప్రకటనలోని అంశాలు అమెరికాకు ఆందోళన కలిగించకపోవచ్చు గానీ భారత్‌కు తప్పకుండా కలవరం కలిగిస్తున్నాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఉభయ దేశాల మధ్య వాణిజ్య చర్చలలో పాల్గొన్న భారత్ ప్రతినిధులు గత ఏడాది తాము అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయమై సంప్రదింపులు జరుపుతున్నామని పదే పదే ప్రకటించారు. సమీప భవిష్యత్తులోనే అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనున్నదని భారత వాణిజ్య మంత్రి స్వయంగా అనేక మార్లు చెప్పారు. 2025 సంవత్సరాంతంలోగానే ఇండో–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తప్పక ఖరారు అవుతుందని కూడా ఆయన ప్రకటించారు. తీరా కొద్దిరోజుల క్రితం సంయుక్త ప్రకటన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కాదు. అది ఒక మధ్యంతర ఒప్పందం కూడా కాదు; అది ఒక మధ్యంతర ఒప్పందానికి ఒక చట్రం మాత్రమే. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నాం సుమా!

సంయుక్త ప్రకటన జారీ అయిన తరువాత అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం పరస్పర ప్రయోజనకరమని ఇరు పక్షాలూ ప్రకటించాయి. ఈ వాదన పాఠకుని ఇంగితాన్ని అవమానపరచడమే. సంయుక్త ప్రకటనను పైపైన పరిశీలించినా సదరు ఒప్పందం పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన లేనే లేదని స్పష్టమవుతుంది. ఇప్పుడు ఆ సంయుక్త ప్రకటనను నిశితంగా చూద్దాం: అమెరికా పారిశ్రామిక సరుకులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులలో చాలా వాటిపై భారత్ సుంకాలను పూర్తిగా తొలగిస్తుంది లేదా గణనీయంగా తగ్గిస్తుంది. ఇందుకు అనుగుణంగా భారత్ ఎగుమతులపై విధించే సుంకాలను అమెరికా (2025 ఏప్రిల్ 2న విధించిన 25 శాతం నుంచి) 18 శాతానికి తగ్గిస్తుంది. జౌళి ఉత్పత్తులు, వస్త్రోత్పత్తులు, చర్మ ఉత్పత్తులు, పాదరక్షలు, ప్లాస్టిక్స్, రబ్బర్, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ సామగ్రి, చేతి వృత్తుల ఉత్పత్తులు, నిర్దిష్ట యంత్రాలు మొదలైన భారతీయ సరుకులపై అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గనున్నాయి. మధ్యంతర ఒప్పందాన్ని విజయవంతంగా అమలుపరచిన తరువాత జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, ముత్యాలు, వజ్రాలు, విమానాల విడిభాగాలు మొదలైన వాటిపై సుంకాలను అమెరికా తొలగిస్తుంది. భారత్ సుంకాలు పూర్తిగా తొలగించవలసి ఉండగా అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తుంది– ఇందులో సుంకాలు పరస్పర ప్రయోజనకరంగా ఉండేందుకు దోహదం చేసేది ఏమైనా ఉన్నదా?!

అమెరికా వైద్య పరికరాల వాణిజ్యంలోను, అమెరికా ఐసీటీ సరుకుల విషయంలో పరిమితులతో కూడిన లైసెన్సింగ్ విధానం రద్దు చేసేందుకు సుదీర్ఘకాలంగా ఉన్న అవరోధాలను తొలగించేందుకు భారత్ అంగీకరించింది. అమెరికా ఆహార, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై సుంకాలేతర అవరోధాలను తొలగించేందుకు కూడా భారత్ అంగీకరించింది. అయితే ఇందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవల్సిన బాధ్యత అమెరికాకు లేదు. సుంకాలేతర అవరోధాలను తొలగించడం భారత్ తప్పనిసరి బాధ్యత కాగా అటువంటి బాధ్యత అమెరికాకు లేదు! ఇది ఎలా పరస్పర ప్రయోజనానికి తోడ్పడుతుంది?; రాబోయే అయిదు సంవత్సరాలలో భారత్ 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ కోల్ (ఉక్కు తయారీలో ఉపయోగించే బొగ్గు)ను కొనుగోలు చేస్తుంది. గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, డేటా సెంటర్స్‌లో ఉపయోగించే ఇతర ఉపకరణాలు మొదలైన టెక్నాలజీ ఉత్పత్తుల వాణిజ్యాన్ని ఉభయ దేశాలు గణనీయంగా పెంపొందించుకున్నాయి. ప్రస్తావిత సరుకులు అన్నీ అమెరికా ఎగుమతులేకానీ, అమెరికా కొనదలుచుకున్న భారత్ ఉత్పత్తులు కావు. ఇటువంటి ఏకపక్ష వాణిజ్యం పరస్పర లబ్ధినిస్తుందా?



సంయుక్త ప్రకటనతో పాటు జారీ చేసిన ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భారత్ చేపట్టనున్న 'ప్రధాన చర్యల' గురించి అమెరికా అధ్యక్షుడు ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు ప్రత్యక్ష, పరోక్ష కొనుగోళ్లను నిలిపివేసేందుకు, అమెరికా ఇంధన ఉత్పత్తుల కొనుగోళ్లకు, అమెరికాతో మధ్యంతర ఒప్పంద చట్రాన్ని రక్షణ రంగంలో సహకారానికి కూడా విస్తరింపజేసేందుకు భారత్ కట్టుబడి ఉన్నది. ఈ కారణంగా 2025 ఆగస్టు 6న భారత్ తనపై విధించిన 25శాతం అదనపు సుంకాన్ని ఉపసంహరించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు నిర్ణయం తీసుకున్నారు. మూడు కీలక అంశాలలో భారత్ నుంచి హామీ పొంది, అందుకు ప్రత్యుపకారంగా అమెరికా ఎటువంటి సానుకూల నిర్ణయాలు తీసుకోపోవడం పరస్పర ప్రయోజనకర సూత్రానికి అనుగుణంగా ఉన్నదా?

రష్యా నుంచి చమురు ప్రత్యక్ష లేదా పరోక్ష కొనుగోలును భారత్ పునఃప్రారంభిస్తే భారతీయ సరుకులపై 25శాతం దండనాత్మక సుంకం విధింపుతో సహా అదనపు కఠిన చర్యలు చేపట్టే విషయాన్ని అమెరికా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది: ఇది బెదిరింపు కాదా?

2026 ఫిబ్రవరి 6న ఉభయదేశాలు అంగీకరించిన వాణిజ్య ఒప్పందం రష్యా చమురు అనే నిర్దిష్ట అంశంపై ఆధారపడి ఉన్నది. భారత్ ఎట్టి పరిస్థితులలోను రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదు. అని అమెరికా నిర్దేశించింది. దాన్ని భారత్ అంగీకరించింది. అమెరికా బెదిరింపు, భారత్ విధేయత మధ్య పరస్పర ప్రయోజనాలకు తోడ్పడేది ఏమైనా ఉన్నదా?

2025 ఏప్రిల్ 2న భారతీయ సరుకులపై అమెరికా సుంకాలు 3శాతంగా మాత్రమే ఉన్నాయి. భారత్‌కు ద్వైపాక్షిక వాణిజ్య మిగులు సమకూరుతున్నందున డోనాల్డ్ ట్రంప్ తన ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించి భారత్ ఎగుమతులపై సుంకాలను 25శాతానికి పెంచారు. ఇప్పుడు వాటిని 18శాతానికి తగ్గించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత భారత్ సహా వివిధ దేశాలపై విధించిన ప్రతీకార సుంకాల చట్టబద్ధత అంశం ఇప్పుడు అమెరికా సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. సుంకాల పెంపుదల రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే భారత్‌కు ఎనలేని మేలు జరుగుతుంది. సుంకాల విషయంలో పూర్వ స్థితిని ఉభయ దేశాలు పునరుద్ధరించవలసి ఉంటుంది. భారత్‌కు ఎటువంటి ప్రయోజనకర రాయితీలు ఇవ్వకుండానే అమెరికా మన నుంచి అనేక రాయితీలను సాధించుకున్నది. ఇదేమి ఇచ్చి పుచ్చుకోవడం? ఆదాన ప్రదానాలు అసమ రీతిలో ఉండడం న్యాయబద్ధమేనా?

ఉక్కు, అల్యూమినియంలపై సుంకాలు 50శాతం నిలిచిపోతాయి, ఆటోమొబైల్స్ విడిభాగాలపై సుంకాలు 25శాతంగా ఉండిపోతాయి. అయితే అమెరికా పారిశ్రామిక వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఎర్ర జొన్నలు, సోయాబీన్ ఆయిల్, వైన్స్, ఇంకా ఆటోమొబైల్స్, ఎర్ర జొన్నలు, హై–ఎండ్ మోటార్ సైకిల్స్ మొదలైన వాటిపై ఆ దేశం బాగా ప్రయోజనకరమైన రాయితీలను ఇస్తుందని అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల నిపుణుడు అజయ్ శ్రీవాస్తవ ఎత్తి చూపడం గమనార్హం.

రాబోయే అయిదేళ్ల కాలంలో భారత్ 500 బిలియన్ డాలర్లు వెచ్చించి అమెరికా నుంచి కొనుగోలు చేసేది ఏమిటి? ఇదొక పెద్ద ప్రశ్న. అంతేకాదు, చిక్కు ప్రశ్న కూడా, సందేహం లేదు. ఈ 500 బిలియన్ డాలర్ల కొనుగోళ్లతో ప్రస్తుతం అమెరికాతో భారత్‌కు సమకూరుతున్న స్వల్ప వాణిజ్య మిగులు సైతం హరించుకుపోగలదు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఆసరా అయ్యే అమెరికన్ సరుకులు తక్కువే కనుక అమెరికా నుంచి మనం పెద్ద ఎత్తున విమానాలు, సైనిక సామగ్రి, అమెరికా చమురు మొదలైనవాటిని హైయర్ ల్యాండెడ్ కాస్ట్ (ఒక వస్తువు తయారైన ప్రదేశం నుంచి మీ వినియోగానికి వచ్చే దాకా అయ్యే మొత్తం ఖర్చు ఎక్కువగా ఉండడం. ఈ కారణంగా ఆ వస్తువు ధర సాధారణంగా అత్యధికంగా ఉంటుంది)తో కొనుగోలు చేయడం మనకు అనివార్యమవుతుంది. కొన్న తరువాత వాటిని ఏమి చేయాలో ఎవరైనా చెప్పగలరా?!

> **అమెరికా, భారత్ ప్రభుత్వాల సంయుక్త ప్రకటన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కాదు. అది ఒక మధ్యంతర ఒప్పందం కూడా కాదు; మధ్యంతర ఒప్పందానికి ఒక చట్రం మాత్రమే. దాని ప్రకారం భారత్ ఎట్టి పరిస్థితులలోను రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదు. అలా అని అమెరికా నిర్దేశించింది, దాన్ని భారత్ అంగీకరించింది. అమెరికా బెదిరింపు, భారత్ విధేయత మధ్య మన ప్రయోజనాలకు తోడ్పడేది ఏమైనా ఉన్నదా?**

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సంక్షేమం, సంస్కరణల సంజీవయ్య

రాజకీయాల్లో ఎందరో నాయకులు పుట్టుకొస్తారు. వారిలో కొందరే చిరకాలం గుర్తుండిపోతారు. అలాంటి కోవకు చెందిన వ్యక్తుల్లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఒకరు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. 38 ఏళ్లకే ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించి, భారతదేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పార్టీలకు అతీతంగా గౌరవం అందుకున్నారు. అంతేకాదు– అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) అధ్యక్షుడిగా పనిచేసి, నీతీ నిజాయితీ, నిరాడంబరానికి చిరునామాగా నిలిచారు. తరతరాలు చర్చించుకునేలా సంక్షేమ పథకాలు అమలు చేసి, పాలనలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన నీలం సంజీవరెడ్డి అనివార్య కారణాల వల్ల పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది. తదుపరి ముఖ్యమంత్రిగా సంజీవయ్య పేరును ఆయన సన్నిహితులు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లారు. ఓ దళిత సామాజిక వర్గానికి చెందిన సంజీవయ్యను ముఖ్యమంత్రిని చేయడం ఇష్టం లేని కొందరు ఆయన అవినీతిపరుడంటూ ప్రధాని నెహ్రూకు ఫిర్యాదు చేశారు. ఒకప్పటి హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యశ్వంత్ సింగ్ పర్మర్‌తో నెహ్రూ రహస్యంగా విచారణ జరిపించారు. సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడుకు వెళ్లి విచారించిన ఆయన, తిరిగి ఢిల్లీ వెళ్లి వాస్తవ పరిస్థితిని నెహ్రూకు వివరించారు. తర్వాత ఇంకెప్పుడూ సంజీవయ్యను నెహ్రూ శంకించలేదు. 1960 జనవరి 11న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య బాధ్యతలు స్వీకరించారు.

తక్కువ కాలంలోనే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉండేలా సంజీవయ్య పాలన సాగించారు. అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. సామాన్యులకు సంక్షేమ పథకాలు ఆయన హయాంలోనే మొదలయ్యాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), ఉపాధ్యాయులకు పెన్షన్ విధానం ఆయనే ఆరంభించారు. పేదలకు ఆరు లక్షల ఎకరాల బంజరు భూములు పంపిణీ చేశారు. భవన నిర్మాణ వ్యవహారాలు చూసేందుకు పరిశ్రమల శాఖలో ప్రత్యేక విభాగం, చిన్న తరహా పరిశ్రమల సంస్థ, ఆంధ్రప్రదేశ్ భూగర్భ గనుల సంస్థలు ఆయన పాలనలోనే పురుడు పోసుకున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 14 నుంచి 17శాతానికి, బీసీలకు 24 నుంచి 33శాతానికి రిజర్వేషన్లు పెంచారు. తెలుగులోనే ఉత్తరప్రత్యుత్తరాలు ఉండాలని ఉత్తర్వులు ఇచ్చారు. సరోజినీదేవి కంటి ఆస్పత్రి, రవీంద్రభారతి, లలితకళల అకాడమీలను ఏర్పాటు చేశారు. మండల్ కమిషన్‌కు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన గొప్ప దార్శనికుడు సంజీవయ్య. ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలుకు 1961లో జీవో తీసుకొచ్చారు. ముఖ్యమంత్రిగా సొంతూరు పెద్దపాడుకు వచ్చి వెళ్తుండగా తన తల్లికి వంద రూపాయలు ఇచ్చారు. వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రతి నెలా ఇలా ఎవరు డబ్బులు ఇస్తారు? అని తన తల్లి అడిగిన ప్రశ్నకు సమాధానంగా వృద్ధాప్య పింఛన్ ఆయన కాలంలోనే ప్రారంభించారు.



కర్నూలు జిల్లా గోనెగండ్ల వద్ద హంద్రీ నదిపై గాజులదిన్నె ప్రాజెక్టు (సంజీవయ్య సాగర్), ఆత్మకూరు సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వరదరాజస్వామి ప్రాజెక్టు సహా పులిచింతల, వంశధార ప్రాజెక్టులకు ముఖ్యమంత్రిగా శంకుస్థాపన చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయడంలో సంజీవయ్య కృషి ఎంతో ఉంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించిన ఆయన ఢిల్లీలో తనకున్న పరిచయాలు, నెహ్రూకు తనపై ఉన్న విశ్వసనీయతను ఉపయోగించుకుని ఎన్నో కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలు హైదరాబాద్‌కు తీసుకురావడంలో కృషి చేశారు.

సంజీవయ్య స్థానంలో ఆంధ్రప్రదేశ్ మూడో ముఖ్యమంత్రిగా మళ్లీ నీలం సంజీవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో సంజీవయ్యను ప్రధాని నెహ్రూ ఏఐసీసీకి అధ్యక్షుడిని చేశారు. తొలిసారిగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో ప్రధాని నెహ్రూ లేచి, సంజీవయ్యను పిలిచి 'సర్ మీ ఈ కుర్చీని అలంకరించండి' అంటూ ఆహ్వానించడంతో... నెహ్రూ అంతటి వారు 'సర్' అని సంబోధించి అధ్యక్ష స్థానంలో కూర్చోమనడంతో సంజీవయ్యకు ఆనంద బాష్పాలు వచ్చాయని ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు. నెహ్రూ మంత్రి వర్గంలో, లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో పనిచేశారు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా, కార్మిక, పునరావాసశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. కార్మికశాఖ మంత్రిగా జెనీవాలో, ఐక్య రాజ్య సమితి అనుబంధ అంతర్జాతీయ కార్మిక సదస్సులో ప్రసంగించిన ఆయన... కంపెనీలు, ఫ్యాక్టరీలు తమ సిబ్బందికి తప్పనిసరిగా ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలనే చట్టం తీసుకురావడంతో... సంజీవయ్య పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. ఢిల్లీ కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సమైక్యం చేసేలా 'సేవా స్తంభ్' అనే వేదికను ప్రారంభించారు. 1971 మార్చి 18న ఏఐసీసీ అధ్యక్షుడిగా రెండో పర్యాయం బాధ్యతలు చేపట్టిన ఆయన, ఆ పదవిలో ఉంటూనే 51 ఏళ్ల వయసులో అనారోగ్యంతో 1972 మే 7న ఢిల్లీలో మరణించారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ ఒడ్డున ఉన్న ఉద్యానవనంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన స్మారకార్థం ఆ ఉద్యానవనానికి ఆయన పేరు పెట్టారు.

సంజీవయ్య రాజనీతిజ్ఞుడే కాక, సాహిత్యం, సంగీతం, రచనల్లో కూడా ప్రవేశం ఉన్నవారు. సంజీవయ్య రాసిన 'లేబర్ ప్రాబ్లమ్స్ అండ్ డెవలప్‌మెంట్' అనే పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ ప్రచురించింది. విశాఖపట్నంలో స్థాపించిన ఆంధ్రప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీకి 2012లోనూ, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలోని థర్మల్ విద్యుత్ కేంద్రానికీ సంజీవయ్య పేరు పెట్టారు. విలువలు చెప్పడమే కాదు, వాటిని ఆచరణలో పెట్టి చూపించిన రాజనీతిజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి దామోదరం సంజీవయ్య.

● **గోరంట్ల కొండప్ప**
జర్నలిస్టు

(నేడు దామోదరం సంజీవయ్య జయంతి)

కళాపోషకుడు, పరోపకారి

పొన్నెకంటి పోతురాజు గుంటూరు జిల్లా, తెనాలి సమీపంలోని కొలకలూరు గ్రామంలో 1926 ఫిబ్రవరి 16న జన్మించారు. సత్యవేదం, యోసేపు తల్లిదండ్రులు. అసలు పేరు మార్టిన్. పోతురాజుది సాధారణ కుటుంబమే. చిన్ననాటి నుంచే ఈయన హాస్యప్రియుడు, సృజనశీలి. ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఎంతో మంది విద్యార్థులకు, యువతకు ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలలో శిక్షణనిచ్చారు. వాచికాభినయంలో, నటనలో మేటి కళాకారుడు. పచ్చి రావి ఆకులను హార్మోనికగా మలిచి, రాగ, తాళాలతో పద్యాలు, పాటలూ హృద్యంగా పాడేవారు. అంతేగాదు, ఆయన కళాపోషకుడు కూడా. సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల్లో ఎంతో చురుకుగా పాల్గొనేవారు. ఈ సానుకూల అంశాలే పోతురాజుకు ప్రత్యేకతను సంతరించిపెట్టాయి.



ఉద్యమకారులు, బాటసారులు, అక్కరలో ఉన్న వారికి పోతురాజు ఎంతో సహాయం చేసేవారు. ఇలాంటి వారికి ఆయన ఇల్లు ఆశ్రయంగా ఉండేది. ఎమర్జెన్సీ కాలంలో చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి కేసులో నిందితులని తెలియక, కొందరికి పోతురాజు తన ఇంట్లో కొద్దికాలం ఆశ్రయమిచ్చారు. దీంతో ఇక్కట్లపాలై కొన్నాళ్ళు అజ్ఞాతంలోకి వెళ్ళవలసివచ్చింది. ఎంతోమంది వ్యవసాయ కూలీలకు పోతురాజు అప్లికేషన్లు రాసిపెట్టి, రిప్రజెంట్ చెయ్యగా, నాటి టెనెంట్స్ చట్టంతో.. వ్యవసాయ కూలీలు భూయజమానులయ్యారు. ఈ సమయంలో పోతురాజుపై హత్యాయత్నం కూడా జరిగింది. లోకం బసవపున్నయ్యతో కలిసి కొలకలూరుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తెప్పించారు. అగస్త్యేశ్వర స్వామి దేవాలయ ట్రస్టు డైరెక్టర్‌గా ఆయన పనిచేశారు. కొలకలూరులో రథసప్తమి తిరునాళ్ళలో పోతురాజు రెండు రథాలను లాగేవారు.

తన సోదరి విక్టోరియమ్మతో కలిసి గ్రామంలో క్వారీలు పెట్టకుండా జీవితాంతం అడ్డుకున్నారు. గ్రామంలో రాజకీయ ఏకీకరణ జరగాలంటే పోతురాజు ఉండి తీరాల్సిందేనని ప్రజలు నమ్మేవారు. దుగ్గిరాల అసెంబ్లీ నియోజకవర్గానికి అవుతు రామిరెడ్డి, బొంతు గోపాలరెడ్డి మొదలైనవారు స్వతంత్ర ఎమ్మెల్యేలుగా గెలవడానికి పోతురాజు చేసిన కృషి విశేషమైనది. ప్రఖ్యాత సినీనటుడు, నాటక రచయిత, గేయకారుడు మోదుకూరి జాన్సన్‌లోని ప్రతిభా పాటవాలను మొదటగా గుర్తించి, ఆయనకు ప్రోత్సాహాన్నిచ్చారు. కవి నూతక్కి అబ్రహాం, రావూరి కోటేశ్వరరావు వంటి వారితో కలిసి పోతురాజు ఆ రోజుల్లో పప్పుకూటి నాటక పరిషత్‌ను స్థాపించి, ఎన్నో రంగస్థల నాటకాలను ప్రదర్శించారు. అలాగే, సామాజిక రుగ్మతలపై భారతంలో మరో హరిశ్చంద్రుడు, భస్మ సింహాసనం వంటి ఏకపాత్రలను స్వయంగా సృష్టించి, ప్రదర్శించారు. గుఱ్ఱం జాషువా శిష్యురాలైన విమలమ్మ వద్ద పోతురాజు పాటలు, పద్యాలు ఆలపించడంలో, నటనలో చిన్ననాటే తగిన శిక్షణ పొందారు. డప్పు, సితార వాద్యాలు, చిందు నాట్యంలో ఆయనకు మంచి ప్రవేశం ఉంది. విజయవాడ గోపరాజు రామచంద్రరావు (గోరా) నాస్తిక సమాజంలో పోతురాజు శిక్షణ పొందారు.

కొలకలూరు గ్రామంలో తన చిన్నాన్న బెంజమిన్ స్థాపించిన విద్యాసంస్థల అభివృద్ధి కోసం పోతురాజు తన తమ్ముడు ఎలీషాతో కలిసి కృషి చేశారు. అవసరంలో ఉన్న ఎందరికో సహాయం చేసి, విద్యార్థి, యువకుల్లో ప్రతిభను వెలికితీశారు. జీవితాన్ని స్నేహమయంగా, పరోపకారంగా, ఆనందంగా మలుచుకున్న మంచి మనీషి ఆయన. 2017, నవంబర్ 9న మన మధ్య నుంచి పోతురాజు నిష్క్రమించారు.

○ **కృపాకర్ మాదిగ**

(ఫిబ్రవరి 16: పొన్నెకంటి పోతురాజు జయంతి)

సింథటిక్ పామాయిల్‌తో ఆధ్యాత్మిక దాడి!

దేశవ్యాప్తంగా కోట్లాది హిందువుల విశ్వాసానికి చిహ్నమైన తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీస్తూ భక్తుల నమ్మకాలపై, వైసీపీ పాలనలో వ్యవస్థీకృతంగా దాడి చేశారు. ఆ దోపిడీ విలువ రూ.250 కోట్లు అని సీబీఐ తేల్చింది. ఇది కేవలం ఆర్థిక అవినీతి మాత్రమే కాదు, లడ్డూపై ఆధ్యాత్మిక దాడి. భక్తులు శ్రీవారి ఆశీర్వాదంగా భావించే లడ్డూలో స్వచ్ఛమైన ఆవు నెయ్యి స్థానంలో పామాయిల్, పారిశ్రామిక రసాయన మిశ్రమాలతో భక్తులను వంచించారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై ఈ దాడులు ఏమరుపాటున జరిగినవి కావు. నాలుగు సంవత్సరాల పాటు అప్పటి దేవస్థానం ఈవో, చైర్మన్లకు పూర్తిగా తెలిసే జరిగాయి.

జూన్ 2024లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లడ్డూ నాణ్యతపై గత నాలుగేళ్లుగా పేరుకుపోయిన ఫిర్యాదులను పరిష్కరించడానికి గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) ద్వారా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించింది. సేకరించిన నమూనాల ఆధారంగా ఎన్డీడీబీ–సీఏఎల్ఎఫ్ లేబొరేటరీ ఇచ్చిన నివేదిక దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతిని కలిగించింది. స్వచ్ఛతకు కీలక ప్రమాణమైన 'ఎస్–వాల్యూస్'లో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. స్వచ్ఛమైన పాల కొవ్వులో ఈ 'ఎస్' విలువ 98.05 నుంచి 104.32 పరిధిలో ఉండాలి, అయితే ఎన్డీడీబీకి టీటీడీ పంపించిన నమూనాలలో ఇది 19.72గా మాత్రమే ఉంది.

ఎన్డీడీబీ విశ్లేషణలో, పాలలో ఉండే కొవ్వు కాకుండా, ఇతర కొవ్వు పదార్థాలు కలిశాయని, నెయ్యిలో జంతువుల కొవ్వు అంటే బీఫ్ టాలో (ఎద్దు కొవ్వు), లార్డ్ (పంది కొవ్వు), చేప నూనెతో పాటు సోయాబీన్, సన్‌ఫ్లవర్, పత్తి గింజల నూనె వంటి కూరగాయల నూనెలు ఉండవచ్చని ప్రాథమికంగా సూచించింది. దేశవ్యాప్తంగా వచ్చిన నిరసనలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ 2024లో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. దీనిపై వైసీపీ హయాంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్ళారు. కోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బలపరుస్తూ, ఆంధ్రప్రదేశ్ పోలీసులతో పాటుగా, సీబీఐ అధికారులతో కూడిన స్వతంత్ర విచారణకు ఆదేశించింది. ఈ సిట్ విచారణ ప్రారంభంలోనే అసలు నాలుగేళ్ల పాటు లడ్డూ తయారీలో వాడింది నెయ్యే కాదు, 'నెయ్యి' అనే పామాయిల్ కాక్టెయిల్ కెమికల్ మిశ్రమం అనే దిగ్భ్రాంతికరమైన వాస్తవం బయటపడింది. సిట్ తన విచారణలో భాగంగా తిరిగి మరోసారి గుజరాత్ ఎన్డీడీబీతో పాటు హర్యానాకు చెందిన ఐసీఏఆర్–ఎన్డీఆర్ఐకి కూడా నెయ్యి శాంపిల్స్ పంపించి పరిశోధన చేయించింది. దీంతో ఆధ్యాత్మిక అరాచకాలన్నీ బయటపడ్డాయి.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన బోర్డు కనుసన్నలలోనే ఉత్తర భారతానికి చెందిన కంపెనీలకు కాంట్రాక్ట్ ఇచ్చి దేవస్థానం కొనుగోలు చేసిన నెయ్యి, అసలు నెయ్యే కాదని, అది రసాయనికంగా రూపొందించిన ఒక సింథటిక్ ఉత్పత్తి అని సిట్ నిర్ధారించింది. ఆవు నెయ్యి లక్షణాలను అనుకరించడానికి సరఫరాదారులు నెయ్యికి సహజంగా ఉండే మెరిసే రంగును అద్దడానికి బీటా–కెరోటిన్ అనే కెమికల్‌ను, నెయ్యి స్వచ్ఛత పరీక్షలలో పట్టుబడకుండా తప్పించుకోవడానికి ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్స్ అనే రసాయనాన్ని, కొవ్వు లాగా చూపించడానికి కొరియా దేశం నుంచి దిగుమతి చేసుకున్న మోనోగ్లిజరైడ్లను వాడారు. ఇంకా లాక్టిక్ యాసిడ్, శానిటేషన్ కెమికల్స్‌లో వాడే లంగర్ అనే యాసిడ్ తదితరాలను వాడి, అది నెయ్యి అని భ్రమింపజేశారు.



సిట్ తన దర్యాప్తులో భాగంగా రెండు సంస్థల ప్రయోగశాలల నుంచి పొందిన నివేదికల ప్రకారం– అప్పటికే ఒకసారి పరీక్ష చేసి జంతు కొవ్వు ఉన్నదని చెప్పిన ఎన్డీడీబీ– కాఫ్ ల్యాబ్ తన రెండో నివేదికలో– ఆ నెయ్యి, పామాయిల్, పామ్ స్టియరిన్, పామ్ కెర్నల్ నూనెల మిశ్రమమని, అందులో పాల కొవ్వు దాదాపు లేదని సూచించింది. అయితే కొలెస్ట్రాల్ లేకపోవడం వల్ల జంతువుల కొవ్వు ఉండే అవకాశం 'చాలా తక్కువ' అని, మోనోగ్లిజరైడ్లలో పది శాతం కంటే తక్కువ ఉన్న జంతువుల కొవ్వును లెక్కించడం సాధ్యం కాదని పేర్కొంది. ఐసీఏఆర్–ఎన్డీఆర్ఐ మాత్రం జంతువుల కొవ్వును పరీక్షించడానికి పీసీఆర్– ఆధారిత పద్ధతిని ఉపయోగించామని, పరీక్షించిన నాలుగు నమూనాలలో లార్డ్ (పంది కొవ్వు) కనిపించలేదని నివేదించింది. అయితే, ఇటువంటి విశ్లేషణ చేయడం తమకు ఇదే మొదటిసారి అని ఎన్డీఆర్ఐ తన నివేదికలో ఒప్పుకుంది. అంతేకాకుండా, రెండు సంస్థలు కూడా కనుగొన్న మోనోగ్లిజరైడ్లు మొక్కల కొవ్వు నుంచి వచ్చాయా లేదా జంతువుల నుంచి వచ్చాయా అనే విషయాన్ని సిట్ పేర్కొనలేదు. పామాయిల్ కెమికల్ మిశ్రమాలను నెయ్యి బదులు వాడడం, ఏదో ప్రమాదవశాత్తు జరిగింది కాదని, సరఫరాదారులను మార్చి, ఉద్దేశపూర్వకంగా లడ్డూ నాణ్యతను నీరుగార్చారని సిట్ వెల్లడించింది.

లడ్డూల నాణ్యత మీద భక్తుల ఫిర్యాదులు ఎక్కువైపోగా 2022 మే నెలలో, సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మైసూర్‌కు నెయ్యి నమూనాలను పంపింది. ఆ సంస్థ పరీక్షించి ఆ నెయ్యిలో పాలకు సంబంధించి కాకుండా ఇంకేవో కొవ్వు పదార్థాలు కనుగొన్నామని, కూరగాయల నూనె కల్తీకి కొండ గుర్తు అయిన 'బీటా–సిటోస్టెరోల్' ఉండటాన్ని గుర్తించామని, హానికరమైన పదార్థాలు మిశ్రమంగా ఉన్నాయని తొలి నివేదిక ఇచ్చింది. అయినా ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు పట్టించుకోకుండా ఆ కంపెనీలకే అదనపు సరఫరా ఆర్డర్లు కొనసాగించారు.

తిరుమల పవిత్రతను పునరుద్ధరించే పోరాటం ఇప్పుడు కేవలం పరిపాలనాపరమైన విషయం మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మిక పునరుద్ధరణ మిషన్. ఈ ప్రక్రియను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే చేపట్టింది.

■ **నీలాయపాలెం విజయ్‌కుమార్**
తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి

ప్రేమకు స్వాగతం

నేడు వాలెంటైన్స్ డే..



- సెలబ్రేషన్స్‌కు సిద్ధమైన యువత
- ఆకర్షణకు, ప్రేమకు వ్యత్యాసంలో తికమక

8

కోటప్పకొండలో కోలాహలం



ముక్కోటి దేవతలకు ఆహ్వానం



విద్యుత్ దీపాల కాంతిలో అమరావతి అమరేశ్వరాలయ రాజగోపురం

అమరావతి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహాశివరాత్రి రోజున బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ వేదపండితులు, అర్చకులు శుక్రవారం రాత్రి ధ్వజారోహణ చేశారు. విద్యుత్ దీపాల అలంకరణతో ఆలయం మిరిమిట్లు గొల్పుతుంది. స్నానఘాట్ వద్ద జల్లుస్నానానికి ఏర్పాట్లు చేశారు.



అమరావతిలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

200 సీసీ కెమేరాలు.. 30 డ్రోన్లు





కోటయ్య తిరునాళ్ల సందర్భంగా కోటప్ప కొండకు వచ్చే మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, క్యూల వద్ద 200 సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 30 డ్రోన్ల తో కొండ పరిసరాలను, భక్తుల రాకపోకలను, రద్దీని పోలీసు శాఖ ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నది. కొండపైన, కొండ కింద ప్రత్యేకంగా ఒక్కో కంట్రోల్ రూమ్ చొప్పున ఏర్పాటు చేశారు. దొంగలు, మహిళలను ఇబ్బంది పెట్టే వారి కట్టడికి మఫ్టీలో క్రైం బృందాలను ఏర్పాటు చేశారు. మెట్ల మార్గంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

- వైభవంగా తిరునాళ్ల ప్రారంభం
- త్రికోటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు
- కొండకు తరలివచ్చిన మొక్కుబడి ప్రభలు
- తొలిరోజే యలమంద వద్ద ట్రాఫిక్ జామ్
- 9440900885 ఫోన్ చేస్తే పోలీసుల సాయం



కోటయ్యను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కోటప్పకొండ/నరసరావుపేట, ఫిబ్రవరి 13: కోటయ్య క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏకాదశి సందర్భంగా శుక్రవారం కోటప్పకొండకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో కొండంతా శివమయంగా మారింది. భక్తితో కూడిన కోలాహలం నెలకొంది. తెల్లవారు జాము నుంచే చిన్నారులు, మహిళలు కాలినడకన మొక్కుబడి ప్రభలతో కోటయ్య సన్నిధికి తరలివచ్చారు. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక మండపంలో విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామికి పొంగళ్లు సమర్పించారు. ఉచిత దర్శనం క్యూలో భక్తుల రద్దీ నెలకుంది. కొండ దిగువన సోపాన మార్గం వద్ద ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలతో పాటు మెట్ల పూజ చేశారు. సోపాన మార్గంలో ఆనందవల్లి అమ్మవారికి, ధ్యానశివుడు, నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజలు చేశారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. ఈవో చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. వారికి ప్రదక్షిణ **(మిగతా 8వ పేజీలో)**




కోటప్పకొండలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌లు



మొక్కుబడి ప్రభతో పాదయాత్రగా కొండకు వస్తున్న యువతీ,యువకులు



రేపల్లె: అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్



కోటప్పకొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్


ముమ్మరంగా ఏర్పాట్లు : కలెక్టర్

కోటయ్య తిరునాళ్లకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశం లో ఎస్పీ కృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈసారి స్వామి దర్శనం ఆదివారం తెల్లవారుజామున 1 గంట నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వం తర పున స్వామికి ఉదయం 9 గంట లకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టు వస్త్రాలను సమర్పిస్తారన్నారు. ఆఫ్‌లైన్‌లో తిరునాళ్ల రోజున దేవస్థానం వద్ద రూ.100, రూ.200, అభిషేకం రూ.500 టిక్కెట్లను కౌంటర్లలో విక్రయిస్తారన్నారు. ఆరు లక్షల వాటర్ బాటిళ్లు, చిన్న పిల్లల కోసం పాలు, బిస్కెట్లు క్యూలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామన్నారు. వైద్య శిబిరాలతో పాటు 108 వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు.



బాలత్రిపురసుందరిగా భ్రమరాంబదేవి

- వైభవంగా మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం భ్రమరాంబ అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు పంచ హారతులు, గ్రా మోత్సవాలు జరగ్గా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లిం చారు. భక్తిరంజని, కూచిపూడి నృత్యం, గయోపాఖ్యానం నాటకం నుంచి యుద్ధం సీను, బాలనాగమ్మ నాటకం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

భక్తుల భద్రతే ప్రధానం

క్వారీ ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ అన్సారియా

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయంలో సాధారణ, శీఘ్ర దర్శనం, వీఐపీ క్యూలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రసాదాల తయారీ, వైద్య శిబిరాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు క్యూలు, బారికేడ్లు, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సహాయం తదితరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ జనార్దన్‌రావు, డీపీవో నాగసాయికుమార్, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఈవో నరసింహ, చైర్మన్ అనంత లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్వారీలో తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

- కోటయ్య భక్తుల కోసం తిరుమల బస్సులు
- నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్

8 లో..

650 ఆర్టీసీ సర్వీసులు

హోలీకి ప్రత్యేక రైళ్లు 6

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

నేడు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా వందనాదేవి ప్రమాణ స్వీకారం

తల్లిని పెట్రోలు పోసి కాల్చి చంపిన కుమార్తె 8

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ అన్సారియా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా అధికారులను ఆదేశించారు. పది, ఇంటర్ పరీక్షలుపై కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలాఅన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, వైద్య శిబిరాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. సెల్‌ఫోన్ల డిపాజిట్‌కు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో అనవసరపు వదంతులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈవో డా.షేక్ సలీం బాషా మాట్లాడుతూ జిల్లాలో 149 కేంద్రాల్లో మార్చి 16 నుంచి జరిగే పది పరీక్షలకు 27,699 మంది హాజరుకానున్నారన్నారు. ఇంటర్ బోర్డు ఆర్ఐఒ జి.సునీత మాట్లాడుతూ రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి 87 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, మొత్తం 68,898 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జె.పద్మ, ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

జోన్ 8కి.. రూ.1863 కోట్లు

- రాజధానిలో రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణం
- అమరావతి లేఅవుట్లలో పనులకు ఆర్థికశాఖ అనుమతి

మంగళగిరి, గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జోన్-8 పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి చేస్తోన్న లేఅవుట్లలో నిర్మాణ పనులకు ఆర్థిక శాఖ అనుమతి లభించింది. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలకు సీఆర్డీఏ రూ.1863 కోట్ల మంజూరు చేసింది. ఆ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ శుక్రవారం జీవో జారీ చేసింది. ఈ నిధులతో జోన్ 8 పరిధిలోని కృష్ణాయ్యపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లోని రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లను అభివృద్ధి పరచనున్నారు. రెండేళ్లకాలంలో వీటిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

రోడ్ల అనుసంధానానికీ నిధులు

రాజధానిని ప్రస్తుత ఎన్‌హెచ్-16 తో అనుసంధానించే ఈ-13 ఎక్స్‌టెన్షన్ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.834.46 కోట్లు మంజూరు చేసింది. ఈ-15 రోడ్డును ఎన్‌హెచ్-16తో అనుసంధానం కోసం రూ.307.59 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణం, వరద నీటి డ్రెయినేజీ, ఇతర మౌలిక సదుపాయల కల్పన చేయనున్నారు.

రికార్డు సమయంలో.. కూల్చివేత

- శంకర్‌విలాస్ పాత ఆర్‌వోబీ తొలగింపు
- నేడు కార్మికులకు కేంద్ర మంత్రి పెమ్మసాని సత్కారం

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ పాత ఆర్‌వోబీ రైల్వే భాగం వంతెనని రికార్డు సమయంలో కూల్చివేశారు. ఈ పని విషయంలో వివిధ వర్గాలు ఆందోళన వ్యక్తం చేయడం, వైసీపీ రాజకీయంగా రాద్ధాంతం చేయాలని చూడటం, ఒక పట్టాన రైల్వే శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఆర్‌వోబీ పనులపై సందిగ్ధత నెలకొంది. గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి నల్లపాడు మార్గంలో నిత్యం 100కి పైగా రైళ్లు, గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్న క్రమంలో రైల్వేవంతెన కూల్చివేతపై తొలుత రైల్వే శాఖ అనుమతిని మంజూరు చేయలేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని ప్రత్యేకంగా చొరవ తీసుకుని బోర్డు స్థాయిలో అనుమతులు తెప్పించారు. కూల్చివేతకు సం బంధించి రైల్వేశాఖ కోరినట్లుగా ప్రణాళిక రూపొందించి పనులు చేపట్టారు. షెడ్యూల్‌ని రూపొందించి ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా రైల్వే వం తెనని కూల్చివేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌ తుంది. గత నెల చివరి వా రం ప్రారంభంలో కూల్చివేత పనులు ప్రారంభం కాగా కేవలం 20 రోజుల వ్యవధి లోనే పూర్తి అయ్యాయి. బ్రిడ్జి కూల్చివేత సమయంలో రైలు మార్గంలో రైళ్ల రాకపోకలపై 30కి పైగా బ్లాక్ అమలు చేసింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్, కార్మికులను శనివారం రైల్‌వికాస్ భవన్‌లోని అమరావతి అనెక్స్‌లో సత్కరించాలని డాక్టర్ పెమ్మసాని నిర్ణయించారు.



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ రైల్వే భాగంలో కూల్చివేసిన వంతెన

బంగారు కల



- ధర పెరుగుదల తరుగుదల
- వ్యాపారులు, కొనుగోలు దారుల్లో ఆందోళన
- వెండి పరిస్థితి మరీ దారుణం

పది గ్రాముల బంగారం ధర రూ.2 లక్షలకు చేరుతుందన్న వార్తలతో నేపథ్యంలో ఇటీవల మంగళగిరికి చెందిన ఓ జ్యూయెలరీ షాపు నిర్వాహకుడు కిలో కొన్నాడు. ఆ మరుసటి రోజే ధర ఏకంగా 14,500కు దిగివచ్చింది. దీంతో అతడు రూ.40 లక్షలు నష్టపోయాడు. బంగారపు పని చేసుకునే ఓ వ్యక్తి ఇటీవల ఒక నగ చేసేందుకు ఆర్డర్ తీసుకున్నాడు. ఆ రోజు ఉన్న రేటు ప్రకారం గ్రాముకు రూ.16,500 చొప్పున రేటు ఖాయం చేసుకున్నాడు. కానీ మరుసటిరోజు ధర గ్రాముకు రూ.2వేలు పెరిగింది. దీంతో అతడు అధిక ధరకు బంగారం కొనాల్సి వచ్చింది. ఇలా పలువురు బంగారం ధరలో చోటు చేసుకుంటున్న మార్పులతో తీవ్రంగా నష్టపోతున్నారు.

గుంటూరు , ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి ధరలు ఏ రోజు ఎలా ఉంటాయో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత కొంతకాలంగా బంగారం, వెండి ధర పెరుగుతున్నప్పటికీ, జనవరిలో అకస్మాత్తుగా కనిపించిన పెరుగుదల చాలామందిని బలితీసుకుంది. జనవరి 27, 28, 29 తేదీల్లో బంగారం, వెండి ధరల్లో కనిపించిన పెరుగుదల చూసి చాలా మంది కొనుగోలు చేశారు. మూడు రోజుల్లో వెండి ధర కిలో రూ.2.7 లక్షల నుంచి 4.10 లక్షలకు పెరిగింది. చాలామంది వెండిని కూడా కొనుగోలు చేశారు. ఆ మరుసటి రోజే బంగారం, వెండి ధరలు నేలను తాకాయి. బంగారం ధర ఒక్కసారిగా గ్రాముకు 2వేలు, ఆ తర్వాత రోజు మరో వెయ్యి తగ్గింది. ఈ లెక్కన చూసుకుంటే కిలోకు రూ.40లక్షల మేర వ్యాపారులు నష్టపోయారు. వెండి ధర రెండు రోజుల్లో 4లక్షల 10వేల నుంచి రెండున్నర లక్షలకు పడిపోయింది. అంటే కిలో వెండి కొంటే రెండు రోజుల్లో లక్షన్నర నష్టపోయారు. రెండేళ్లుగా పెరుగుతున్న బంగారం ధరతో కళాకారులకు పని లేకుండా పోయింది. ఆర్డర్లు తీసుకున్న తర్వాత ధరలు పెరగడంతో అధిక ధరకు బంగారం కొని నగలు చేసి ఇవ్వాల్సి రావడంతో ఆందోళన చెందుతున్నారు. ధర పెరుగుదల తరుగుదలతో సామాన్యుల్లో పసిడి ఆశలు దాదాపుగా ఆవిరైపోయాయనే చెప్పాలి. 2024 జనవరి నాటికి రూ.6,500 ఉన్న బంగారం ధర ఇప్పుడు ఏకంగా 18,600 మార్కును తాకింది. పెళ్లిళ్లు, శుభకార్యాల్లో కూడా తప్పనిసరైతే తప్ప బంగారం జోలికి వెళ్లడం లేదు.

హోలీకి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ సందర్భంగా స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికుల కోసం గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07512 చర్లపల్లి - షాలి మార్ స్పెషల్ ఈ నెల 26, మార్చి 1, 5 తేదీల్లో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా ప్రయాణిస్తుంది. 07513 షాలిమార్ - చర్లపల్లి స్పెషల్ ఈ నెల 27, మార్చి 2, 6 తేదీల్లో గుంటూరు మీదుగా ప్రయాణిస్తుందన్నారు. 07193 హైదరాబాద్ - కొల్లం స్పెషల్ ఈ నెల 28 నుంచి మార్చి 28వ తేదీ వరకు ప్రతి శనివారం, 07194 కొల్లం - హైదరాబాద్ మార్చి 2నుంచి 30వ తేదీ వరకు ప్రతి సోమవారం గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా ప్రయాణిస్తాయి. 07230 హైదరాబాద్ - కన్యాకుమారి స్పెషల్ మార్చి 4 నుంచి 25వ తేదీ వరకు ప్రతి బుధ వారం, 07229 కన్యాకుమారి- హైదరాబాద్ స్పెషల్ మార్చి 6 నుంచి 27వ తేదీ వరకు ప్రతి శుక్రవారం ప్రయాణిస్తాయని తెలిపారు.

4,300 టిక్కీల అమ్మకం

దాచేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు కు శుక్రవారం 4,700 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా 4,300 టిక్కీల అమ్మకాలు జరిగాయి. 334 రూ.10వేలు నుంచి రూ.22వేలు, తేజా రూ.9వేలు నుంచి రూ.19వేలు, తాలుకాయలు రూ.3 వేలు నుంచి రూ.9వేలకు అమ్మకం జరిగింది.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కళాశాలల్లో ఎంఎస్సీ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య శివప్రసాద్‌రావు విడుదల చేశారు. రీవాల్యుయేషన్ దరఖాస్తు గడువు ఈ నెల 24 తేదీగా నిర్ణయించారు. సబ్జెక్టుకు ఫీజు రూ.1860 చెల్లించాలన్నారు. ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందవచ్చని సీఈ తెలిపారు.

నేడు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా వందనాదేవి ప్రమాణ స్వీకారం

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా నియమితులైన వందనాదేవి శనివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అరండల్ పేట బీఆర్ స్టేడియంలోని గ్రంథాలయ జిల్లా కేంద్ర కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందని శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొంటారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

మిర్చియార్డు సెక్రటరీ చంద్రిక డిప్యూటేషన్ పొడిగింపు



గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నత శ్రేణి కార్యదర్శిగా ఎ.చంద్రిక డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు మార్కెటింగ్ శాఖ పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. చంద్రిక మునిసిపల్ పరిపాలన శాఖలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో ఉన్నారు. ఆమె గతేడాది జనవరి నెలాఖరున డిప్యూటేషన్‌పై మిర్చియార్డు సెక్రటరీగా విధుల్లో చేరారు. రెండు వారాల క్రితం ఆమె డిప్యూటేషన్ ముగిసింది. వచ్చే ఏడాది జనవరి నెలాఖరు వరకు చంద్రిక కొనసాగనున్నారు.

సీఆర్‌డీఏ ప్రతిపాదనల పరిశీలనకు సబ్ కమిటీ

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్‌డీఏ ప్రతిపాదనలను అథారిటీ మీటింగ్‌లో ప్రవేశపెట్టే ముందుగా వాటిని పరిశీలించేందుకు సబ్ కమిటీని ప్రభుత్వం శుక్రవారం నియమించింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న అథారిటీ సమావేశాల్లో వివిధ అంశాలను చేర్చేటప్పుడు అన్ని సవ్యంగా ఉండేలా ముందుగానే చర్చలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, సభ్యులుగా అరవింద్ రమణి(న్యాయ శాఖ అదనపు సెక్రటరీ), శివయ్య జంపని(ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి), లక్ష్మీ నాయక్(ఆర్థిక శాఖ డిప్యూటీ ఫైనాన్షియల్ సలహాదారు), ఎం.వెంకట సుబ్బయ్య(మనిసిపల్ శాఖ ఓ.ఎస్.డీ), ఎం ప్రభాకర్‌రావు(పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ), డి.చిట్టిబాబు(సీడీఎంఏ డిప్యూటీ డైరెక్టర్), సీహెచ్ ధనుంజయ(ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీర్)ని నియమించింది.

రైతులను వెంటాడుతున్న రెవెన్యూ సమస్యలు: ఎమ్మెల్యే ధూళిపాళ్ల



ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రెవెన్యూ సమస్యలు నేటికీ రాష్ట్ర రైతులను వెంటాడుతున్నాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శాసన సభలో మాట్లాడారు. శుక్రవారం రెవెన్యూ సమస్యలపై మంత్రి ఇచ్చిన సమాధానంపై స్పందిస్తూ చెందిన ఎమ్మెల్యే సభా సాక్షిగా రెవెన్యూ లోపాలను ఎత్తి చూపారు. పొన్నూరు నియోజకవర్గాన్ని ఉదహరించారు. రెవెన్యూ సదస్సుల్లో తొలి విడతగా 1052 సమస్యలు వస్తే 1049 సమస్యలు పరిష్కరించామని, రెండవ విడతగా 212 సమస్యలను పరిష్కరించినట్లు మంత్రి ఇచ్చిన సమాధానం సరికాదన్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు అప్పటి వైసీపీ నాయకులతో కుమ్మక్కై.. వాగులు, వంకలు రిజిస్టర్ చేశారని ఆరోపించారు. ఇప్పటికీ వాటి పరిష్కారం కోసం రైతులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ కింద సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 596.. ఫ్రీ హోల్డ్ ఉత్తర్వులు పేరుతో అడ్డగోలుగా కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు డబ్బులు వసూలు చేసి, భూములు ఇష్టానుసారం రాసిచ్చారని ధ్వజమెత్తారు. 19 నెలలు అయినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని చెప్పారు. అనమర్లపూడిలో 1950లో ఎసైన్డ్ చేసి 50 ఎకరాలు ఎనిమిది మందికి ఇచ్చారని, 1957 నుంచి ఈ భూములపై లిటిగేషన్ ఉందన్నారు. 60 ఏళ్లుగా లిటిగేషన్‌లో ఉన్న భూములను పోలీసులను ఉపయోగించి బెదిరించి.. ఫ్రీ హోల్డ్ ఉత్తర్వులు రాకముందే కోర్టు కేసులను విత్ డ్రా చేయించి అప్పటి ఎమ్మెల్యే, కొంత మంది పదవిలో ఉన్న వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ దురాగతంపై తాము ఇచ్చిన విజ్ఞాపనపై విచారణ జరపలేదన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

మిర్చియార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	82,344
అమ్మకాలు	87,401
నిల్వ	14,419

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	23000
273	14500	24000
341	14000	26000
4884	----	----
సూపర్ 10	----	----

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25500
దేవనూరు డీలక్స్	15500	27500
ఆర్మూరు	13000	17500

ఏసీ కామన్ వెరైటీ		
334	14000	20500
నెంబరు. 5	13000	21000
273	----	----
341	14000	23500
4884	----	----
సూపర్ 10	----	----

ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	24000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12500

ముఖేష్‌కు మరో రెండు పతకాలు



పతకాలతో ముఖేష్

గుంటూరు(క్రీడలు) ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజు శుక్రవారం నేలవల్లి ముఖేష్ మరో రెండు పతకాలు సాధించారు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ జూనియర్ విభాగంలో వ్యక్తిగతంగా రజతం, మధ్యప్రదేశ్‌కు చెందిన సూరజ్ శర్మ, ఉత్తరాఖండ్‌కు చెందిన అభినవ్ దేశ్వాల్‌తో కలిసి టీం విభాగంలో స్వర్ణ పతకం గెలిచారు. వ్యక్తిగత విభాగంలో అన్ని పతకాలు భారతదేశానికే లభించాయి. సూరజ్ శర్మ స్వర్ణంతో మెరవగా.. అభినవ్ దేశ్వాల్ కాంస్యం సాధించారు. ఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో ఈ నెల రెండు నుంచి జరుగుతున్న ఈ ఛాంపియన్షిప్‌లో చివరి రోజు 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగం పోటీలు జరిగాయి. జూనియర్ విభాగంలో ముఖేష్ ఐదు ఈవెంట్లలో తొమ్మిది పతకాలకు పోటీపడి ఎనిమిది పతకాలు సాధించి రికార్డు నెలకొల్పాడు.

అంబటికి బుద్ధి పెరగలేదు: పిల్లి మాణిక్యరావు



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు

గుంటూరు,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అంబటి రాంబాబుకి వయసు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదని, జైలుకు వెళ్లినా అతని తీరు మారడం లేదనేది సత్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబటి పులిలా గాండ్రిస్తాడు అని జగన్ చెప్పడం చూస్తే ప్రజలు సైతం విస్తుపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కరుడు గట్టిన నేరస్తులందరూ వైసీపీ నేతలు అనేది వాస్తవమని పేర్కొన్నారు. వంగవీటి రంగా పీడిత వర్గాల కోసం పోరాటం చేసిన వ్యక్తని, కరుడు గట్టిన మోసగాళ్లలో అంబటి రాంబాబు ఒకడని ఆయన ఆరోపించారు. అలాంటి వ్యక్తిని వంగవీటితో పోల్చుతున్న వైసీపీ నేతలను చూస్తే సిగ్గనిపిస్తోందన్నారు. కోర్టుకు వచ్చిన సమయంలో అంబటి మీడియా ముందు అనేక రకాల హావభావాలు వ్యక్తపరుస్తుంటే జైలు నుంచి తెచ్చిన అధికారులు చూస్తూ ఊరుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ నేతల అవినీతిని బయటపెట్టడానికి సంవత్సరాల కాలం పడుతుందన్నారు. అంబటిని కాపుకులం పితగా చూపడానికి వైసీపీ నేతలు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారు, కానీ అవి వీలుపడకపోవడంతో వైసీపీ నేతల దుర్మార్గం బయట పడుతోందన్నారు. ఈ సమావేశంలో చిట్టా బత్తుని చిట్టిబాబు, తాళ్ల వెంకటేశ్ యాదవ్, కసుకుర్తి హనుమంతరావు, పరుచూరి సంజీవరావు, నీలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మిర్చి యార్డు డైరెక్టర్‌గా నియమితుడైన ముడవత్ మంగాబాబు పిల్లి మాణిక్యరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

శివరాత్రికి ప్రత్యేక లాంచీలు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ ఆదేశాల మేరకు ఆదివారం మహాశివరాత్రి పర్వదినం అనుపు నుంచి ఏలేశ్వరం గట్టుకు ప్రత్యేక లాంచీలను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజర్ మస్తాన్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ లాంచీలకు టిక్కెట్ ధర పెద్దలకు రూ. 200, పిల్లలకు రూ.150 గా నిర్ణయించినట్లు చెప్పారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు సర్వీసులు నడుస్తాయని, లాంచీల కోసం 97051 88311, 94414 53 115 నంబర్లకు సంప్రదించాలన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



నక్షా సర్వేపై ఏర్పాటు చేసిన శిక్షణను పరిశీలిస్తున్న కమిషనర్ కే మయూర్ అశోక్

నక్షా సర్వే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో నక్షా సర్వేపై ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అడ్మిన్, రెవెన్యూ, ప్లానింగ్ కార్యదర్శులకు నక్షా (న్యూ అసెస్మెంట్ అండ్ నాలెడ్జ్ బేస్డ్ సర్వే ఫర్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్)పై నోడల్ అధికారి, డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక నక్షా సర్వేలో నైపుణ్యం సాధించాలని, అందుకు అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్న సర్వేని పక్కాగా ఎస్ఓపీ మేరకు ఖచ్చితమైన వివరాలతో చేయాలన్నారు. సర్వేకి అవసరమైన ట్యాబ్‌లను ఇప్పటికే ఇచ్చామని, రోవర్లు కూడా ఇస్తామని, వాటిని జాగ్రత్తగా నిర్వహణ చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

నగరంలో వార్డుల వారీగా స్థానిక సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శాంతినగర్, ఏటీ అగ్రహారం, మద్దుగుంట సెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డు సచివాలయం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి కార్యదర్శి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యటనలో డీఈఈ వెంకట రమణ, ఎస్ఎస్ రాజేష్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోను జీఎంసీ క్యాష్ కౌంటర్లు

2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను, బకాయిలను చెల్లించుటకు వీలుగా శని, ఆది వారాల్లో సెలవు రోజులైనా కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో పన్నుచెల్లింపు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని బకాయిదార్లు సద్వినియోగించుకోవాలని కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.72.27 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేష్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయ అధికారులతో పన్ను చెల్లింపుపై వసూళ్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 57 రాష్ట్ర ప్రభుత్వ సంస్థల 255 అసెస్మెంట్ల ద్వారా సుమారు రూ.72.27 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపుల సమస్యలను కూడా జీఎంసీ డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులను డిపార్ట్‌మెంట్ వారీగా కేటాయించామన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సహకరించ'ని ప్రభుత్వతీరు బాధాకరం

● ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని నాలుగు నెలలుగా సహకార ఉద్యోగులు ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. దశల వారీ ఆందోళనల్లో భాగంగా స్థానిక శ్యామలనగర్, శుక్రవారం ఉద్యోగులు సహకార కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. తొలుత కార్యాలయం ఎదుట ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం, సహకార శాఖ కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా బ్యాంకులు, ఆప్కాబ్ అధికారులు లాభాలు పొందుతున్నప్పటికీ, సహకార సంఘ ఉద్యోగులకు సరైన ప్రయోజనాలు అందడం లేదన్నారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారులతో జరిగిన చర్చలు విఫలమైనట్లు ప్రస్తావించారు. విధి లేని పరిస్థితుల్లో ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని తెలిపారు. ఈ నిరసనల్లో జేఏసీ నాయకులు తోట వెంకట్రామయ్య రవికుమార్, దండా లక్ష్మీనారాయణ, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.


● ఉద్యోగులు చేపట్టిన ముట్టడిలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉద్యోగులు అక్కడే బైఠాయించారు. కార్యాలయం అపార్ట్‌మెంట్‌లో ఉండటంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో స్థానికులకు, ఉద్యోగులకు స్వల్ప వాగ్వాదం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.



సహకార కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు

విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రాంగణ ఎంపికలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో మొత్తం 118 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య , వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, సీఈవో మేఘన ప్రిన్సిపాల్ వి.అనురాధ, టీపీవో ఎం గోపాలకృష్ణారావు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలకు రూ.50 లక్షలు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్స వాలను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నిధులను మంజూరు చేసినట్లు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.50 లక్షలు మంజూరు చేయడం ద్వారా బంజారాల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలు, వారి ఆధ్యాత్మిక విశ్వాసాలకు తగిన గౌరవాన్ని చాటిచెప్పారన్నారు. మంజూరైన నిధులతో ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

క్వారీ తిరునాళ్ళకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ వకుల్ జిందాల్



క్వారీ తిరునాళ్ల బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్లమూడి క్వారీ తిరునాళ్ళకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో కలసి క్వారీ ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్లమూడి గ్రామ క్వారీ వద్ద ఉన్న శ్రీబాల కోటేశ్వర స్వామి ఆలయాన్ని ఎస్పీ సందర్శించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. గుడి వద్ద గానీ, ప్రభల ప్రదేశాల్లో గానీ, దుకాణాల సముదాయాల వద్ద గానీ ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు లేదా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమగ్ర భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుడి ప్రాంగణంలో భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ లైన్లను క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు. డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా నిర్వహించాలన్నారు. ప్రభల నిర్వాహకులు తమ ప్రభలను నిర్ణీత ప్రదేశాల్లోనే నిలుపు కోవాలని, ప్రతి ప్రభ వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆ మార్గంలో వాహనాల దారి మళ్లింపు

క్వారీ తిరునాళ్ల సందర్భంగా ఆ మార్గంలో ట్రాఫిక్‌ను దారి మళ్ళిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గుంటూరు నుంచి పొన్నూరు వైపు వెళ్లు వాహనాలను బుడంపాడు అండర్ బైపాస్ నుంచి ఏటుకూరు రోడ్డు ఏటుకూరు మీదుగా దారి మళ్ళించినట్లు ఎస్పీ తెలిపారు. గుంటూరు నుంచి తెనాలి వెళ్లు వాహనాలు తక్కెళ్ళపాడు, నందివెలుగు మీదుగా తెనాలి వెళ్ళాలన్నారు. బుడంపాడు బైపాస్ నుంచి చేబ్రోలు, నారాకోడూరు వైపు భారీ వాహనా లకు అనుమతి లేదన్నారు. పొన్నూరు నుంచి గుంటూరు వైపు వచ్చు వాహనాలు ముట్లూరు రోడ్డులోనికి వెళ్లి వయా లేమల్లెపాడు, అనంతవరప్పాడు మీదుగా గుంటూరు వెళ్ళాలన్నారు. తెనాలి నుంచి పొన్నూరు వెళ్ళుటకు వడ్లమూడి క్రాస్ రోడ్ చేబ్రోలు వెళ్లి పొన్నూరు వెళ్ళాలన్నారు. తెనాలి నుండి గుంటూరు వెళ్ళుటకు వడ్లమూడి క్రాస్ రోడ్డు నుండి చేబ్రోలు వెళ్లి ముట్లూరు రోడ్డులో నుంచి వయా లేమల్లెపాడు అనంతవరప్పాడు మీదుగా గుంటూరు వెళ్ళాలన్నారు. తెనాలి నుంచి గుంటూరు వెళ్ళు వారు నందివెలుగు క్రాస్ రోడ్ , తక్కెళ్ళపాడు మీదుగా గుంటూరు వెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య, చేబ్రోలు ఎస్ఐ వీర నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై ఆశలు..

● అమరావతి రాజధాని, సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులపై ఆసక్తి

● ఎంఎస్ఎంఈ పార్కులకు నిధులు కేటాయించే అవకాశం

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ని శనివారం ఆ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లాకు ఏ మేరకు కేటాయింపులు జరిపారన్న విషయం ఉత్కంఠని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా అమరావతి రాజధానిలో నిర్మాణం జరుగుతోన్న అభివృద్ధి పనులు, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, భూసేకరణ ప్రక్రియలతో పాటు ఎంఎస్ఎంఈ పార్కులకు నిధులు ఎంతమేరకు కేటాయించారోనని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తోన్నారు. అలానే నియోజకవర్గాల అభివృద్ధికి ఏమైనా ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారానన్న చర్చ కూడా జరుగుతోంది. గుంటూరు నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ స్కీమ్‌ని పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధులను ఈ బడ్జెట్‌లోనైనా పొందుపరుస్తారని ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్నారు. అమరావతి రాజధానిలో భారీ ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతోన్నాయి. క్వాంటం వ్యాలీకి ఇటీవలే సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. మరోవైపు ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు రూ. వేల కోట్ల విలువ చేసేవి జరుగుతోన్నాయి. అలానే రెండో విడత భూసేకరణ ప్రక్రియ ఏడు గ్రామాల్లో ప్రారంభమైంది. దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది. పీపీపీ విధానంలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం, పలు రహదారులు, స్పోర్ట్స్ సిటీలను కూడా బడ్జెట్‌లో చేర్చి ఆమోదం తీసుకోవాల్సి ఉంది. అమరావతి రైలు మార్గం భూసేకరణ ప్రక్రియని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మరోవైపు సాగునీటి ప్రాజెక్టులైన గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు పనులు ముందుకు సాగాలంటే నిధులు కేటాయించాలి. అలానే నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ, కృష్ణా నదికి కుడివైపున మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నారు. మంగళగిరిలో చేనేత క్లస్టర్, గోల్డ్ అండ్ జెమ్స్ పార్కు అభివృద్ధికి నిధులు అవసరం. అలానే ఆర్‌వోబీల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు జిల్లాకు కేటాయించారోనని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీ ఎంపిక

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాలుపురం, వాజ్‌పేయి భవనంలో శుక్రవారం జిల్లా బీజేపీ మహిళా మోర్చా కమిటీ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మోర్చా ఉపాధ్యక్షులుగా వాణి వెంకట్, సాధు వాణి, లక్ష్మీదేవి, చాముండే శ్వరి, స్వాతి, విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా రాధికా, రమ్య, రమాదేవి, లక్ష్మి ప్రసన్న, ఫర్హానా, కోశాధికారిగా డాక్టర్ స్రవంతి, సోషల్ మీడియా కన్వీనర్‌గా వెంకటలక్ష్మి, కార్య నిర్వాహక సభ్యులుగా లీలా రాణి, ఉష, లీలా, దుర్గా, పద్మలను ఎంపిక చేసినట్టు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాధామాధవి తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నడ్డి నాగమల్లేశ్వరి, హరిపావని, మిర్చి యార్డ్ డైరెక్టర్ శ్రావణకుమారి, ఈదర శ్రీనివాసరెడ్డి, కుమార్‌గౌడ్, బజరంగ్ రామకృష్ణ తదితరులు పాల్గొని సభ్యులను అభినందించారు.

హేతువాద భావజాలంతోనే నాగరిక సమాజం

● హైకోర్టు న్యాయవాది బైరపనేని నరేష్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంధ, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా హేతువాద దృక్పథంతో మనిషి మనుగడ సాధించగలిగితేనే నాగరిక సమాజం మన గలుగుతుందని ప్రముఖ హైకోర్టు న్యాయవాది, త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి పూర్వాధ్యక్షుడు బైరపనేని నరేష్ తెలిపారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి ఆధ్వర్యంలో 'జాతీయ పురస్కార సభ' స్థానిక జేకేసీ కళాశాల రోడ్డు రాయపాటి రంగారావు విద్యా కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 'కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహిత్యం-నేటి ఆవశ్యకత'పై ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ మాట్లాడుతూ కార్యకారణ సిద్ధాంతాన్ని నమ్మ టం ద్వారా అసమానతలు లేని సమాజం నిర్మించవచ్చని రామస్వామి బలంగా విశ్వసించారన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గద్దె మంగయ్య మాట్లాడుతూ ధర్మశాస్త్రాలు అమానవీయ విశ్వాసాలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా త్రిపురనేని రామస్వామి సమాజాన్ని జాగృతం చేశారని చెప్పారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం : ఏఐఎస్‌టీఎఫ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు సత్వరం పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఏఐఎస్ టీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జోసఫ్ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 మధ్యంతర భృతి ప్రకటించాలని, దీర్ఘకాలిక ఆర్థిక బకాయిల చెల్లింపులకు రోడ్ మ్యాప్ ప్రకటించి వెంటనే బకాయిలను ఉద్యోగులకు చెల్లిం చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.పెదబాబు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు షేక్ బాజీ, వై శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయ రణభేరిని విజయవంతం చేయండి : యూటీఎఫ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశంలో 12వ పీఆర్సీ చైర్మ న్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక అంశాలకు సంబంధించి బడ్జెట్లో నిధులు కేటా యించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 11వ పీఆర్సీ మొత్తం రివర్స్ పీఆర్సీ అని, ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టదాయకమైన అంశాలు తెరమీదకు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తి కావస్తున్న ఇంతవరకు కనీసం 12వ పీఆర్సీ చైర్మన్‌ని కూడా నియమించలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఫిబ్రవరి 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ సందర్భంగా పోస్టర్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎండి షకీలా బేగం పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణానికి ఎన్నికల నోటిఫికేషన్

● నేటి నుంచి 16వ తేదీ వరకు నామినేషన్లు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గానికి మార్చి 1వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ని శుక్రవారం ప్రకటించామని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్, ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటిఫికేషన్ కాపీలను ఎన్టీఆర్ స్టేడియంలో, స్విమ్మింగ్ పూల్, జీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 17న ఉదయం 9 గంటలకు అభ్యర్థుల జాబితా ఎన్టీఆర్ స్టేడియంలో ప్రదర్శిస్తారన్నారు. 19న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని, అనంతరం వ్యాలిడ్ అయిన నామినేషన్లను ఎన్టీఆర్ స్టేడియంలో పబ్లిష్ చేస్తారన్నారు. ఈనెల 20న నామినేషన్లు ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం, తుది లిస్టు పబ్లిష్ చేస్తామన్నారు. అనంతరం మార్చి1న ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, 2గంటల తర్వాత లెక్కింపు, ఫలితాలను వెల్లడిస్తారన్నారు. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీలో 2,160 మంది సభ్యులు ఉన్నారని, పాలకవర్గ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉండాలన్నారు.

కాసరనేని కళాసమితి నాటకోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి 14వ నాటకోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఏర్పాటు చేసిన సభలో సంస్థ చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, సభ్యులు యర్రా ఈశ్వరరావు, పోలిమెట్ల గోపీచంద్, కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాదు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్య దర్శి ఊటుకూరు నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి కళాకారుడు నూతల పాటి కాళిదాసు తదితరులు పాల్గొని పేద విద్యార్థులకు ఉపకార వేతనాల ను పంపిణీ చేశారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత, దర్శ కుడు కావూరి సత్యనారాయణ చేసిన శకుని శపథం ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. అనంతరం మానవతా యడ్లపాడు వారు జరుగుల రామారావు రచన, దర్శకత్వం నిర్వహించిన అంతా మంచివారే కానీ నాటకం ప్రద ర్శించి ప్రేక్షకుల మనస్సును దోచుకుంది. ఈ కార్యక్రమాల్ని ఆదూరి పాపా రావు, నల్లా శేషు తదితరులు పర్యవేక్షించారు.

యూనియన్ బ్యాంకులో డిపాజిట్ పథకం ప్రారంభం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా 6.60 శాతం వడ్డీతో 444 రోజుల కొత్త టర్మ్ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించింది. గుం టూరులోని బృందావన్ గార్డెన్స్ శాఖలో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు బ్యాంకు అధికా రులు తెలిపారు. ఈ ప్రత్యేక పథకం కింద సాధారణ ఖాతాదారులకు సంవత్సరానికి 6.60 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.35 శాతం వడ్డీ అందించనున్నారు. పథకాన్ని పార్లమెంట్ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కార్యదర్శి పాటిబండ్ల విష్ణు, రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్ కలిసి శాఖాధిపతి, బ్రాంచ్ సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు.

ఎన్‌టీఏ రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్‌గా లలితబాబు ఎంపిక

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో ఎన్‌టీఏ రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్‌గా పి.లలితబాబు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తన కార్యాలయంలో ఆయనను అభినందించారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు, మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా తదితర ప్రయోజనాలను కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వ మేనని రామకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి బి.హైమారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి కుటుంబ సభ్యులకు బొత్స పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్సీలు అనంతబాబు, సురేష్‌బాబు ఇతర నేతలు గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి నివాసానికి చేరుకొని పరామర్శించారు. అంబటి నివాసంపై జరిగిన దాడి ఘటన వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

టిప్పరు ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టిప్పర్లు మృత్యుశకటాల్లా మారాయి... మితి మీరిన వేగంతో నగరంలో స్వైరవిహారం చేస్తూ అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నాయి. పగటి సమయంలో నగరంలోకి భారీ వాహనాల ప్రవేశం నిషేధం అయినప్పటికీ నగరంలో లారీలు, టిప్పర్లు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం అమరావతి రోడ్డులోని శివాలయం ఎదుట మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన టిప్పర్ రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఆ వ్యక్తిదేహం ఛిద్రమైంది. లాడ్జి సెంటర్ వైపు నుంచి గోరంట్ల వైపు మట్టి లోడుతో వెళ్తున్న ఏపీ 31 టీబీ 4494 నెంబర్ గల టిప్పర్ ఈ ప్రమాదానికి కారణమైంది. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదం జరిగిన సమయంలో టిప్పర్ మితిమీరిన వేగంతో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అలాగే శుక్రవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్ వచ్చే మార్గంలో మరో టిప్పర్ అతి వేగంగా దూసుకు వచ్చి రెడ్డి పాలెం మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన బాలకోటయ్యను ఢీ కొట్టింది. అదృష్టవశాత్తు అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతిలో హజ్ హౌస్ నిర్మించండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే నసీర్ వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో హజ్ హౌస్ నిర్మా ణంతోపాటు ఇస్లామిక్ అకడమిక్ సెంటర్ ఏర్పాటు చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం శుక్రవారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి సీఎం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుతూ మరింత ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో హజ్ హౌస్ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తూ నిధులు విడుదల చేస్తే ముస్లిం సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. గన్నవరం నుంచి హజ్ యాత్రికులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతోపాటు గుంటూరు ఆటోనగర్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు విషయాన్ని నసీర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని నసీర్ వెల్లడించారు.

కోట్లాది మంది ఆకాంక్షలకు ప్రతిబింబంగా గవర్నర్ ప్రసంగం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి



శాసనసభలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాకుం డా ప్రభుత్వ బాధ్యతకు ప్రతిరూపమని, కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని గుంటూరు పశ్చిమ ఎమ్మె ల్యే గళ్ళా మాధవి అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమా వేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపు తూ ఆమె మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో గత అనుభవాలు, నేటి విజయాలు, భవిష్యత్తు ప్రణాళికలను సమగ్రంగా ప్రతిబింబించాయని, గత పాలకుల విధానాల వల్ల ఏర్పడిన దుష్పరిణామా లను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, ఒక యుద్ధం ఒక రాజ్యాన్ని ఎంతకాలం ప్రభావితం చేస్తుందో, అలానే గత విధ్వంసం కూడా రాష్ట్రాన్ని ప్రభావితం చేసిందని ఎమ్మెల్యే మాధవి అన్నారు. నేడు ఆ విధ్వంసాన్ని అధిగమిస్తూ కుప్పకూలిపోయిన వ్యవస్థలను పునర్నిర్మాణం చేస్తూ రాష్ట్రం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని దూరదృష్టితో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ ఆలోచనలకు రెట్టింపు శక్తిని అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా ఖాజీపాలెంలో ఉన్న కేజీ వీఆర్ ఎంకేఆర్ కళాశాలలో ఈనెల 12న నిర్వహించిన సాహిత్య పోటీల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన కే.అనుష్క, వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి, జి.సిరి ద్వితీయ బహుమతి, కే.శ్రావంతి వ్యాసరచన పోటీలో తృతీయ బహుమతుల పొందారు. వీరు వరుసగా రూ.5వేలు, 3వేలు, రూ.2 వేలు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందుకున్నారని తెలిపారు.

అభ్యుదయ డిగ్రీ కళాశాలలో కల్చరల్ ఫెస్ట్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని శుక్రవారం అభ్యుదయ మహిళా డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. బృంద నృత్యాలు, ఏఐడీఎస్, డేటాసైన్స్, బీకాం విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినుల్ని అభినందించారు. కార్యక్ర మంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ రోహిణిదేవి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

శ్రీమేధ, కెరీర్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల విజయభేరి

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో శ్రీమేధ, కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్త మ ఫలితాలు సాధించారని డైరెక్టర్ శేష సాయిబాబు, అన్నా నందకిషోర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్లు అభినందించారు.



విద్యార్థులతో డైరెక్టర్ అన్నా నందకిశోర్

ఫీజు రీయింబర్స్ బకాయిలు విడుదలపై హర్షం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపశమనం కలిగించేలా ఫీజు రీయింబర్స్ బకాయిలను విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు కూటమి నాయకులు, తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంపై టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కూటమి నేతలు శుక్రవారం స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఎంపికైన విద్యార్థులకు డీఈవో అభినందనలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఈనెల 16న పూణేలో జరగబోయే జిజ్ఞాస జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన వేములూరుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులు, గైడ్ టీచర్‌ను డీఈవో సలీం బాషా తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో ఎంపికైన ప్రాజెక్టు 'స్మార్ట్ యాక్సిడెంట్ డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ సిస్టం' గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును మెరుగుపరచుకొని జాతీయ స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్‌లో కూడా ప్రతిభ కనబరిచి మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గౌసుల్ మీరా, విద్యార్థిని తండ్రి బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సుందరకాండపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలానగర్, సంతోషి మాత దేవస్థానంలో శుక్రవారం ప్రముఖ ప్రవచనకర్త దీవి నరసింహ దీక్షితులు రామాయణంలోని ముఖ్య ఘట్టాలపై ప్రవచనం చేశారు. సుందరకాండలోని తాత్వికత, భక్తి, ధైర్యం, ధర్మసూక్ష్మతలను స్పష్టంగా, సునిశితంగా విశేషంగా వివరించారు. భువనేశ్వరి బృందం వారిచే భక్తి సంగీతం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వ హించారు.

ప్రేమ అనే పవిత్రరాశి

ఇద్దరు ఐఏఎస్‌లను కలిపింది!

● శిక్షణలో మొదలైన పరిచయం పెళ్లిదాకా!


● భార్య పల్నాడు, భర్త నెల్లూరు కలెక్టర్‌గా విధులు



భార్య కృతికా, పిల్లలు రియాన్ష్, అహిల్యాతో కలెక్టర్ హిమాన్షు శుక్లా

పెద్దలు కుదర్చిన పెళ్లిళ్లు చేసుకుని కొందరు జీవితంలో స్థిరపడుతుంటారు. కొందరు చదువుకునేటప్పుడు ప్రేమలో పడుతారు. చదువు పూర్తికాగానే తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుని ఆనందంగా జీవిస్తుంటారు. ఇదే కోవలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా కూడా తను ప్రేమించిన తోటి ఐఏఎస్, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ప్రేమ పెళ్లి చేసుకున్నారు. కృతికా శుక్లాది హరియాణ. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య పూర్తిచేశారు. హిమాన్షు శుక్లాది ఉత్తరప్రదేశ్. ముంబాయి ఐఐటీలో చదివారు. 2013లో ముస్సోరిలో హిమాన్షు శుక్లా ఐఏఎస్ శిక్షణలో చేరారు. అదే బ్యాచ్‌కు చెందిన కృతికా ఆయనకు పరిచయమయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. ప్రాంతాలు వేరైనా ఇద్దరి అభిరుచులు ఒకటే కావడంతో పరస్పరం ఇష్టపడ్డారు. తమ కెరీర్‌కు ప్రాధాన్యం ఇస్తూనే ముందుకు సాగారు. ఆ తరువాత తల్లిదండ్రులను ఒప్పించి 2015లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి బాబు రియాన్ష్(8), పాప అహిల్యా(18నెలలు) ఉన్నారు. ఐఏఎస్ శిక్షణ, వివాహం అయ్యాక ఇద్దరూ పలు జిల్లాల్లో పనిచేశారు. ఎక్కడ పనిచేసినా తమదైన మార్కుతో అందరి మన్ననలు పొందుతున్నారు. వాలంటైన్స్ డే సందర్భంగా నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మొదట యువత తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత చదువు, మంచి ఉద్యోగంపై దృష్టి పెట్టాలని ఆకాంక్షించారు. ఆ తర్వాతే మంచి జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుని పెళ్లి చేసుకోవాలని తన అనుభవంతో ఓ మంచి సలహా ఇచ్చారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



ప్రేమకు స్వాగతం



● నేడు వాలెంటైన్స్ డే..

● సెలబ్రేషన్స్‌కు సిద్ధమైన యువత

● ఆకర్షణకు, ప్రేమకు వ్యత్యాసంలో తికమక

● సున్నితమైన ప్రేమలో కాఠిన్యం


(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ప్రేమ.. ప్యార్.. ఇష్క్.. కాదల్ ఇలా భాష ఏదైనా దాని భావం ఒక్కటే. అతి సున్నితమైన దాని స్వభావమూ ఒక్కటే. భగవద్గీతలో కృష్ణతత్వాన్ని అర్థం చేసుకోవడం ఎంత కష్టమో.. ఈ ప్రేమ తత్వమూ అంతే సంక్లిష్టం. కానీ, ఒక్కసారి దాన్ని అర్థం చేసుకుంటే మాత్రం అది పంచే మాధుర్యాన్ని ఆస్వాదించేందుకు ఒక జీవితం సరిపోదు. ఓ పాత సినిమాలో చెప్పినట్లు 'గులాబీ పువ్వు నచ్చిందంటే దానిని కోసేస్తాం.. అదే ప్రేమిస్తే ఆ మొక్కకి నీళ్లు పోస్తాం. అది వెదజల్లే పరిమళాలను ఆస్వాదిస్తాం'. ఈ ఒక్క మాటలో ఎంత లోతుందో... ఆ లోతును అర్థం చేసుకోలేకే నేటి యువతరం ప్రేమ పేరుతో తప్పుదారి పడుతోంది. ప్రేమకు ఆకర్షణకు అర్థం తెలియక తికమకపడుతోంది.

ప్రేమకు స్వాగతం..ఈ లాజిక్ మిస్సవ్వొద్దు..

ఒక అమ్మాయిని లేదా అబ్బాయిని చూడగానే కలిగేది ఆకర్షణ. పరిచయం పెరిగిన తర్వాత మాటలు కలిసి మనసులో మథనం మొదలయ్యాక పుట్టేది ప్రేమ. ఈ నచ్చడం అనే ఆకర్షణ తాత్కాలికమైతే మథనం తర్వాత ఉదయించే ప్రేమ శాశ్వతమైనది. ఈ తేడా తెలియని కొందరు సున్నితమైన ఈ ప్రేమకు కాఠిన్యాన్ని జోడిస్తున్నారు. ఆత్మహత్యలతో పాటు అఘాయిత్యాలకూ పాల్పడుతున్నారు. ప్రేమకు వక్రభాష్యం చెబుతున్నారు. ప్రేమలోని మాధుర్యాన్ని ఆస్వాదించలేకున్నారు. ప్రేమకు ఆకర్షణకు మధ్యనున్న ఒక పలుచటి తెరను గుర్తించలేక సతమతమవుతున్నారు. ఈ చిన్న విభజన రేఖను అర్థం చేసుకుని అపార్థాలకు ఆస్కారమివ్వకుండా నేటి యువతరం ప్రేమామృత వర్షాన్ని తనివితీరా ఆస్వాదించాలని, జీవితాలను ఆనందమయం చేసుకోవాలని అభిలషిస్తూ.. నిజమైన ప్రేమకు స్వాగతం పలకుతూ.. శనివారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నాణేనికి రెండు వైపులా

ప్రేమానుబంధాన్ని తమ జీవితానికి ప్రేరణగా మార్చుకోవడంతో పాటు ఒడిదుడుకులను సైతం ఓపిగ్గా ఎదుర్కొంటూ పూర్తి స్పష్టతతో కొంతమంది యువత అడుగులేస్తుండగా, ప్రేమలో విఫలమైతే అంతా శూన్యమనేలా భవిష్యత్తునే అంధకారం చేసుకుంటున్న వారు ఇంకొందరు. కానీ, గతంతో పోలిస్తే రెడిమేడ్ ప్రేమలు అధికమయ్యాయని, గతంలో ఓ ప్రేమ విచ్ఛిన్నం కావడానికి సరైన కారణం ఉండేదని, ప్రస్తుతం చిన్నపాటి మనస్పర్థలకే విడిపోతూ ఒకరిపై ఒకరు ద్వేషం పెంచుకుంటూ ప్రేమ స్థానంలో కాఠిన్యం నింపుతున్నారనేది విశ్లేషకుల మాటగా ఉంది. కళాశాల ప్రేమలు పెళ్లి వరకు వెళుతున్న ఉదంతాలు కేవలం పది శాతమేనని ఇటీవల ఓ సర్వే తేల్చి చెప్పింది. ఇదే సమయంలో ఉద్యోగ జీవితంలో పెనవేసుకున్న బంధాల్లో మూడు ముళ్ల వరకు వెళుతున్న బంధాలు దాదాపు 40 శాతం వరకు ఉన్నట్లు అదే సర్వే చెప్పడం వయసుతో పాటు వచ్చే పరిణితికి అద్దం పడుతోంది.





భవిష్యత్తులో నేనెవరినైనా ప్రేమిస్తే..

ఆమె ఒప్పుకునేదాక ఓపిగ్గా ఎదురుచూస్తాను. లేదంటే తిరస్కరణకు కారణాలు కనుక్కొని నన్ను నేను మార్చుకోవడానికి ప్రయత్నిస్తాను. అన్నింటికన్నా ముఖ్యంగా అవతలి వారి అభిప్రాయానికి కూడా విలువివ్వడం ముఖ్యం. ప్రేమలో ఏవీ అనుకూలించకపోయినా స్వీకరించడానికి సిద్ధంగానే ఉంటాను.

-వివేక్, సీఎస్‌సీ థర్డ్ ఇయర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల



ఫైట్ చేసి సాధించుకుంటాను

ఇప్పటివరకైతే ప్రేమ అనే ఆలోచనే లేదు. ఒక వేళ ఈ జర్నీలో ఎవరినైనా నేను ఇష్టపడి, తను కూడా అదే నిజాయితీతో ఉంటే దానిని సఫలీకృతం చేసుకోవడానికి పోరాడుతాను తప్ప.. గివ్ అప్ ఇచ్చే ప్రసక్తే లేదు. ఇరు కుటుంబాల్లో వ్యక్తమయ్యే అభ్యంతరాలను పరిష్కరించి సాధించుకుంటాం. అయినా ప్రస్తుతం దృష్టి అంతా చదువు మీదే.

- కె.సంజన, సీఎస్‌సీ మూడో సంవత్సరం



న్యాయాధికారి పి.రాజశేఖర్

తెలుగులో కోర్టు తీర్పు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి పి.రాజశేఖర్ శుక్రవారం తెలుగులో తీర్పు వెలువరించారు. ప్రామిసరి నోటుపై అప్పు తీసుకున్న కేసులో.. దావా 533/2023పై తీర్పునిచ్చారు. సామాన్యులకు సైతం అర్థం కావాలనే ఆలోచనతో మాతృ భాషలో ఈ తీర్పు ఇవ్వడం పట్ల పలువురు కక్షిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్వీఆర్ జేసీ కళాశాలకు ఏఏ రేటింగ్



మెమొంటోను కళాశాల కార్యదర్శి గోపాలకృష్ణకు అందజేస్తున్న డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు తదితరులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎన్‌పీటీఈఎల్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు చూపిన ప్రతిభకు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో 13వ సారి ఏఏ రేటింగ్, 70 స్టార్ అవార్డులు లభించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థులు 240 గోల్డ్, 530 సిల్వర్, 948 ఎలైట్, గ్రేడ్ సాధించడంతోపాటు 112 మంది టాపర్ సర్టిఫికెట్లు పొందారని వెల్లడించారు. ఇందుకుగాను ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు అవార్డులు స్వీకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఐఐటీ మద్రాసు అందించిన మెమొంటోను కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త కళాశాల సి.ఎస్.డి విభాగాధిపతి డాక్టర్ ఎంవిపి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



620 ఏళ్ల నాటి శాసనం



తామ్ర శాసనాలను ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి అందిస్తున్న పొన్నపల్లి సత్యనారాయణ

శ్రీనాథుడు లిఖించిన..

తామ్ర శాసనంపై అధ్యయనం

● పొన్నపల్లి అగ్రహార చరిత్రపై ఏఎస్ఐ పరిశోధన

చెరుకుపల్లి, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రలో కవి సార్వభౌముడిగా వెలుగొందిన శ్రీనాథ మహాకవి స్వయంగా పర్యవేక్షించినట్లు భావిస్తున్న అరుదైన తామ్ర శాసనాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 620 సంవత్సరాల క్రితం నాటి పొన్నపల్లి అగ్రహారానికి సంబంధించిన ఈ తామ్ర శాసనాలను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ-మైసూర్)ఏపిగ్రఫీ విభాగం డైరెక్టర్ మునిరత్నంరెడ్డి, ఆయన బృందం శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ శాసనాలు ప్రస్తుతం హైదరాబాద్‌లో నివశిస్తున్న పొన్నపల్లి వంశానికి చెందిన 22వ తరం వారసులైన పొన్నపల్లి విద్యాభాస్కర్ వద్ద ఉన్నాయి. ఆరు శతబ్దాలుగా ఈ చారిత్రక సంపదను ఏమాత్రం చెక్కుచెదరకుండా కాపాడుకుంటూ వస్తున్నందుకు ఏఎస్ఐ డైరెక్టర్ పొన్నపల్లి కుటుంబసభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పరిశోధన నిమిత్తం శాసనాల నకళ్ళను అధికారులు సేకరించారు. ఈ శాసనం క్రీ.శ 1404 నాటిది. కొండవీటి సామ్రాజ్యాన్ని పాలించిన పెదకోమటి వేమారెడ్డి తన ఆస్థానంలో అష్టాంగ వేదవిద్య, ముఖ్యంగా సర్పశాస్త్రం(విష చికిత్స)లో అపార ప్రవీణులైన భాస్కరాచార్యులకు పొన్నపల్లి అగ్రహారాన్ని దానంగా ఇచ్చినట్లు ఈ శాసనంలో లిఖించబడి ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే నాడు కోమటి వేమారెడ్డి ఆస్థాన విద్యాధికారిగా ఉన్న శ్రీనాథుడు స్వయంగా ఈ దానశాసనాన్ని రాయించారు. రెడ్డిరాజుల కాలంనాటి పరిపాలన, పాండిత్యం, దానధర్మాలకు ఈ శాసనం ఒక ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది..



సబ్ జూనియర్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన వేటపాలెం ఎడ్ల జత

సబ్ జూనియర్స్ విజేత వేటపాలెం ఎడ్ల జత

మాచవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మాచవరంలో లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల 21వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ముగిశాయి. శుక్రవారం నిర్వహించిన సబ్ జూనియర్ విభాగంలో మొత్తం పది జతలు పాల్గొనగా.. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన ఆర్‌కే బుల్స్ ఎడ్ల జత 3,062.7 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన జీఎల్ఆర్ బుల్స్ లక్ష్మయ్య చౌదరి ఎడ్లు 3,019, ప్రకాశం జిల్లా పొట్లపాడు గ్రామానికి చెందిన జీఎల్ఆర్ బుల్స్ గాయత్రి ఎడ్లు 2769.2, పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలేనికి చెందిన యామని మోహనశ్రీ, యామని రామారావు ఎడ్లు 2756.5, ఉయ్యందన గ్రామానికి చెందిన సపటం వీర బ్రహ్మానాయుడు ఎడ్లు 2697.5, హైదరాబాద్ పట్టణానికి చెందిన ఆర్ఆర్ బుల్స్ రోహన్‌బాబు ఎడ్లు 2615.7, బాపట్ల పట్టణానికి చెందిన వీవీఎస్ఆర్ బుల్స్ వీరాస్వామి ఎడ్లు రెండు వేల అడుగుల దూరం బండ లాగి వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. వీరికి రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ. 25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.12వేలు నగదు బహుమతి, షీల్డ్ బహూకరించారు. న్యాయ నిర్ణేతలుగా రఘునాథపాలెం గ్రామానికి చెందిన తంగెడ హసన్, నంద్యాల జిల్లా హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఎం.సురేష్ వ్యవహరించారు. నిర్వాహణలో కమిటీ అన్ని వసతులు ఏర్పాటు చేసింది.

ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులతో ఆత్మీయ విందు

● నేడు మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు

● హాజరుకానున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులతో శనివారం రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ భేటీ కానున్నారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో హాజరు కావాల్సిందిగా ఇప్పటికే గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు, తెనాలి నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఆహ్వానాలు అందాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకానున్నారు. గతంలో ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులతో ఇలా భేటీలు జరిగిన దాఖలాలు లేవు. మంత్రి లోకేశ్ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల సందర్భంగా తీరిక చేసుకొని రోజుకు ఒకటి రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేల కుటుంబాలకు సమయాన్ని కేటాయిస్తున్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేసి సరదాగా అందరిని పలకరిస్తున్నారు. మహిళలందరికి మంగళగిరి చేనేత వస్త్రాలను బహూకరిస్తున్నారు. ఈ సందర్భంగా కొంతమంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలను ఆయనకు నివేదిస్తున్నారు. అలానే గతంలో నివేదించిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించిందీ... అపరిష్కృతం కాని వాటికి గల కారణాలను మంత్రి లోకేశ్‌కు వివరిస్తున్నారు. మధ్యాహ్నం జరిగే ఆత్మీయవిందుకు ఎమ్మెల్యేలు నసీర్‌అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుటుం బసభ్యులతో హాజరుకానున్నారు.

మార్చి నెలాఖరుకు

రుణ వసూళ్లు పూర్తిచేయాలి

● జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరులోగా ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్రాంచ్‌లలో రుణాల రికవరీలను పూర్తి చేయాలని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. బ్రాడీపేటలోనున్న ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం ఆయన సహకార శిక్షణ కేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో స్వల్పకాలిక శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్రాంచ్‌లలో రుణాల వసూళ్ల అత్యధిక శాతం వెనుకబడి ఉన్నారన్నారు. రుణాల రికవరీలకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించినట్లు గుర్తుచేశారు. సమావేశంలో బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, డీజీఎమ్‌లు, సూపర్‌వైజర్‌లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ మక్కెన, హాజరైన అధికారులు

ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బసవలింగారావు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరు జిల్లాకు చెందిన ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు కె.బసవలింగారావు ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడిగా ఆయన 11 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. విజయవాడలో జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమాశంలో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇప్పటి వరకు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన సయ్యద్ చాంద్ బాషాను రాష్ట్ర జీఓ కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్, పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. 26 జిల్లాల ఏపీటీఎఫ్ శ్రేణుల ఆశయాలకు తగ్గట్లు శక్తివంచన లేకుండా పనిచేస్తానని బసవలింగారావు అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నా రాయణ, పుట్టా జనార్ధనరావు, పి.పార్వతి, గుడిపాటి దాస్, జిల్లా కార్యదర్శులు పి.లక్ష్మీనారాయణ, జి.శివరామకృష్ణ, చక్కా వెంకటేశ్వరరావు, కుంబా లక్ష్మీ శ్రీనివాసరావు, పచ్చల శివరామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్లు కె.రమేష్, బి.సాయిలక్ష్మీ, ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ యూ.వందనం, సభ్యులు ఉన్నారు.



కె బసవలింగారావు

తల్లిని పెట్రోలు పోసి కాల్చి చంపిన కుమార్తె

సత్తెనపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని అతి కిరాతకంగా సజీవ దహనం చేసిందో కూతురు. ఒంటిరిగా ఉంటున్న తల్లి నిద్రలోకి జారుకునేందుకు మాత్రలు ఇచ్చి.. ఆమె చీరలను పైన కప్పి నిప్పంటించింది. ఈ దారుణ ఘటన సత్తెన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. పట్టణంలోని క్రిష్టియన్ పేటలో రమాదేవి అనే మహిళ ఒంటరిగా జీవిస్తోంది. ఈ నెల 8న రాత్రి కాలిన గాయాలతో సజీవదహన మైంది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో భాగంగా రమాదేవి కుమార్తెకు తల్లి మరణ సమాచారం తెలియజేశారు. అయితే ఆమె సరైన రీతిలో స్పందించక పోవడంతో పోలీసులు అనుమానించి, దర్యాప్తు వేగవంతం చేశారు. రమాదేవి చనిపోయిన సమయంలో సీసీ కెమెరాల ఫుటేజీలలో ఆమె కుమార్తె అక్కడే ఉందని పోలీసులు నిర్ధారించుకున్నారు. ప్రత్యేక బృందాలుగా గాలింపు చేపట్టి కుమార్తెను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కుటుంబ గొడవలతోనే తన తల్లిని చంపానని ఆమె పోలీసుల ఎదుట ఒప్పుకుంది. తల్లికి టీలో సిట్రజన్ టాబ్లెట్లు వేసి ఆమె మత్తులోకి వెళ్లిన తర్వాత చీరలు ఒంటిపై వేసి పెట్రోలు పోసి నిప్పంటించింది. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. తల్లిని చంపే అంత పగ కుమార్తె ఎందుకు పెంచుకుంది? అనే విషయాలపై లోతుగా విచారణ జరుపుతున్నారు.

650 ఆర్టీసీ సర్వీసులు

● కోటయ్య భక్తుల కోసం తిరుమల బస్సులు

● నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్ల భక్తులకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. పెద్దసంఖ్యలో తరలి వచ్చే భక్తుల కోసం 650 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్ తెలిపారు. కృష్ణా జిల్లాతో పాటు గుంటూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి సమీకరించి మొత్తం 650 బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట బస్టాండ్ల నుంచి కోటప్పకొండకు నిమిషానికో సర్వీసు రాకపోకలకు చర్యలు తీసుకున్నామన్నారు. కోటప్పకొండ వద్ద టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్టాండ్ల నుంచి కోటప్పకొండపైకి భక్తుల రాకపోకలకు తిరుమల నుంచి తీసుకొచ్చిన 60 సప్తగిరి సర్వీసులను ఏర్పాటు చేశారు. కోటప్పకొండతో పాటు శైవక్షేత్రాలకు రాకపోకలు సాగించే ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ఈడీ స్పష్టం చేశారు. కొండపైకి రాకపోకలు సాగించే సప్తగిరి బస్సుల్లోనూ మహిళలకు స్త్రీ శక్తి కింద జీరో టిక్కెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. మహి ళా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని అదనపు సర్వీసుల ఏర్పాటుకు కూడా సన్నద్ధంగా ఉన్నామన్నారు.

సంస్థపై దూరాభారం

కోటప్పకొండకు గతంలో కృష్ణా జోన్ డిపోల నుంచి బస్సులను పంపించేవారు. అయితే ఈ సారి అలా బస్సులు పంపేందుకు తొలుత నిరాకరించారని సమాచారం. దీంతో నెల్లూరు జోన్ డిపోల నుంచి బస్సులు పంపేందుకు అక్కడి అధికారులు అంగీకరించారు. అయితే చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి బస్సులు రప్పించడం వల్ల సంస్థపై ఆర్థిక భారం పడే అవకాశముందని ఆర్టీసీ వర్గాల్లో చర్చనడుస్తోంది.



ప్రభను లాగుతున్న పొట్టేళ్లు

కోటప్పకొండలో కోలాహలం

(5వ పేజీ తరువాయి)

సేవా సమితి ఆధ్వర్యంలో కొండ దిగువన అన్న ప్రసాద వితరణ జరిగింది. యలమందలో ప్రభల ఊరేగింపు జరగ్గా పోలీసుల పర్యవేక్షణ కొరవడటంతో ట్రాఫిక్ స్తంభించింది. తొలిరోజునే ఇలా ఉంటే తిరునాళ్ల రోజు ట్రాఫిక్ పరిస్థితి ఏమిటని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా ప్రసాదం పంపిణీ

ఈ ఏడాది కోటయ్య భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రసాద విక్రయ కేంద్రాలు పది ఏర్పాటు చేశారు. 600 మంది వలంటీర్లు సేవ చేయడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కోటప్పకొండకు 618 బస్సులతో పాటు ఘాట్ రోడ్డులో రాకపోకలకు 120 బస్సులు ఏర్పాటు చేశారు. ఆయా బస్సుల్లో స్త్రీశక్తి పథకం కింద మహిళలను ఉచిత ప్రయాణాకి అనుమతి ఇచ్చారు.

రేపు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హెటీ లైన్‌కు ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ రాంబొట్లు తెలిపారు. ఆ మరుసటి రోజు సోమవారం ప్రభలు తిరిగి గ్రామాలకు వెళ్లే క్రమంలో కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. భారీ విద్యుత్ ప్రభల నిర్వహకులు ఆయా సమాయల్లో ప్రభలను తరలించాలని సూచించారు. తిరునాళ్లలో విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా 75 ప్రాంతాల్లో 275 మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు.

3 వేల మందితో బందోబస్తు

భక్తుల దర్శనం సాఫీగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ బీ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. 2,500 మంది పోలీసులు, తొమ్మిది ప్లటూన్ల కలిపి మొత్తం 3,000 మందితో బందోబస్తుకు నియమించామన్నారు. పోలీసులు అమలు చేస్తున్న ట్రాఫిక్ నిబంధనలను అందరూ విధిగా పాటించాలన్నారు. ఎనిమిది లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం కొండ కింది నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద, కొండ పైన రాజగోపురం వద్ద ప్రత్యేకంగా పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. భక్తులకు ఏమైనా ఇబ్బంది కలిగితే 9440900885 నెంబర్‌కు సమాచారం ఇస్తూ తక్షణమే పోలీసు చర్యలు తీసుకుంటారని ఎస్పీ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఇలా..

● నరసరావుపేట, వినుకొండ నుంచి వచ్చే వాహనదారులు పెట్లూరివారిపాలెం దగ్గర కోటప్పకొండ మార్గంలోకి ప్రవేశించి అచ్చమ్మపాలెం దాటిన తర్వాత కుడి వైపున పార్కింగ్ చేసుకోవాలి.

● యలమంద, గురువాయపాలెం, గోనేపూడి, చింతలపాలెం నుంచి వచ్చే వాహనదారులు చిలకలూరిపేట మేజరు ఐరన్ బ్రిడ్జి మీదగా వెళ్లి యాదవుల సత్రం పక్కన పార్కింగ్ చేసుకోవాలి.

● చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే భక్తులు ఈటీ జంక్షన్ మీదగా వచ్చి శారదా ఫార్మసీ కాలేజ్ వద్ద పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను నిలుపుకోవాలి.

● చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వారి కోసం శారదా ఫార్మసీ కళాశాల వద్ద ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేశారు.

● చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వారు యడవల్లి దగ్గర ఉన్న అట్టల ఫ్యాక్టరీ, కట్టుబడివారిపాలెం మీదగా ప్రభల నిధికి చేరుకోవాలి. కోమటినేనివారిపాలెం నుంచి వచ్చే వాహనాలు కట్టుబడివారిపాలెం మీదగా ప్రభల నిధికి చేరుకోవాలి.

ప్రభల నిర్వహకులకు సూచనలు..

● నరసరావుపేట, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రభలు యల్లమంద, యాదవుల సత్రం మీదగా రెడ్ల సత్రం పక్కన కేటాయించిన ప్రదేశానికి రాత్రి 8 గంటల లోపు చేరుకోవాలి.

● పెట్లూరివారిపాలెం, కాకాని నుంచి వచ్చే ప్రభలు ఏఎం రెడ్డి కాలేజీ దగ్గర సాగర్ కాల్వ రోడ్డు ద్వారా ప్రభల ప్రదేశానికి చేరుకోవాలి.



కోటప్పకొండకు మొక్కుబడి ప్రభతో పాదయాత్రగా వస్తున్న యువతులు

గోవాడ, క్వారీలకు

50 బస్సులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోవాడ, క్వారీలో జరిగే తిరునాళ్లకు 50 బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. బస్టాండ్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెలవులు, స్త్రీశక్తి పథకాన్ని దృష్టిలో ఉంచుకుని రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతామన్నారు. ఆదివారం వేకువ జామున 4 గంటల నుంచి నిరంతరంగా బస్సులు నడుస్తాయన్నారు. గోవాడ మార్గంలో తెనాలి మార్కెట్ వద్ద, క్వారీ మార్గంలో ఓవర్ బ్రిడ్జి దిగువున ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని చెప్పారు. టిక్కెట్ ధరలు గత ఏడాదిలాగే ఉన్నాయన్నారు. శ్రీశైలం శైవక్షేత్రానికి ఉదయం 5, 6.30 గంటలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 35-40 మంది ప్రయాణికులు ముందుకు వస్తే టిక్కెట్ ధరకే శైవక్షేత్రాలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కోటప్ప కొండకు గుంటూరు నుంచి బస్సులు నడుస్తాయన్నారు.

వైభవంగా ఉత్సవాలు నిర్వహించాలి

● అరవవల్లి ఆలయ సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె: మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని అరవపల్లి గ్రామంలో బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకోటేశ్వరస్వామిని భక్తులు ప్రశాంతంగా దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌కు సమచారం ఇవ్వాలన్నారు. చిన్నగంజాం మండలం సోపిరాలలో బాలకోటేశ్వరస్వామి, చుండూరులో బాలకోటేశ్వరస్వామి, కొల్లురులో బాలకోటేశ్వరస్వామి ఆలయాలకు అధికసంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేయాలన్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

శనివారం • 14 ఫిబ్రవరి 2026

ప్రేమ...
మనలో కలిగే నిస్వార్థమైన, లోతైన భావం. ఆకర్షణ, అనురాగం, దగ్గరితనం, భావోద్వేగాల అనుబంధం. రెండు మనసులు, భావాలు, కలలు పంచుకొంటూ సాగే అనిర్వచనీయమైన పయనం.

ప్రేమిస్తే..!



ప్రేమిస్తే..?

ప్రియమైనవారి చూపు పడితే ఓ వసంతం పుట్టినట్టుగా, నవ్వు వినిపిస్తే రోజంతా పండగలాగా అనిపిస్తుంది. పలికే ప్రతి పలుకూ మనసుకు మధుర గీతమవుతుంది. దరి చేరితే ప్రపంచమే చిన్నదైపోయిన అనుభూతి కలుగుతుంది. ప్రేమిస్తే చెప్పాలి. నిజంగా ప్రేమిస్తే నమ్మకం ఉండాలి. ప్రేమిస్తే సంతోషాలు, సంబరాలే కాదు... బాధ కూడా ఉంటుందని గుర్తుంచుకోవాలి. అది తియ్యనిది కావచ్చు... మాయని గాయం కావచ్చు. అన్నిటికీ సిద్ధపడాలి.

మరి ప్రేమికులకు ఉండాల్సిన లక్షణాలు..?

అసలైన ప్రేమలో ఒకరిపై ఒకరికి నమ్మకం, గౌరవం, త్యాగం, సహనం ఉంటాయి. ఆకర్షణతో దగ్గరవ్వడం ఎంత సహజమో... అనుమానాలు, అపార్థాలతో విడిపోవడం కూడా అంతే సహజంగా జరిగిపోతుంటుంది. కనుక ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం కూడా ప్రేమలో అత్యంత కీలకమంటారు లవ్ గురూలు. ప్రేమించడం కంటే ఆ ప్రేమను నిలబెట్టుకోవడం గొప్ప విషయం. అందుకు ఇద్దరూ సమానంగా కృషి చేయాలి. ప్రేమలో ఒకరు ఎక్కువ... ఒకరు తక్కువ కాదు.

మోహం... ప్రేమ...

చాలా సందర్భాల్లో మోహాన్ని, ప్రేమను ఒకటిగా భ్రమ పడుతుంటారు. మోహం... త్వరగా మొదలై త్వరగా తగ్గిపోతుంది. రూపం, ఆహార్యం తదితర బాహ్య అంశాలపై ఆధారపడుతుంది. ఇది తాత్కాలికం.

ప్రేమ ఆలస్యంగా చిగురించినా... సుదీర్ఘ ప్రయాణానికి నాంది అవుతుంది. హృదయంతో స్పర్శిస్తుంది. సంతోష సమయాల్లోనే కాదు... కష్టాల్లోనూ నిలబడుతుంది. జీవితానికి ఒక అర్థాన్నిస్తుంది.

చిన్న చిన్న సంతోషాలు...

ఏది ఏమైనా ప్రేమనేది కాలక్షేపం కహానీలాగా మిగిలిపోకూడదు. కలకాలం కలిసి జీవించడానికి అది బలమైన పునాది కావాలి. ఇక్కడ నిజాయతీ ముఖ్యం.

లేవగానే ఓ పలుకరింపు... కలిసినప్పుడు ఓ కప్పు కాఫీ... సందర్భాన్ని బట్టి ఓ బహుమతి... చిన్న చిన్న సంతోషాలే ప్రేమను పటిష్టం చేస్తాయి. బాధలో ఉన్నప్పుడు ఓదార్పు... కష్టాల్లో ఉన్నప్పుడు భరోసా... బంధానికి కొత్త శక్తినిస్తాయి.

సర్వావస్థల్లోనూ...
కాలం మారినా... పరిస్థితులు మారినా... ప్రియతమే హృదయ స్పందన కావాలి. ప్రేమనేది కేవలం భావనో, భావోద్వేగమో కాదు... ప్రతి రోజూ, ప్రతి క్షణం పునరావృతం అవ్వాల్సిన ప్రతిజ్ఞ. ఎందుకంటే నిజమైన ప్రేమ నిస్వార్థమైనది. నిరంతరమైనది. అలాంటి ప్రేమకు ప్రతి రోజూ ప్రేమికుల రోజే!

నేడు ప్రేమికుల దినోత్సవం

వంటిల్లు

ప్లేట్‌లో వడ్డించిన స్నాక్స్ చిటికెలో ఖాళీ అయిపోతాయి. అదే చిటికెలో వాటిని తయారుచేసే వీలుందా? నిజానికి నిమిషాల వ్యవధిలో తయారు చేయగలిగే స్నాక్స్ కూడా ఉన్నాయి. అవేంటంటే...

చిటికెలో స్నాక్స్



ఫ్రూట్ శ్రీఖండ్




పెరుగు ప్రియుల మనసు దోచే స్నాక్ ఇది. తయారీ సులభం, రుచి అమోఘం. ఒకసారి ట్రై చేసి చూడండి.

కావలసిన పదార్థాలు:

నీళ్లు ఒంపేసిన పెరుగు (హంగ్ కర్డ్) - రెండు కప్పులు
పాల పొడి - కప్పు
జెల్లీ - అర కప్పు
పళ్ల ముక్కలు (యాపిల్, బొప్పాయి, సపోటా, దానిమ్మ, ద్రాక్ష, అరటి) - అర కప్పు

తయారీ విధానం:

- పెరుగులో పాలపొడి ఉండలు లేకుండా కలపాలి.
- దీన్లో పళ్ల ముక్కలు సమంగా కలిపి ఫ్రిజ్‌లో ఉంచాలి.
- చల్లబడిన తర్వాత బౌల్స్‌లోకి తీసుకుని పైన జెల్లీతో అలంకరించి చల్లగా సర్వ్ చేయాలి.



పొటాటో బాల్స్

బంగాళాదుంపలతో వండే ఏ వంటకమైనా కమ్మగానే ఉంటుంది. భిన్నమైన ప్రయోగాలకు కూడా ఈ దుంపలు అనువుగా ఉంటాయి కాబట్టి ఇదిగో ఈ వెరైటీ స్నాక్ తయారుచేసి, రుచి చూడండి...

కావలసిన పదార్థాలు:

- ఉడకబెట్టిన బంగాళాదుంపలు: పావు కిలో
- ఉప్పు, మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్: సరిపడా
- చీజ్: 100 గ్రాములు
- గుడ్డు: 1
- బ్రెడ్ పొడి: అర కప్పు
- నూనె: వేపుడుకు సరిపడా

తయారీ విధానం:

- బంగాళా దుంపలను, మెత్తగా మెదుపుకోవాలి
- గుడ్డు బాగా గిలక్కొట్టుకోవాలి
- బ్రెడ్ పొడిని వెడల్పాటి గిన్నెలో వేసుకోవాలి
- చీజ్: గ్రేట్ చేసి పెట్టుకోవాలి
- దుంపల ముద్దలో ఉప్పు, చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి వేసి, బాగా కలుపుకోవాలి.
- పూరీ పిండి పరిమాణంలో దుంపల ముద్దను తీసుకుని దాన్లో అర టీస్పూను చీజ్ తరుగును ఉంచి, ఉండలా చుట్టుకోవాలి.
- ఇలా ఉండలన్నిటినీ తయారు చేసుకున్న తర్వాత, ముందుగా కోడిగుడ్డు సొనలో, తర్వాత బ్రెడ్ పొడిలో ముంచి పక్కన పెట్టుకోవాలి.
- ఇలా ఉండలన్నీ రెడీ చేసుకుని, మరిగే నూనెలో వేయించి, బంగారు రంగు వచ్చేవరకూ వేయించుకోవాలి.
- తర్వాత ఈ పొటాటో బాల్స్‌ను టమాటో సాస్, సలాడ్ డ్రెస్సింగ్‌తో అలంకరించి వేడి వేడిగా సర్వ్ చేయాలి.

యాపిల్ రింగ్స్

యాపిల్ పండ్లతో స్నాక్ సాధ్యమా? అని ఆశ్చర్యపోకండి. నిజానికి ఈ స్నాక్స్‌ను ఒకసారి రుచి చూస్తే, తీరిక దొరికిన ప్రతిసారీ వీటినే వండుకుని తినేస్తూ ఉంటారు.

కావలసిన పదార్థాలు:

- యాపిల్స్: 3 (పులుపు లేకుండా తీయగా ఉండాలి)
- మైదా పిండి: 1 కప్పు
- బేకింగ్ పౌడర్: పావు టీస్పూను
- ఉప్పు: పావు టీస్పూను
- దాల్చిన చెక్క పొడి: అర టీస్పూను
- చక్కెర పొడి: 2 టేబుల్ స్పూన్లు
- చిక్కని మజ్జిగ: 1 కప్పు
- గుడ్డు: 1
- కోటింగ్ కోసం: సమ పరిమాణాల్లో చక్కెర పొడి, దాల్చిన చెక్క పొడి కలిపి, వెడల్పాటి ప్లేట్‌లో వేసి పెట్టుకోవాలి.

తయారీ విధానం:

- వెడల్పాటి గిన్నెలో మైదా, బేకింగ్ పౌడర్, ఉప్పు, చక్కెర పొడి వేసి కలిపి పెట్టుకోవాలి.
- మరో గిన్నెలో గుడ్డు, మజ్జిగ వేసి బాగా కలుపుకోవాలి.
- ఇలా కలిపి పెట్టుకున్న మజ్జిగ మిశ్రమాన్ని మైదా పిండి మిశ్రమంలో వేసి జారుడుగా కలుపుకోవాలి.
- యాపిల్స్ తొక్క తీయకుండానే పావు అంగుళం మందంతో చక్రాల్లా తరుక్కోవాలి. విత్తనాలు తీసేయాలి.
- ఇలా యాపిల్ చక్రాలను సిద్ధం చేసుకుని, పిండిలో ముంచి, అదనపు పిండి వదిలేవరకూ పైకి లేపి ఉంచి, మరిగే నూనెలో వేయాలి.
- ఇలా ఒకసారికి నాలుగు, నుంచి ఐదు చక్రాలు బాండీలో వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేయించి, తీయాలి.
- వేయించిన వాటన్నింటినీ చక్కెర, దాల్చినచెక్క పొడిలో రెండు వైపులా అద్ది ప్లేట్లో అమర్చుకోవాలి.
- వీటిని జామ్, కెచప్, పీనట్ బటర్‌లతో కలిపి తింటే చాలా బాగుంటాయి.





అదే... పదే పదే

గాఢమైన ప్రేమలో... పీకలోతుగా ఒక వ్యక్తి ఎన్నిసార్లు మునుగుతాడు? ప్రేమ చీమ ఒకర్ని ఎన్నిసార్లు గట్టిగా కుడుతుంది? ప్రేమ జీవితంలో ఒకేసారి పుడుతుందని కరాఖండీగా చెబుతారు చాలామంది. అది ఎంతవరకూ నిజమో తేల్చేద్దామని అమెరికాలోని ఇండియానాకి చెందిన కిన్సే ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఈ మధ్య జరిపిన ఓ అధ్యయనం ప్రేమికుల హృదయాల గుట్టు విప్పింది. ఈ అధ్యయనం కోసం అమెరికాలో 18 నుంచి 98 ఏళ్ళ మధ్య వయసున్న 10,036 మందిని ఎంచుకున్నారు. అందరికీ ఒకే ప్రశ్న: మీరు ఎన్నిసార్లు గాఢంగా ప్రేమించారు? పాల్గొన్నవారందరూ చెప్పిన జవాబుల సగటు ప్రకారం... 2.05 సార్లట!




అయితే ఫలితాలను మరింత వివరంగా పరిశీలించినప్పుడు చాలా ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. 14 మంది ఒక్కసారి కూడా ప్రేమ కాటు తినలేదట! 28 శాతం మంది ఒకసారి, 31 శాతం మంది రెండుసార్లు, 17 శాతం మంది మూడుసార్లు, 11 శాతం మంది నాలుగుసార్లో అంతకన్నా ఎక్కువ పర్యాయాలో ప్రేమలో తలమునకలైపోయామని చెప్పారు. "పూర్వ ప్రేమికులైనా, ఇప్పటి కుర్రకారైనా ప్రేమలో పడడం గురించి విసుగు లేకుండా తన్మయత్వంతో మాట్లాడతారు, ముచ్చట్లు చెబుతారు. అయితే ఎంతోమంది విషయంలో ప్రేమ కేవలం ఒక్కసారే పుట్టేది, కేవలం ఒక్కరి విషయంలోనే గాఢంగా నిలిచేదీ కాదనే విషయం కాదని ఈ అధ్యయనం సగటు ఫలితాల్ని చూస్తే అర్థమవుతోంది" అంటున్నారు కిన్సే శాస్త్రవేత్తలు.

దీనితోపాటు ఇదే యూనివర్సిటీ శాస్త్రవేత్తలు... సింగిల్‌గా ఉన్న వాళ్ళతో మరో అధ్యయనం కూడా చేశారు. "మేము చాలా రొమాంటిక్ అనీ, తొలి చూపులో ప్రేమ గొప్పది అనే కథల్ని గట్టిగానే నమ్మాం" అంటున్న ఈ ఒంటరి జీవుల్లో 51 శాతం మంది... "గత తరాలతో పోలిస్తే ఇప్పుడు ప్రేమికుల్లో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంది" అని గొల్లుమన్నారు. "సినిమాలు, సోషల్ మీడియా వల్ల భాగస్వాముల విషయంలో అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి" అని 73 శాతం మంది బావురుమన్నారు. "ఏది ఏమైనప్పటికీ... గుండె 'లవ్ లవ్' అంటూ కొట్టుకుంటూనే ఉంటుంది. అదే ప్రేమంటే... అది దేశాలకు, కాలాలకు, తరాలకు అతీతమైన మ్యాజిక్" అనేది అధ్యయనకర్తల ముక్తాయింపు.

> **"సినిమాలు, సోషల్ మీడియావల్ల భాగస్వాముల విషయంలో అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి" అని 73 శాతం మంది అభిప్రాయం.**

తునికి పండ్లూ పోషకాలే

భోజన కుతూహలం



సాధారణంగా తునికి ఆకులతో బీడీలను చూడతారు. అయితే ఈ తునికి మొక్కలకు అనేక ఔషధ గుణాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. తునికి చెట్టును సంస్కృతంలో తిండుక అని పిలుస్తారు. ఈ మొక్కలు సాధారణంగా అడవి ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతాయి. ఈ మొక్కలకు కాచే పళ్లకు మంచి ఔషధ గుణాలున్నాయి. ఇవి కొద్దిగా వగరుగా.. కొద్దిగా తీపిగా ఉంటాయి. ఒకప్పుడు గిరిజనులు ఈ పళ్లతో రక రకాల వంటలు వండేవారు.

- తునికి పళ్లు శరీరంలో నీటి శాతాన్ని తగ్గిస్తాయి. దీని వల్ల నీళ్ల విరోచనాలు ఉన్నవారు ఈ పళ్లను తినటం మంచిది.
- ఈ పళ్లను ఎక్కువగా తింటే నాలుగు మొద్దుబారతాయి.
- ఈ పళ్లలో పిండి పదార్థాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల మధుమేహ రోగులు కూడా వీటిని తినవచ్చు.
- వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.
- ఈ పళ్లలో విటమిన్ ఏ, ఈలు ఉంటాయి. అందువల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది.
- శరీరంలో విషదోషాలను హరించే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి.
- నోటి పూత తగ్గటానికి కూడా ఈ పళ్లు పనిచేస్తాయి.

• గంగరాజు అరుణాదేవి

పేరెంటింగ్

మంచి అలవాట్లకు ఇప్పుడే బీజం

సరైన తిండి, సమయానికి నిద్ర పోవడం, చిన్నచిన్న వ్యాయామాలు చేయడం వంటి అలవాట్లు బాల్యం నుంచే నేర్పించాలి. పిల్లలు ఆరోగ్యంగా ఉండడానికి ఇవి చాలా దోహదం చేస్తాయి.

స్క్రీన్‌టైంపై నిఘా...

ఈ కాలంలో ఫోన్‌కు అలవాటుపడని పిల్లలు ఉండరు. సాంకేతికతను ఎలా ఉపయోగించాలో వారికి వివరంగా తెలపాలి. చదువుకు సంబంధించిన యాప్స్, గేమ్స్ ఇప్పుడు బోలెడు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిచయం చేసి ఏ వెబ్‌సైట్స్ కావాలో, ఏవి వద్దో తల్లిదండ్రులు నిర్ణయించి ఫోన్‌లో తగిన సెట్టింగ్స్ చేయాలి.

స్వతంత్రంగా ఆలోచించనివ్వండి...

పిల్లలకు కొన్నికొన్ని విషయాల్లో స్వేచ్ఛను ఇవ్వాలి. అలా ఇవ్వడంవల్ల వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. దీనిద్వారా ఆలోచనాశక్తి పెరిగి, మానసిక వికాసం పొందుతారు.

భాగస్వామ్యం అవసరం...

విద్యావంతులు, తల్లిదండ్రుల భాగస్వామ్యం పిల్లల పెంపకంలో కీలకమైనది. వీరి సమన్వయంతో విద్యాపరమైన, సామాజికపరమైన సలహాలు, సూచనలు పిల్లలకు ఇస్తూ ఉండాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలు నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరవ్వాలి. తమ పిల్లల చదువు, భవితపై ఉపాధ్యాయులతో చర్చించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలి.

బంధం బలంగా...

తల్లిదండ్రులు పిల్లలతో బలమైన బంధాలు ఏర్పరచుకోవాలి. వారిని ఎప్పుడూ ఉత్సాహపరుస్తూ ప్రతి అవసరంలో తోడుగా ఉంటే తల్లిదండ్రుల పట్ల నమ్మకం కలుగుతుంది. ఇది ఇరువురి మధ్య బంధానికి గట్టి పునాది వేస్తుంది. వారితో కలిసి ఆడడం, కొత్త ప్రదేశాలను చూపించడం ద్వారా వారిలో మానసిక పరిపక్వత పెరుగుతుంది.



నిజమైన బంధానికి ముందు..!

ప్రేమలో పడటం అనేది ఒక ప్రత్యేక అనుభూతి. అయితే ఆ ప్రేమను జీవిత కాల అనుబంధంగా మార్చుకోవాలంటే... ముందుగా భాగస్వామి గురించి పూర్తిగా తెలియాలి. లేదంటే ఎన్నడూ ఊహించని హృదయవిదారక స్థితికి చేరే అవకాశం ఉందంటున్నారు లవ్ గురూలు. ఆరంభంలోనే ప్రతికూలతలు గమనించి అడుగులు వేయడం వల్ల బంధం బలపడుతుందంటున్నారు. మరి అలాంటి సంకేతాలను గుర్తించడం ఎలా..?



అస్థిరత:

కొన్ని బంధాల్లో ఉన్నప్పుడు ఆరంభంలో అంతా బానే అనిపిస్తుంది. నిరంతరం మీకు సందేశాలు పంపుతూ, మిమ్మల్ని ప్రత్యేకంగా భావిస్తుంటారు. కొంత కాలం గడిచాక ఏవేవో సాకులు చెబుతుంటారు. తరువాత మిమ్మల్ని అవమానించేలా మాట్లాడతారు. మీలో తప్పులు వెతికే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటివారిలో స్థిరత్వం లేదని అర్థం చేసుకోండి. ఎప్పటికప్పుడు వారి ప్రాధామ్యాలు మారిపోవడం, భాగస్వామిపై నమ్మకం లేకపోవడంలాంటివి అందుకు ఒక కారణం కావచ్చు. ఆరోగ్యకరమైన ప్రేమ విశ్వసనీయతపై ఆధారపడి ఉంటుంది. 'వారు మారతారులే' అని వేచి చూస్తూ సమయం వృథా చేసుకోవద్దు. నేరుగా అడగండి. దాటవేత సమాధానాలు వస్తే వారికి ఈ బంధం పట్ల నిజాయతీ లేదని.

అగౌరవం:

నిజమైన బంధంలో ఎప్పుడూ 'ఎస్'లకే కాదు... మీరు ఏదైనా విషయంలో 'నో' చెప్పినా అవతలి వ్యక్తి దాన్ని గౌరవించాలి. ఒకవేళ మీరు ఎందులోనైనా హద్దులు పెట్టుకొంటే వాటిని ఒప్పుకోవాలి.
మీ నిర్ణయాలను అగౌరవపరిచినా, కాదని హద్దులు చెరిపే ప్రయత్నం చేసినా అది ఒక హెచ్చరికగా తీసుకోవాలి. వారు మిమ్మల్ని అపరాధ భావనకు గురి చేసినా,
పదే పదే మీ పరిమితులు పరీక్షించినా ఆ బంధంలో కొనసాగడంలో అర్థం లేదని గ్రహించండి. అలాంటి బంధాలు తరువాత తీవ్ర సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది.

దాటవేత:

భవిష్యత్తు గురించి చర్చలను మీ భాగస్వామి దాటవేస్తున్నా, మీకు సరైన సమాధానాలు చెప్పకుండా తప్పించుకొంటున్నా... దాన్ని పెద్ద సమస్యగా భావించండి. బలమైన బంధానికి ఉమ్మడి జీవిత లక్ష్యాలు అవసరమని గుర్తించండి. 'మనం'కు బదులు 'నేను' అనే మాటలు పదే పదే వినిపిస్తే జాగ్రత్త పడండి. అలాంటివారిలో నిబద్ధత లేదని అర్థం.

అసూయ:

ప్రేమలో అభద్రత నుంచి అసూయ పుడుతుంది. తరచూ మీ ఫోన్‌ను తనిఖీ చేయడం, వేరొకరితో చనువుగా మాట్లాడినా, సోషల్ మీడియాలో మీ పోస్ట్‌లకు ఎక్కువ లైక్‌లు వచ్చినా, మిమ్మల్ని పొగిడినా తట్టుకోలేకపోవడం లాంటివి ఈ కోవలోకే వస్తాయి. ఇలాంటివారికి దూరంగా ఉండటం ఉత్తమం. ప్రేమలో ప్రధానంగా కావల్సింది... నమ్మకం. ఎదుటి వ్యక్తి ఇష్టాయిష్టాలను గౌరవించడం.

అరమరికలు:

పరస్పరం అర్థం చేసుకొని అరమరికలు లేకుండా సాగితే ఏ బంధమైనా కలకాలం నిలిచివుంటుంది. ప్రేమలో తియ్యని కబుర్లు, వలపుల మెరుపులే కాదు... విరహవేదనలు, మానసిక సంఘర్షణలు కూడా ఉంటాయి. ఎలాంటి ఉప్పెనలు వచ్చినా నిలబడాలంటే... ఉమ్మడి విలువలకు కట్టుబడితేనే అది సాధ్యమవుతుంది. మీ ప్రేమ కాల పరీక్షలను తట్టుకోగలుగుతుంది.

బిజినెస్

గుంటూరు ● శనివారం 14 ఫిబ్రవరి 2026

బ్లాక్ ఫ్రైడే

స్టాక్ మార్కెట్ భారీ పతనం



- సెన్సెక్స్ 1,048 పాయింట్లు డౌన్
- 25,500 దిగువకు నిఫ్టీ
- ఐటీ, మెటల్ షేర్లలో అమ్మకాలు
- రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌కు ఈ వారాంతం బ్లాక్ ఫ్రైడేగా పరిణమించింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ట్రేడర్లు ఐటీ, లోహ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,140.37 పాయింట్లు క్షీణించి 82,534.55 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,048.16 పాయింట్ల (1.25 శాతం) నష్టంతో 82,626.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 336.10 పాయింట్లు (1.30 శాతం) పతనమై 25,471.10 వద్ద స్థిరపడింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.7.02 లక్షల కోట్లు తగ్గి రూ.465.46 లక్షల కోట్లకు (5.13 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

అసలేమైంది...?

అంతర్జాతీయ ప్రతికూలతలతో పాటు డిసెంబరు త్రైమాసిక ఫలితాల సీజన్ అంచనాల కంటే బలహీనంగా ఉండటం, ఆంథ్రోపిక్ విడుదల చేసిన కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ దేశీయ ఐటీ రంగ కంపెనీల ఆదాయానికి భారీగా గండికొట్టవచ్చన్న భయాలు మార్కెట్లో అమ్మకాల ఒత్తిడిని పెంచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ఆంథ్రోపిక్ ఎఫెక్ట్‌తో టెక్ షేర్లలో గత కొన్ని రోజులుగా అమ్మకాలు కొనసాగుతున్నాయి. దాంతో నిఫ్టీ ఐటీ సూచీ ఇంట్రాడేలో 10 నెలల కనిష్ఠానికి పతనమైంది. అమెరికా ఆంక్షల నుంచి ఊరట కోసం రష్యా మళ్లీ డాలర్లలో చెల్లింపులను స్వీకరించేందుకు సిద్ధమవుతున్నదన్న వార్తల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లు మెటల్స్‌తో పాటు ఇతర కమోడిటీ షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 నష్టపోయాయి. ఈ వారం మొత్తం మీద సెన్సెక్స్ 953.64 పాయింట్లు (1.14%), నిఫ్టీ 222.6 పాయింట్లు (0.86%) క్షీణించాయి.

విరూపాక్ష ఆర్గానిక్స్ ఐపీఓకు సెబీ ఆమోదం

హైదరాబాద్‌కు చెందిన విరూపాక్ష ఆర్గానిక్స్, పరుపుల తయారీ కంపెనీ డ్యూరోఫ్లెక్స్, ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ సహా 5 కంపెనీల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)లకు సెబీ ఆమోదం లభించింది. అందులో ముంబైకి చెందిన హెక్సాగాన్ న్యూట్రిషన్, ఓమ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కూడా ఉన్నాయి. ఐపీఓలో భాగంగా విరూపాక్ష ఆర్గానిక్స్ పూర్తిగా తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.740 కోట్లు సమీకరించాలనుకుంటోంది. అందులో రూ.360 కోట్లను ప్లాంట్ల విస్తరణకు పెట్టుబడి పెట్టనుంది. మరో రూ.195 కోట్లతో రుణ భారాన్ని తగ్గించుకోవాలనుకుంటోంది. మిగతా సొమ్మును ఇతర వ్యాపార అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు సెబీకి సమర్పించిన ఐపీఓ పత్రాల్లో (డీఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ వెల్లడించింది.

ఈక్విటీ సెగ్మెంట్‌లోకి ఎన్‌సీడీఈఎక్స్

నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్).. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లోకి కూడా ప్రవేశించేందుకు సన్నద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన ట్రేడింగ్, పర్యవేక్షణ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి కోసం దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్‌తో ఎన్‌సీడీఈఎక్స్ దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. 2003లో ఏర్పాటైన ఎన్‌సీడీఈఎక్స్.. సెబీ నియంత్రిత అగ్రి కమోడిటీ ఎక్స్ఛేంజ్.

- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నమోదిత ఇన్వెస్టర్ ట్రేడింగ్ ఖాతాలు ఈ నెలలో 25 కోట్లు దాటాయి. గడిచిన 16 నెలల్లో ఎన్ఎస్ఈ ట్రేడింగ్ అకౌంట్లు 5 కోట్లు (20 కోట్ల నుంచి 25 కోట్లకు) పెరిగాయి. మొత్తం ఖాతాల్లో 20 శాతానికి సమానమిది. అంతేకాదు, కేవలం రెండు నెలల్లో అకౌంట్లు 24 కోట్ల నుంచి 25 కోట్లకు పెరిగాయి.

పెన్షన్‌తో పాటు హెల్త్ కవరేజీ!

పీఎఫ్ఆర్‌డీఏ చైర్మన్ ఎస్ రామన్ వెల్లడి

ముంబై: ఇన్వెస్టర్ల ప్రయోజనార్థం మూడు పెన్షన్ ఫండ్లు తమ ప్లాన్‌తో పాటు ఆరోగ్య బీమా కవరేజీని కూడా ఆఫర్ చేసే దిశగా కసరత్తు చేస్తున్నాయని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చైర్మన్ ఎస్ రామన్ తెలిపారు. ఈ హెల్త్ కవరేజీని హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు లేదా హెల్త్‌కేర్ ప్రొవైడర్లతో భాగస్వామ్యం ద్వారా అందించే అవకాశముందన్నారు. ఈ జనవరిలో ప్రారంభించిన స్వాస్థ్య పెన్షన్ స్కీమ్‌లో భాగంగా ఇన్వెస్టర్లకు హెల్త్ కవరేజీ అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఉద్దేశంతోనే పీఎఫ్ఆర్‌డీఏ గత నెలలో స్వాస్థ్య ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. ఈ స్కీమ్ ప్రకారం.. పెన్షన్ ప్లాన్ గడువు సమయంలో ఇన్వెస్టర్ల సొమ్ములో 30 శాతం వరకు వైద్య ఖర్చుల కోసం పక్కనపెట్టడం జరుగుతుంది. ఐసీఐసీఐ, యాక్సిస్, టాటాలు స్పాన్సర్ చేస్తున్న పెన్షన్ ఫండ్లు హెల్త్ కవరేజీతో కూడిన ప్లాన్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే పనిలో ఉన్నాయని రామన్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	583	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	120
వరంగల్	125	గుంటూరు	120
కరీంనగర్	125	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	95
కర్నూలు	125	నెల్లూరు	100
విశాఖపట్నం	115	అనంతపురం	100
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,55,830 ▼	1,42,850 ▼	2,80,000 ▼
విజయవాడ	1,58,700 ▼	1,48,000 ▼	2,57,500 ▼
విశాఖపట్నం	1,57,968 ▼	1,42,800 ▼	2,80,000 ▼
రాజమండ్రి	1,55,780 ▼	1,42,800 ▼	2,50,000 ▼
ప్రొద్దుటూరు	1,56,500 ▼	1,44,070 ▼	2,55,500 ▼
ముంబై	1,52,765 ▼	1,39,933 ▼	2,42,433 ▼

ఈ ఏడాది జీసీసీల్లో 1.4 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: అవునన్నా, కాదన్నా కృత్రిమ మేధ (ఏఐ) ఉద్యోగాలపై పెను ప్రభావం చూపిస్తోంది. ఈ ప్రభావం మన దేశంలోనూ కనిపిస్తోంది. గత ఏడాది మన దేశంలోనూ గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలే 5,500 నుంచి 6,500 మంది ఉద్యోగులను ఇంటికి పంపించినట్టు తెలుస్తోంది. ఇతర కంపెనీల తీసివేతలను కూడా కలిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుందని భావిస్తున్నారు. ఏఐ టూల్స్‌తో పనిచేయడం నేర్చుకుంటే ఉండండి లేకపోతే, బయటికి పోండి అని గూగుల్ కంపెనీ ఇప్పటికే ఉద్యోగులకు స్పష్టం చేసింది. దీంతో ఐటీ ఉద్యోగులందరూ ఇప్పుడు ఏఐ టూల్స్‌తో కుస్తీ పడుతున్నారు. అయినా ఈ ఏడాది కూడా భారత టెక్ రంగంలో ఏఐ కారణంగా 10,000 మందికిపైగా రోడ్డున పడతారని అంచనా.

జీసీసీలపైనే ఆశ: ఐటీ కంపెనీలు ఏఐ నైపుణ్యాలు లేని ఉద్యోగులను నిశ్శబ్దంగా ఇంటికి పంపిస్తున్నాయి. ఏదో ఒకటి అరా కంపెనీలు తప్ప ఐటీ కంపెనీలు ఫ్రెషర్స్ నియామకాలను దాదాపుగా పక్కన పెట్టేశాయి. అయితే దేశంలో ఏర్పాటవుతున్న గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాల్లో (జీసీసీ) మాత్రం నియామకాలు కొనసాగుతున్నాయి. గత ఏడాది ఈ కంపెనీలు దాదాపు 1.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాయి.

దీంతో ప్రస్తుతం దేశంలో 1,800కు పైగా ఉన్న జీసీసీల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య 20 లక్షలు మించిపోయింది. ఈ ఏడాది కూడా ఈ సంస్థలు 1.2 లక్షల నుంచి 1.4 లక్షల మంది ఉద్యోగులను కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకుంటాయని అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది తక్కువ. ఏఐ టూల్స్ ప్రభావం వల్లే జీసీసీలు కూడా నియామకాల జోరు తగ్గించాయని భావిస్తున్నారు.

'ఏఐ'తో పెనుమార్పులు

ఐటీ కంపెనీలైతే ఫ్రెషర్స్ నియామకాలను దాదాపుగా పక్కన పెట్టేశాయి. ఏఐ టూల్స్ ట్రయల్ రన్ దశను దాటి, కార్యరంగంలోకి రావడంతో 10 మంది చేసే పని ఒకరితో పూర్తవుతోంది. దీంతో జీతాల భారం తగ్గడంతో పాటు ఉత్పాదకత 20 నుంచి 30 శాతం వరకు పెరుగుతోంది. దీంతో ఏఐ నైపుణ్యాలు ఉంటే తప్ప ముందు ముందు ఐటీ కంపెనీలు, జీసీసీల్లో ఉద్యోగాలు దొరికే పరిస్థితి కనిపించడం లేదు.

తగ్గిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ3)లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) కన్సాలిడేటెడ్ నికర లాభం 14% క్షీణించి రూ.173.96 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.202.10 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో సంస్థ మొత్తం ఆదాయం రూ.2,748.22 కోట్ల నుంచి రూ.4,082.77 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.2,293.49 కోట్లుగా ఉన్నాయి. క్యూ3లో ఢిల్లీ విమానాశ్రయం నుంచి 2.08 కోట్ల మంది, హైదరాబాద్ నుంచి 78 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు జీఎంఆర్ వెల్లడించింది. కాగా ఈ కాలంలో హైదరాబాద్ విమానాశ్రయం మొత్తం ఆదాయం రూ.609 కోట్ల నుంచి రూ.659 కోట్లకు పెరగగా లాభం రూ.61 కోట్ల నుంచి రూ.86 కోట్లకు పెరిగింది.

రూ.240 కోట్లతో కొత్త ప్లాంట్

స్టాండర్డ్ ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టాండర్డ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (గతంలో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్).. తన కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కంపెనీ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లోకి ప్రవేశిస్తోంది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ కొత్త కార్పొరేట్ ఐడెంటిటీని విడుదల చేసిన సందర్భంగా సంస్థ ప్రమోటర్, ఎండీ, కందుల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా హెవీ ఇంజనీరింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, న్యూక్లియర్ తదితర రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీలోకి అడుగుపెడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం హైదరాబాద్ సమీపంలోని జిన్నారంలో కొత్తగా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రావు తెలిపారు. తొలి దశలో ఈ ప్లాంట్ కోసం రూ.120 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా రెండో దశలో మరో రూ.120 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికల్లా ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందని వెల్లడించారు. అలాగే కొత్త టెక్నాలజీల కోసం రూ.20 కోట్లతో ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రావు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ 27 శాతం వృద్ధితో రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్లకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ 7 ప్లాంట్లను నిర్వహిస్తుండగా పోర్ట్‌ఫోలియోలో మొత్తం 95 ఉత్పత్తులు ఉన్నాయని రావు తెలిపారు.

రూ.10,000 కోట్లతో స్టార్టప్ ఇండియా 2.0

న్యూఢిల్లీ: దేశీయ అంకుర సంస్థలకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 10,000 కోట్ల మూలధనంతో 'స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2016లో రూ.10,000 కోట్లతో ప్రారంభించిన మొదటి విడత విజయవంతం కావటంతో తాజాగా 2025-26 బడ్జెట్‌లో రెండో దశ కోసం ప్రభుత్వం ఈ నిధులను కేటాయించింది.

గిఫ్ట్ సిటీ చైర్మన్‌గా ఉదయ్ కోటక్

గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ కంపెనీ లిమిటెడ్ (గిఫ్ట్ సిటీ) కొత్త చైర్మన్‌గా కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ఉదయ్ కోటక్ నియమితులయ్యారు. గుజరాత్ ప్రభుత్వం శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించింది. ప్రస్తుత చైర్మన్ హస్ముఖ్ అధియా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు.

డీఎన్‌డీ యాప్‌లో అప్పీల్ ఫీచర్

న్యూఢిల్లీ: డు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) యాప్‌లో అప్పీల్ ఫీచర్‌ను జోడించనున్నట్లు టెలికాం నియంత్రణ మండలి 'ట్రాయ్' చైర్మన్ అనిల్ కుమార్ లహోఠి తెలిపారు. స్పామ్ కాల్స్ లేదా ఎస్ఎంఎస్‌లపై గతంలో చేసిన ఫిర్యాదుపై లభించిన పరిష్కారంతో సంతృప్తి చెందని వినియోగదారులు అప్పీల్ ఫీచర్ ద్వారా ఆ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుంటుందని ఆయన చెప్పారు. ఇందుకోసం డీఎన్‌డీ యాప్‌ను నవీకరించి ప్రవేశపెట్టనున్నట్లు, అది మల్టీలింగ్వల్ (బహు భాషల్లో) అందుబాటులోకి రానుందన్నారు. అంతేకాదు, ఫోన్ కాల్స్ నాణ్యతపై ఫిర్యాదు చేసేందుకు నవీకరించిన మైకాల్ యాప్‌ను ఈ మార్చిలో ప్రవేశపెట్టనున్నట్లు లహోఠి వెల్లడించారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు	
ఐర్లాండ్ X ఒమన్	(ఉ. 11 గం. నుంచి)
ఇంగ్లండ్ X స్కాట్లాండ్	(మ.3 గం.)
న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా	(రా.7 గం.)

ఇండో-పాక్ పోరుకు వరుణుడి అడ్డు?

వాతావరణ శాఖ అంచనా



తారిఖ్‌ను ఎలా ఎదుర్కోవాలంటే..

అశ్విన్ సూచన

కొలంబో: టీ20 ప్రపంచ కప్ బ్లాక్‌బస్టర్ భారత్-పాకిస్థాన్ పోరుకోసం ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆదివారం జరిగే ఈ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌కు కొలంబోలోని ప్రేమదాస స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఈ పోటీకోసం రెండు దేశాల అభిమానులు కొలంబో చేరుకుంటున్నారు. అయితే ఎల్లుండి జరిగే ఈ సమరాన్ని వరుణుడు అడ్డుకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మ్యాచ్ జరిగే సమయంలో దట్టమైన మేఘాలతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి 50 నుంచి 65 శాతం వరకు అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ చెబుతోంది.

కుల్దీప్‌ను ఆడించాలి: గవాస్కర్



పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో అర్ష్‌దీప్ స్థానంలో మిస్టరీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను బరిలో దించాలని భారత జట్టు యాజమాన్యానికి దిగ్గజ బ్యాటర్ గవాస్కర్ సూచించాడు. 'శ్రీలంక పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలిస్తాయి. ఈ వికెట్లపై గతంలో భారత జట్టు ముగ్గురు స్పిన్నర్లతో ఆడిన చరిత్ర ఉంది. అందువల్ల పాక్‌తో పోరులో కుల్దీప్ జట్టులో ఉండాలి' అని గవాస్కర్ అన్నాడు.

తేలిగ్గా తీసుకోవద్దు: రోహిత్

టీమిండియానే ఫేవరెట్‌గా పరిగణిస్తున్నా.. పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను తక్కువగా అంచనా వేయకూడదని సూర్యకుమార్ సేనకు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హితవు పలికాడు.

పాకిస్థాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ బౌలింగ్‌పై ప్రస్తుతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బౌలింగ్ రనప్ అందుకొని..ఆగి..మళ్లీ బంతులు విసురుతున్న తీరును ఆక్షేపించే వారూ లేకపోలేదు. ఈనేపథ్యంలో ఉస్మాన్‌ను ఎలా ఎదుర్కోవాలనే విషయమై భారత బ్యాటర్లకు టీమిండియా మాజీ స్పిన్నర్ అశ్విన్ సూచన చేశాడు. 'బంతిని విడుదలజేసే ముందు ఉస్మాన్ ఆగగానే..బ్యాట్స్‌మన్ పక్కకు తప్పుకోవాలి. అతడు బౌలింగ్ చేయబోయి ఆగాడని అందుకే తాను బంతి ఎదుర్కోకుండా పక్కకు తొలగానని ఆ బ్యాటర్ అంపైర్‌కు చెప్పాలి. దాంతో అంపైర్ ఒత్తిడికి గురవుతాడు' అని అశ్విన్ చెప్పాడు.

అతడి బౌలింగ్ నిబంధనల మేరకే..

తారిఖ్ ఆగి బౌలింగ్ చేస్తుండడంతో అతడు చకింగ్ చేస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. కానీ ఉస్మాన్ బౌలింగ్ నిబంధనల మేరకు ఉందని ఐసీసీ స్పష్టంజేసింది. బౌలర్ బంతిని విడుదల చేసినప్పుడు అతడి మోచేయిని 15 డిగ్రీల కంటే ఎక్కువ వంచితే అది చట్టవిరుద్ధమైన బౌలింగ్‌గా ఐసీసీ నిబంధన చెబుతోంది. కానీ బౌలింగ్ సమయంలో ఉస్మాన్ మోచేయి నిర్దేశిత డిగ్రీల మేరకే ఉందని పేర్కొంది.

కంగారూలకు షాక్

టీ20 వరల్డ్‌కప్



ఇవాన్స్ (3/23)



23 రన్స్‌తో జింబాబ్వే సంచలన విజయం

చెలరేగిన ముజరబానీ, ఇవాన్స్

కొలంబో: ఈ టీ20 వరల్డ్‌కప్‌లో చిన్న జట్లు అంచనాలకు మించిన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నా.. ఇప్పటిదాకా విజయం రుచి చూడలేకపోయాయి. కానీ టోర్నీలో శుక్రవారం అతి పెద్ద సంచలనం నమోదైంది. మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాపై అన్ని విభాగాల్లో ఆధిపత్యం చూపిన జింబాబ్వే జట్టు 23 రన్స్‌తో గెలిచింది. పేసర్లు ముజరబానీ (4/17), ఇవాన్స్ (3/23) చెలరేగి గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ఒమన్‌పై గెలిచిన జింబాబ్వే గ్రూప్ 'బి'లో నాలుగు పాయింట్లతో రెండోస్థానం దక్కించుకుంది. అలాగే టీ20 వరల్డ్‌కప్‌ల్లో ఆసీస్‌తో తలపడిన రెండుసార్లూ జింబాబ్వేనే నెగ్గడం విశేషం. మొదట 2007 టోర్నీలో ఆఖరి ఓవర్‌లో అద్భుత విజయాన్నందుకుంది. ఓవరాల్‌గా పరిమిత ఓవర్లలో ఆసీస్‌పై గెలవడం ఈ జట్టుకిది ఐదోసారి. గతంలో మూడుసార్లు వన్డేల్లో నెగ్గింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 2 వికెట్లకు 169 పరుగులు చేసింది. గాయాల కారణంగా ప్రధాన బౌలర్లు లేకుండానే బరిలోకి దిగిన ఆసీస్ మూల్యం చెల్లించుకుంది. ఓపెనర్లు బ్రయాన్ బెనెట్ (64 నాటౌట్), మరుమని (35), రియాన్ బర్ల్ (35), సికిందర్ రజా (25 నాటౌట్) ఎలాంటి తడబాటు లేకుండా ఆడారు. అలాగే బెనెట్ తొలి వికెట్‌కు 61, రెండో వికెట్‌కు 70, మూడో వికెట్‌కు 38 పరుగులు జోడించాడు. గ్రీన్, స్టొయినిస్ చెరో వికెట్ తీశారు. ముజరబానీ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మరోవైపు ఒమన్‌తో మ్యాచ్ సందర్భంగా గాయపడిన జింబాబ్వే వెటరన్ కీపర్ బ్రెండన్ టేలర్ టోర్నీకి దూరమయ్యాడు.



ముజరబానీ (4/17)

టాపార్డర్ బేజారు: ఓ మాదిరి ఛేదనలో ఆసీస్ 19.3 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఏకంగా ఐదుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమవగా, ముగ్గురు డకౌటయ్యారు. వాస్తవానికి ఆసీస్ ఈ లక్ష్యాన్ని సులువుగా ఛేదిస్తుందనుకున్నా, పేసర్లు ముజరబానీ, ఇవాన్స్ బెదరగొట్టారు. వీరి దెబ్బకు 29 పరుగులకే టాప్-4 బ్యాటర్లు పెవిలియన్ చేరారు. ఈ దశలో రెన్‌షా (65), మ్యాక్స్‌వెల్ (31) నిలవడంతో ఆసీస్ గెలుస్తుందనిపించింది. కానీ ఐదో వికెట్‌కు 77 రన్స్ జత చేశాక మ్యాక్సీని స్పిన్నర్ బర్ల్ బౌల్డ్ చేశాడు. అక్కడి నుంచి తడబాటుకు లోనైన ఆసీస్ మరో 40 రన్స్ జోడించి మిగిలిన 5 వికెట్లను కోల్పోయి మ్యాచ్‌ను చేజార్చుకుంది.


సంక్షిప్త స్కోర్లు జింబాబ్వే: 20 ఓవర్లలో 169/2 (బెనెట్ 64 నాటౌట్, మరుమని 35, బర్ల్ 35, రజా 25 నాటౌట్; గ్రీన్ 1/6, స్టొయినిస్ 1/17);
ఆస్ట్రేలియా: 19.3 ఓవర్లలో 146 ఆలౌట్ (రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31, హెడ్ 17; ముజరబానీ 4/17, ఇవాన్స్ 3/23).

ప్రపంచ కప్ నుంచి ఐర్లాండ్ కెప్టెన్ స్టిర్లింగ్ అవుట్

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్ జట్టుకు అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో అనుభవజ్ఞుడైన ఆ జట్టు కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ గాయం కారణంగా టోర్నీ నుంచి నిష్క్రమించాడు. బుధవారం ఆస్ట్రేలియాతో మ్యాచ్ సందర్భంగా డైవ్ చేసి క్యాచ్ అందుకునే క్రమంలో స్టిర్లింగ్ కుడి మోకాలికి గాయమైంది. దీంతో అతను టోర్నీకి దూరమయ్యాడని ఐర్లాండ్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. స్టిర్లింగ్ స్థానంలో యువ వికెట్ కీపర్ సామ్ టాపింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. వైస్ కెప్టెన్ లోర్కాన్ టక్కర్ టోర్నీలో ఐర్లాండ్ జట్టు సారథిగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.

యూఏఈ ఉత్కంఠ గెలుపు

- కెనడాకు రెండో ఓటమి
- జునైద్‌కు ఐదు వికెట్లు



జునైద్ (5/35)

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో యూఏఈ బోణీ చేసింది. ఓపెనర్ ఆర్యాన్ష్ శర్మ (53 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధసెంచరీకి తోడు చివర్లో సొహైబ్ ఖాన్ (29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 51) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో కెనడాతో శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగిన ఈ మ్యాచ్‌లో యూఏఈ 5 వికెట్ల తేడాతో గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా 20 ఓవర్లలో 150/7 స్కోరు సాధించింది. హర్ష్ (50), నవ్‌నీత్ (34) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ పేసర్ జునైద్ సిద్ధిఖీకి ఐదు వికెట్లు దక్కాయి. ఛేదనలో యూఏఈ 19.4 ఓవర్లలో 151/5 స్కోరుతో నెగ్గింది. ఓ దశలో 66 రన్స్‌కు నాలుగు వికెట్లు కోల్పోగా జట్టు ఓటమి దిశగా సాగింది. ఇక 24 బంతుల్లో 56 పరుగులు చేయాల్సి ఉండగా.. సొహైబ్ బ్యాట్ ఝుళిపిస్తూ 4 ఫోర్లు, 4 సిక్సర్లతో చెలరేగాడు. అటు ఆర్యాన్ష్ అండగా నిలవగా సమీకరణం 6 బంతుల్లో 8 రన్స్‌కు తగ్గింది. విజయానికి పరుగు దూరంలో సొహైబ్ వెనుదిరగ్గా, అప్పటికే ఐదో వికెట్‌కు ఈ ఇద్దరు 84 పరుగులు జత చేశారు. స్పిన్నర్ సాద్ బిన్‌కు మూడు వికెట్లు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు: కెనడా: 20 ఓవర్లలో 150/7 (హర్ష్ 50, నవ్‌నీత్ 34; జునైద్ 5/35); **యూఏఈ:** 19.4 ఓవర్లలో 151/5 (ఆర్యాన్ష్ 74 నాటౌట్, సొహైబ్ 51; సాద్ బిన్ 3/14).

రియాన్‌కు 'రాజస్థాన్' పగ్గాలు



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు రియాన్ పరాగ్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. సంజూ శాంసన్ ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు వెళ్లడంతో అతని స్థానంలో రియాన్‌కు పగ్గాలు అప్పగించారు. 2019నుంచి రాజస్థాన్ తరపున ఆడుతున్న రియాన్.. గతేడాది సంజూ శాంసన్ గాయపడడంతో ఎనిమిది మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

33 పతకాలతో ఘనంగా ముగించారు

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ మొత్తం 33 (13-11-9) పతకాలతో ఘనంగా ముగించింది. శుక్రవారం, చివరి రోజు మన షూటర్లు ఏడు పతకాలు సొంతం చేసుకున్నారు. అమన్‌ప్రీత్ సింగ్ 25 మీ. సెంటర్ ఫైర్ పిస్టల్‌లో స్వర్ణం అందుకున్నాడు. ఈ విభాగంలో గురుప్రీత్ సింగ్, అంకుర్ గోయల్ రజత, కాంస్యాలు సాధించడంతో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. అమన్, గురుప్రీత్, అంకుర్ త్రయం 25 మీ. సెంటర్ ఫైర్ పిస్టల్ టీమ్ విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకుంది.

అమెరికా.. బోణీ అదిరె

93 పరుగులతో నెదర్లాండ్స్ చిత్తు



సాయితేజ (79)

చెన్నై: టోర్నీలో కొనసాగాలంటే విజయం సాధించాల్సిన మ్యాచ్‌లో అమెరికా అదరగొట్టింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన యూఎస్ఏ శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తనకంటే మెరుగైన ప్రత్యర్థి నెదర్లాండ్స్‌ను 93 పరుగులతో చిత్తు చేసింది. తద్వారా మెగా టోర్నీలో తన అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తొలుత అమెరికా 20 ఓవర్లలో 196/6 స్కోరు చేసింది. తెలుగు క్రికెటర్ సాయితేజ ముక్కమల్ల (51 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 79) మెరుపు హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శుభమ్ రంజనే (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 48 నాటౌట్) దుమ్ము రేపాడు. బాస్ డి లీడ్ మూడు వికెట్లు పడగొట్టాడు. భారీ ఛేదనలో భారత అండర్-19 మాజీ స్టార్, స్పిన్నర్ హర్మీత్ సింగ్ (4/21) ధాటికి నెదర్లాండ్స్ 15.5 ఓవర్లలో 103 పరుగులకు కుప్పకూలింది. బాస్ డి లీడ్ (23), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (20) మాత్రమే రాణించారు. షాడ్లీ వాన్ మూడు, మహ్మద్ మొహిసిన్ రెండు వికెట్లు తీశారు. హర్మీత్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు

అమెరికా: 20 ఓవర్లలో 196/6 (సాయితేజ 79, శుభమ్ రంజనే 48 నాటౌట్, మోనక్ పటేల్ 36, బాస్ డి లీడ్ 3/37).
నెదర్లాండ్స్: 15.5 ఓవర్లలో 103 ఆలౌట్ (డి లీడ్ 23, ఎడ్వర్డ్స్ 20, మ్యాక్స్ ఓ డౌడ్ 13, హర్మీత్ సింగ్ 4/21, షాడ్లీ వాన్ 3/21, మహ్మద్ మొహిసిన్ 2/19).

వింటర్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో కండోమ్‌ల కొరత

మిలన్: వింటర్ ఒలింపిక్స్ జరుగుతున్న క్రీడాగ్రామంలో కండోమ్‌ల కొరత ఏర్పడింది. ఈ క్రీడల్లో పాల్గొంటున్న 2900 మంది అథ్లెట్ల కోసం క్రీడాగ్రామంలో ఇప్పటికే పదివేలకు పైగా కండోమ్ ప్యాకెట్లను ఏర్పాటు చేయగా అవన్నీ మూడ్రోజుల్లోనే అయిపోయాయట. ఒలింపిక్స్‌లాంటి మెగా ఈవెంట్ల సందర్భంగా చాలారోజుల పాటు అథ్లెట్లు కలిసే ఉంటారు గనక, సురక్షిత శృంగారం కోసం నిర్వాహకులు కండోమ్ ప్యాకెట్లను ఏర్పాటు చేస్తుంటారు.

'చిన్నస్వామి'లో కుంబ్లే, ద్రవిడ్ స్టాండ్లు

బెంగళూరు: టీమిండియా దిగ్గజ క్రికెటర్లు అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్‌లకు అరుదైన గౌరవం దక్కింది. ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో రెండు స్టాండ్లకు వారి పేర్లను పెట్టాలని కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) నిర్ణయించింది. అలాగే స్టేడియంలో మరో స్టాండ్‌కు భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి పేరును పెడుతున్నట్టు కేఎస్‌సీఏ తెలిపింది.

మతం మారినా పుట్టుకతో వచ్చే కులం మారదు

▸▸ అలహాబాద్ హైకోర్టు తీర్పు

లఖ్‌నవూ/కోల్‌కతా, ఫిబ్రవరి 13: ఎవరైనా వేరే మతంలోకి మారినప్పటికీ పుట్టుకతో వచ్చే కులం మారబోదని.. పెళ్లయ్యాక కూడా అది అలాగే ఉంటుందని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ఓ మహిళపై దాడి కేసుకు సంబంధించి ఎస్సీ/ఎస్టీ చట్టం కింద తమపై చేపట్టిన విచారణను సవాల్ చేస్తూ 9 మంది దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళ ఉత్తరప్రదేశ్‌లో నివసిస్తున్నారు. ఎస్సీ/ఎస్టీ వర్గానికి చెందిన ఆమె.. జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నారు. అయితే ఓ గొడవ సమయంలో తనను కొంతమంది సామాజిక వర్గం పేరుతో దూషించారని, తనతో పాటు మరో ఇద్దరిపై దాడికి దిగినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై ఎస్సీ/ఎస్టీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ నిందితులు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ మహిళ పుట్టుకతో ఎస్సీ/ఎస్టీ వర్గమైనప్పటికీ.. జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నందున ఆమె సామాజిక వర్గం మారుతుందని వాదించారు. కోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. మతం మారినా.. వేరే సామాజిక వర్గం వ్యక్తితో వివాహమైనా.. పుట్టుకతో వచ్చే కులం మారదని పిటిషన్‌ను కొట్టేసింది.

అసంపూర్తి ఎక్స్‌ప్రెస్‌వేలపై 25% అదనపు టోల్ బాదుడు లేదు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: అసంపూర్తి ఎక్స్‌ప్రెస్ వేలపై నిర్మాణం పూర్తయిన మేరకు రోడ్డును వినియోగించుకునే వాహనదారులకు టోల్ ఫీజు 25% తక్కువగా వసూలు చేయనున్నట్టు కేంద్ర రోడ్డు రవాణా-హైవేల మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ మేరకు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఆదివారం నుంచే ఈ నిర్ణయాన్ని అమలు చేయనున్నట్టు వెల్లడించింది. సాధారణ జాతీయ రహదారుల కంటే వాటికి సమాంతరంగా నిర్మించిన జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై టోల్ ఫీజు 25 శాతం అదనం. ఎందుకంటే, ఎక్స్‌ప్రెస్ వేలపై ట్రాఫిక్ జామ్‌లు లేకుండా ప్రయాణం వేగవంతంగానూ, చాలా సులభంగానూ, సౌకర్యవంతంగానూ ఉంటుంది. అయితే, నిర్మాణం పూర్తికానప్పటికీ, వినియోగంలోకి తెచ్చిన మేరకే రోడ్డును వినియోగించుకునే వాహనదారుల నుంచి ఎక్స్‌ప్రెస్ వే టోల్ ఫీజునే వసూలు చేస్తున్నారు. దీనిపై వాహనదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.

మూడు నెలల ఆర్థిక సాయం ఒకేసారి.. పైగా వేసవి ఖర్చుల కోసం రూ.2వేలు

▸▸ తమిళనాడు మహిళలకు డీఎంకే సర్కారు బంపర్ ఆఫర్

చెన్నై, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. డీఎంకే ప్రభుత్వం మహిళలకు బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన 1.31 కోట్ల మంది మహిళలకు నెల నెలా ఇచ్చే రూ.1000ని మూడు మాసాలకుగాను ఒకేసారి అందజేసింది. అంతేగాక వేసవి సీజన్‌లో ఖర్చుల కోసం మరో రూ.2 వేలు కలిపి మొత్తం రూ.5 వేలను శుక్రవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అంతేగాక మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు నెలనెలా రూ.2 వేలు ఇస్తామని కూడా సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఎన్నికలను సాకుగా చూపి, వచ్చే మూడు నెలలకు రావాల్సిన నగదును నిలిపివేసేందుకు తమ ప్రత్యర్థులు కుట్ర పన్నినట్లు తెలిసిందని, అందుకే రూ.5 వేలను మహిళల ఖాతాల్లో జమ చేశామని వివరించారు.

12వ తరగతి మార్కుల వెరిఫికేషన్ రద్దు!

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ బోర్డు పరీక్షల మూల్యాంకన విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2026 విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఫలితాల తర్వాత మార్కుల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయనున్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. 'ఆన్- స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎమ్) విధానం ద్వారా పూర్తిస్థాయి డిజిటల్ మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టామని, దీంట్లో తప్పులకు ఆస్కారం ఉండదని తెలిపారు.

'సేవాతీర్థ్'లోకి పీఎంవో

ప్రధాని కార్యాలయానికి కొత్త చిరునామా

▸▸ 'న్యూఢిల్లీ' ఏర్పడిన రోజే నాంది

▸▸ కొత్త భవనాలను ప్రారంభించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 : దేశ రాజధాని చరిత్రలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు 95 ఏళ్ల పాటు ఒకే భవనంలో కొనసాగిన ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) తొలిసారి కొత్త చిరునామా పొందింది. కొత్త భవనం 'సేవాతీర్థ్'లోకి శుక్రవారం లాంఛనంగా మారింది. ఆధునిక రాజధాని నగరంగా న్యూఢిల్లీ ఏర్పడిన రోజే ఈ అపూర్వ ఘటన చోటుచేసుకోవడం విశేషం. లఖ్‌పతి దీదీలు, రైతులు, స్టార్టప్‌లకు సంబంధించిన ఫైళ్లపై సంతకం చేయడం ద్వారా ప్రధాని మోదీ శుక్రవారం కొత్త కార్యాలయం నుంచి పాలనను ప్రారంభించారు. ఇప్పటివరకు ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచి పీఎంవో విధులు నిర్వహించింది. 95 ఏళ్ల క్రితం, 1931 ఫిబ్రవరి 13వ తేదీన న్యూఢిల్లీ నగరం అధికారికంగా అందుబాటులోకి వచ్చింది. పాలనా అవసరాల కోసం అప్పుడు నిర్మించిన సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్‌లోనే పీఎంవో, ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు పని చేయడం మొదలుపెట్టాయి. 1947లో దేశ స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆ తర్వాత మూడేళ్లకు, 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. అరుదైన ఈ ఘట్టాలకు మౌన చారిత్రక సాక్షిగా నిలిచిన రైసినా హిల్స్ కాంప్లెక్స్ పక్కనే 'సేవాతీర్థ్'ను నెలకొల్పారు. పీఎంవో, జాతీయ భద్రతా మండలి సచివాలయం, క్యాబినెట్ సచివాలయం ఇప్పటివరకు వేర్వేరుగా కొనసాగాయి. వాటిని ఇప్పుడు ఒకే గొడుగు కిందకు తెచ్చారు. సెంట్రల్ విస్టా పథకంలో భాగంగా ఈ మూడు విభాగాలూ ఇకపై ఒకే భవన సముదాయంలో పని చేయనున్నాయి. కొత్త భవన ప్రారంభోత్సవానికి గుర్తుగా రూ.వంద నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు. "'ఇండియా ఫస్ట్' లక్ష్యంగా మరింత గౌరవ, వినమ్రతలతో దేశ ప్రజలకు కొత్త కార్యాలయం నుంచి సేవలు అందిస్తాం. కర్తవ్య నిర్వహణ, సేనా తత్పరత, సంకల్పాలకు ఉజ్వల ప్రతీకగా 'సేవాతీర్థ్'గా ఉంటుంది" అన్నారు.

'పీఎం రాహత్'పై ప్రధాని తొలి సంతకం


ప్రధాని తన నూతన కార్యాలయంలో 'పీఎం రాహత్' పథకాన్ని ఆమోదిస్తూ తొలి సంతకం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత చికిత్స ఈ పథకంతో అందుబాటులోకి రానుంది.ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ప్రమాదం జరిగిన నాటి నుంచి 7రోజుల్లోగా ఈ సేవలను పొందవచ్చు.


కొత్త పీఎంవోలో పూజ చేస్తున్న మోదీ

మరికొన్ని కొత్త కార్యాలయాలూ...

పలు కీలక మంత్రిత్వ శాఖల కోసం కొత్తగా నిర్మించిన కర్తవ్య భవన్-1,2 కార్యాలయాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. రైసినా హిల్స్ కాంప్లెక్స్‌కు సమీపంలోనే వీటినీ ఏర్పాటుచేశారు. న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయం తదితర శాఖలు ఇకపై ఇక్కడినుంచి పని చేయనున్నాయి. కీలక మంత్రిత్వ శాఖలు ఇప్పటివరకు సౌత్, నార్త్ బ్లాకుల్లో విధులు నిర్వహించాయి. నార్త్ బ్లాక్‌లో హోంశాఖ, ఆర్థిక శాఖ కార్యాలయాలు ఉంటే; సౌత్ బ్లాక్‌లో పీఎంవోతో పాటు రక్షణ శాఖ కార్యాలయాలు ఉండేవి. కాగా, 'సేవాతీర్థ్'లో పాలనను ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేయడం ద్వారా ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. నారీ శక్తిలో భాగంగా.. లఖ్‌పతి దీదీల సంఖ్యను రెట్టింపు చేస్తూ, ఆరు కోట్ల మందిని లక్షాధికారులను చేసే ఫైల్‌పై ప్రధాని సంతకం చేశారు. అలాగే, వ్యవసాయ మౌలిక వసతుల నిధి పరిధిని రూ.లక్ష కోట్ల నుంచి రూ.2లక్షల కోట్లకు విస్తరించారు. కాగా, పీఎంవో సహా కీలక శాఖల కార్యాలయాల తరలింపుతో ఖాళీ అయిన సౌత్, నార్త్ బ్లాక్ భవనాలను జాతీయ మ్యూజియం కోసం కేటాయించనున్నారు.

లోకం తీరు



కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ రాజీనామాకు విపక్షాల పట్టు

▸▸ ముగిసిన బడ్జెట్ తొలి విడత సమావేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీ పేరు ఉన్న నేపథ్యంలో ఆయన తక్షణమే రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు శుక్రవారం కూడా పార్లమెంటులో హంగామా సృష్టించాయి. భారత-అమెరికా వాణిజ్య ఒప్పందం తదితర అంశాలపైనా నిరసన వ్యక్తంచేశాయి. దరిమిలా పార్లమెంటు ఉభయ సభలూ వాయిదా పడ్డాయి. దీంతో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. జనవరి 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలనుద్దేశించి చేసిన ప్రసంగంతో ప్రారంభమైన మొదటి విడత సమావేశాలు.. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగం, కేంద్ర బడ్జెట్‌పై పూర్తి స్థాయి చర్చ జరుగకుండానే అత్యంత గందరగోళ పరిస్థితుల్లో ముగియడం గమనార్హం. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ నెల 2న లోక్‌సభలో మాట్లాడుతూ.. 2020 నాటి లద్దాఖ్ సంక్షోభంపై ఆర్మీ మాజీ చీఫ్ నరవణె రాసిన అప్రచురిత పుస్తకంలోని అంశాలను చదివేందుకు ప్రయత్నించగా.. అధికార పక్షం అడ్డుకుంది. సభ కార్యకలాపాలు స్తంభించాయి. లోక్‌సభలో గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని ప్రసంగించకుండానే రాష్ట్రపతికి ధన్యవాద తీర్మానాన్ని మూజువాణి ఓటుతో ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మాత్రం ప్రధాని ప్రసంగించారు. ఆ తర్వాత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం.. ప్రధానితో ఫోన్లో చర్చించిన దరిమిలా.. ఈ ఒప్పందం దేశ రైతులకు వ్యతిరేకమని.. మోదీ భారత మాతను అమ్మేశారని రాహుల్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. దీనిపై ఆయన దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. మలివిడత బడ్జెట్ సమావేశాలు మార్చి 9న ప్రారంభం అవుతాయి.

వెనెజువెలా చమురు కోసం రిలయన్స్‌కు అమెరికా లైసెన్సు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: వెనెజువెలా నుంచి చమురును దిగుమతి చేసుకోవడానికి రిలయన్స్ సంస్థకు అమెరికా లైసెన్సు మంజూరు చేసింది. దీనితో వెనెజువెలా నుంచి నేరుగా ఎలాంటి ఆంక్షలూ లేకుండా రిలయన్స్ చమురును దిగుమతి చేసుకుని.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా అమ్ముకునేందుకు అవకాశం లభించింది. రష్యా చమురు కొనుగోళ్ల నిలిపివేతకు బదులుగా వెనెజువెలా నుంచి రాయితీ ధరకు చమురు అందించే దిశగా భారత్‌కు అమెరికా ఈ వెసులుబాటు కల్పించిందని ఆ దేశ అధికారవర్గాలు చెబుతున్నాయి. రిలయన్స్ ఇప్పటికే వెనెజువెలా సంస్థ విటోల్ నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా కోసం ఆర్డర్ చేసినట్టు వాణిజ్య శాఖ వర్గాలు తెలిపాయి. మన దేశ ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్ల కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్టు వెల్లడించాయి. వాస్తవానికి 2020కి ముందు వెనెజువెలా నుంచి రిలయన్స్‌తోపాటు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ తదితర ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గణనీయంగా చమురు కొనుగోలు చేసేవి. అమెరికా ఆంక్షల కారణంగా వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు నిలిచిపోయాయి. యుద్ధ సమయంలో రష్యా తన చమురుపై రాయితీ ఇవ్వడంతో భారత సంస్థలు ఆ దేశం నుంచి భారీగా చమురు కొనుగోళ్లు చేపట్టాయి. తాజాగా అమెరికా ఒత్తిడి, ఆంక్షల కారణంగా రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు తగ్గాయి. ఇటీవల వెనెజువెలా అధ్యక్షుడిని అదుపులోకి తీసుకున్న అమెరికా ఆ దేశ చమురుపై పట్టు సాధించి, ఆంక్షలను సడలించింది.

బంగ్లాదేశ్‌లో బీఎన్‌పీ భారీ విజయం

▸▸ 299 స్థానాలకు 212 సీట్లు కైవసం.. ప్రధాని పదవి చేపట్టనున్న తారిక్ రహ్మాన్

ఢాకా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో 'బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ)' ఘన విజయం సాధించింది. 13వ పార్లమెంటు ఎన్నికల్లో మూడింట రెండొంతుల మెజారిటీతో గెలుపొందింది. మొత్తం 299 స్థానాలకు గాను మిత్రపక్షాలతో కలిపి 212 సీట్లు గెలుచుకున్నట్లు బీఎన్‌పీ శుక్రవారం ప్రకటించింది. బంగ్లా మాజీ అధ్యక్షుడు జియావుర్ రహ్మాన్, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడైన తమ అధినేత తారిక్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది. జమాతే ఇస్లామీ పార్టీ 70 సీట్లు గెలుచుకుంది. తారిక్ రహ్మాన్ ఢాకా-17, బోగ్రా-6 స్థానాల నుంచి బరిలోకి దిగి, రెండు చోట్లా గెలిచారు. బీఎన్‌పీ సీనియర్ మైనారిటీ హిందూ నేత గయేశ్వర్ చంద్ర రాయ్ ఘన విజయం సాధించారు. బంగ్లాదేశ్‌లో హిందువులను హత్య చేయడం, వరసగా దాడులు జరుగుతున్న తరుణంలో ఆయన గెలుపు ప్రాధాన్యం సంతరించుకుంది. పశ్చిమబెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో జమాతేఅభ్యర్థులు గెలుపొందారు. ఇది భారత్‌కు ఆందోళనకర అంశమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి వేరు చేస్తామంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేషనల్ సిటిజెన్ పార్టీ నేత హస్నత్ అబ్దుల్లా గెలుపొందారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న తారిక్ రహ్మాన్(60)పై 2002-06 మధ్య ఖలీదా అధికారంలో ఉన్న సమయంలో అవినీతి కేసులు నమోదయ్యాయి. హసీనా అధికారంలోకి వచ్చాక ఓ కేసులో అరెస్టయ్యారు. తర్వాత చికిత్స నిమిత్తం 2008లో లండన్ వెళ్లిపోయారు. గత డిసెంబరులో తల్లి ఖలీదా అనారోగ్యానికి గురవడంతో 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. తల్లి మరణానంతరం పార్టీ పగ్గాలు అందుకున్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తారిక్ రహ్మాన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం తారిక్‌కు ఫోన్ చేసి, మాట్లాడారు. మోదీకి బీఎన్‌పీ ధన్యవాదాలు తెలియజేసింది. అయితే, హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని డిమాండ్ చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వినోదం పంచే లీలావతి



"'సతీ లీలావతి' సినిమా చిత్రీకరణ ప్రారంభించినప్పుడు నేను గర్భవతిని. మా దర్శక నిర్మాతల సహకారంతో ఎలాంటి ఇబ్బందిలేకుండా మూడు నెలల్లో చిత్రీకరణ పూర్తి చేశా. ఇది పక్కా వినోదాత్మక చిత్రం. ప్రేక్షకులందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని లావణ్య కొణిదెల అన్నారు. ఆమె ప్రధాన పాత్రధారిగా తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. నాగమోహన్ నిర్మించారు. మార్చి 6న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ 'గతంలో కమల్‌హాసన్ గారు చేసిన 'సతీ లీలావతి' చిత్రంతో మా సినిమాను పోల్చొద్దు. ఇది నేటి కాలానికి తగ్గట్లుగా, ప్రతి ఒక్కరికీ కనెక్టయ్యేలా రూపొందించాం. ప్రేక్షకులు మా సినిమా చూస్తూ హాయిగా నవ్వుకోవచ్చు' అని చెప్పారు. 'నిర్మాతగా నాకు ఇది మొదటి సినిమా, ఈ ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని నాగమోహన్ తెలిపారు.

'వారణాసి' చిత్రం నిడివి ఎంత?



మహేశ్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'వారణాసి' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రియాంక కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికి యాభై శాతం పూర్తయిందనీ, జూన్‌కు షూటింగ్ మొత్తం పూర్తవుతుందని రాజమౌళి వెల్లడించారు. రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ సినిమాలో చాలా కీలకం అనీ, ఒక ఛాలెంజ్‌గా తీసుకుని ఆ సన్నివేశాలను చిత్రీకరించినట్లు ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'వారణాసి' సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ కాదనీ, ఫాంటసీ, మైథలాజికల్ సినిమా అని రాజమౌళి ఆ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. 'కొత్త చిత్రం తీస్తున్నప్పుడు గత సినిమాలను దృష్టిలో పెట్టుకోను. వాటి గురించి ఆలోచించను. రుద్ర పాత్రలో మహేశ్ ఎంట్రీ సినిమాలో అద్భుతంగా ఉంటుంది. నాకు విలన్ పాత్రలు అంటే ఇష్టం. 'వారణాసి'లో పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర కూడా చాలా బాగుంటుంది. చేతులు, కాళ్లు కదలించలేని అతను కనుసైగలతోనే శాసిస్తుంటాడు. విజువల్స్ పరంగానే కాకుండా ఎమోషన్స్ పరంగా కూడా ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతినివ్వడానికి ఎప్పుడూ కృషి చేస్తుంటా. 'వారణాసి'లో వీఎఫ్ఎక్స్' వర్క్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆ సన్నివేశాలు నిజంగా నాకు ఛాలెంజే. ఎక్కువ టైమ్ తీసుకుని వర్క్ చేస్తున్నాం. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల చేస్తాం. సినిమా నిడివి రెండు గంటల నలభై నిముషాలు కానీ, మూడు గంటలు కానీ ఉంటుంది. మూడు గంటలకు మించి ఉండదు' అని తెలిపారు రాజమౌళి. మహేశ్ ఈ సినిమాలో శ్రీరాముడిగా కనిపించి అభిమానులను అలరించనున్నారు.ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ, కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



శివరామ్, అన్వీరాదేవి

రామ్‌చరణ్-ఉపాసన దంపతుల పిల్లలకు నామకరణం

రామ్‌చరణ్-ఉపాసన దంపతులు ఈ ఏడాది జనవరి 31న కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఈనెల 11న చిన్నారులకు బారసాల కార్యక్రమం జరిపి, నామకరణం చేశారు. కుమారుడికి శివరామ్ అని, కూతురికి అన్వీరాదేవి అని పేర్లు పెట్టడానికి గల కారణాలను రామ్‌చరణ్ మీడియాతో పంచుకున్నారు. 'మా అబ్బాయి పేరు శివరామ్. శివుడు, రాముడు కలసి వచ్చేలా పెట్టాం. అలాగే మా నాన్న గారి పేరు(శివ శంకర వరప్రసాద్) కూడా కలిసేలా శివరామ్ అని పెట్టాం. మా కుమార్తె పేరు అన్వీరాదేవి. 'అన్' అంటే అపరిమితమైన, వీర అంటే ధైర్యం, దేవి అంటే దైవిక శక్తి. అపరిమితమైన ధైర్యాన్ని, దైవిక శక్తిని సూచించేలా ఈ పేరు పెట్టాం' అని రామ్‌చరణ్ చెప్పారు.



ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆయన కుమారుడు శిరీష్, నయనిక రెడ్డి వివాహం మార్చి 6న జరగనుంది. ఈ క్రమంలో శుక్రవారం పసుపు దంచే కార్యక్రమంతో పెళ్లి పనులకు శ్రీకారం చుట్టారు. మెగా ఫ్యామిలీ సభ్యులంతా ఈ వేడుకలో పాల్గొన్నారు.

సంతోష్ శోభన్‌కు సూపర్‌హిట్ దక్కాలి



శ్రీ విష్ణు

'సంతోష్ శోభన్ నటన నాకు 'గోల్కొండ హైస్కూల్' చిత్రం నుంచే ఇష్టం. ఆయన నటన సహజంగా ఉంటుంది. 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంతో ఆయనకు సూపర్‌హిట్ దక్కాలి' అని హీరో శ్రీ విష్ణు ఆకాంక్షించారు. సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంతోష్ శోభన్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో వినోదంతో పాటు మంచి సందేశం ఉంది' అన్నారు. అశ్విన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 'నేటి సమాజంలో జరుగుతున్న పరిస్థితులకు అద్దం పట్టేలా ఈ చిత్రాన్ని రూపొందించాం' అని చెప్పారు.





అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బుచ్చయ్య తాత కళ్ల జోడు, వాచ్, రింగు, ఫోను... చివరికి పెన్ను కూడా గోల్డ్ అంటూ మంత్రి లోకేశ్ చలోక్తి విసిరారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో ఎదురైన సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని.. 'బుచ్చయ్య తాతా...' అంటూ లోకేశ్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. 'కళ్లజోడు మొదలు అన్నీ గోల్డే. చివరికి మనిషి కూడా గోల్డ్' అంటూ కితాబిచ్చారు. పక్కనే ఉన్న మంత్రి గొట్టిపాటి జోక్యం చేసుకుంటూ... 'రాజకీయాల్లో మాత్రం బుచ్చయ్య గారు ఓల్డ్' అన్నారు. లోకేశ్ స్పందిస్తూ... 'రాజకీయాల్లో ఓల్డ్ అయినా ఆయన వేసుకున్న షర్ట్ మాత్రం యూత్‌ఫుల్ అండ్ స్టైలిష్' అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాన్ని కాపాడటమే కూటమి లక్ష్యం

- సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం
- గవర్నర్ ప్రసంగంలో ఇదే ఉంది: మంత్రి నిమ్మల



అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శాసన మండలిలో మంత్రులు, విపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మంత్రి రామానాయుడు ప్రభుత్వం తరుపున సమాధానం చెప్తుండగా, వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి, గవర్నర్‌తో ప్రభుత్వం అన్నీ అబద్ధాలు చెప్పించిందంటూ.. నినాదాలు చేశారు. మంత్రి నిమ్మల ప్రసంగాన్ని కొనసాగిస్తూ, వైసీపీ పాలనతో వెంటిలేటర్ ఎక్కిన రాష్ట్రాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పెట్టుబడులు, పరిశ్రమలు తేవడంతోపాటు పోలవరం, రాజధాని నిర్మాణం సహా, రాష్ట్రాన్ని గాడిలో పెట్టి, పేదలకు సంక్షేమం, అభివృద్ధిని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని, ఇదే విషయం గవర్నర్ ప్రసంగంలో ఉందని చెప్పారు. వైసీపీ, టీడీపీ సభ్యుల అరుపులు, కేకలతో మండలి హాలు గోలగోలగా మారింది. వైసీపీకి మనస్సాక్షి ఉండాలని టీడీపీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్ అన్నారు. వైసీపీ నేతల తీరును ప్రభుత్వ చీఫ్ విప్ అనురాధ తప్పు పట్టారు. జనసేన సభ్యుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని తాకట్టు పెడితే.. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలపడానికి ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు.

నేరడి, గుండ్రేవుల ప్రాజెక్టుల పూర్తికి చర్యలు: నిమ్మల

నేరడి, గుండ్రేవుల ప్రాజెక్టుల పురోగతిపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి రామానాయుడు స్పందిస్తూ, ఈ రెండు ప్రాజెక్టుల పూర్తి చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వంశధార నది నుంచి 34 టీఎంసీల నీరు వినియోగించేలా నేరడి బ్యారేజీ రూపకల్పన జరగ్గా, దీనిపై ఒడిశాతో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి కేసీ కెనాల్ ద్వారా సాగు, తాగునీరు అందించేలా గుండ్రేవుల రిజర్వాయర్‌ను తుంగభద్ర నదిపై 20 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రూపకల్పన చేసినట్లు చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.2,890కోట్లుతో అనుమతులు ఇవ్వగా, 2024లో అంచనా వ్యయం రూ.4,530కోట్లకు చేరిందన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి కర్ణాటక, తెలంగాణ నుంచి సమ్మతి తీసుకునేలా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు.

ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్: హోంమంత్రి



రాష్ట్రంలో సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోందని హోంమంత్రి అనిత ప్రకటించారు. 1930 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి, సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని జిల్లా కేంద్రాల్లో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పోలీసులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. శాసనమండలిలో సైబర్ నేరాల నియంత్రణపై టీడీపీ సభ్యులు గ్రీష్మ, రాంగోపాల్‌రెడ్డి, బీటీనాయుడు, జనసేన సభ్యుడు నాగేంద్రబాబు అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇచ్చారు. 'డిజిటల్ అరెస్టులు చేయడానికి సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తే.. 1930కు ఫోన్ చేయండి. పోలీసులు అప్రమత్తమై, మీ వద్దకు వస్తారు. సైబర్ నేరాల నివారణ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సోషల్ మీడియాపై కూడా ప్రత్యేక జీవో తెచ్చాం. మంత్రుల బృందంతో కమిటీ వేశాం. సోషల్ మీడియా ప్రభావం నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చిస్తాం' అని చెప్పారు. తొలుత సైబర్ నేరగాళ్ల అరాచకాలు మితిమీరుతున్నాయని చైర్మన్ మోషేన్‌రాజు ఆందోళన వ్యక్తం చేశారు.

వైసీపీది రప్పారప్పా సిద్ధాంతం: గొట్టిపాటి

శాంతిభద్రతలపై చర్చలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పల్నాడులో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే వైసీపీ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. శవ రాజకీయాలు చేయడం తప్ప.. వైసీపీకి రెండో పనే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీది రప్పారప్పా సిద్ధాంతమైనా, మాది కాదన్నారు. బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ గవర్నర్‌గా ప్రభుత్వ లక్ష్యాలను వివరిస్తే.. వైసీపీ సభ్యులు ప్రసంగ పత్రాలను చించి విసరడం దారుణమని మండిపడ్డారు. గవర్నర్‌ను అవమానించడానికే సభకు వచ్చారా? అని వైసీపీ సభ్యులను ప్రశ్నించారు.

ఏప్రిల్ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్: సవిత

చేనేత కార్మికులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి సవిత చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నల మగ్గాలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని ప్రకటించారు. చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్‌పై వైసీపీ సభ్యుడు మురుగుడు హనుమంతరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్తూ, నూలు పోగును వస్త్రంగా మార్చే నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. 'మగ్గం నేసే చేనేతలకు నెలకు 200 యూనిట్లు, మర మగ్గం నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తాం. వైసీపీ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు పెట్టిన బకాయిలు చెల్లిస్తున్నాం. ఏళ్ల తరబడి ఆప్కోలో పెట్టిన పాత స్టాక్ తీసేసి, కొత్త వస్త్రాలు అమ్మకానికి పెడుతున్నాం. రూ.10వేల కోట్ల పెట్టుబడులతో 2లక్షల మందికి ఉపాధి కల్పించేలా టెక్స్‌టైల్స్ పాలసీ తెచ్చాం' అని చెప్పారు. మగ్గం కార్మికులతోపాటు అనుబంధ సేవలు అందించే చేనేతలకు కూడా ప్రభుత్వం సహాయం చేయాలని వైసీపీ సభ్యుడు కోరగా, సొసైటీల్లో వస్త్రాలే ఉండట్లేదని మండలి చైర్మన్ చెప్పారు.

గిరిజన విద్యా సంస్థలకు సకల సౌకర్యాలు: సంధ్యారాణి

గిరిజన హాస్టళ్లలో మౌలిక సదుపాయాలపై సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం, రాంగోపాల్‌రెడ్డి, గ్రీష్మ అడిగిన ప్రశ్నకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ.. హాస్టళ్లలో కొత్త టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి రూ.60కోట్లు విడుదల చేశామని, 2025-26లో జీతాలు, ఆహారం, ఇతర సామాగ్రికి రూ.1,285కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 149 నూతన భవనాలకు రూ.423కోట్లు కేటాయించామన్నారు. హాస్టళ్ల నిర్వాహకులు తప్పు చేసినా, మెనూ పాటించకపోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి.. సమతూకం

(మొదటి పేజీ తరువాయి)

పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూవివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే అందుతున్నాయన్నారు. అడిగిన భూములివ్వకపోతే వాటిని 22ఏలో పెట్టారన్నారు. చట్టాలు చేసిన ముఖ్యమంత్రే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో హెలిప్యాడ్ కోసం ఓ భూమి అడిగారని.. ఇవ్వలేదని దానిని నిషేధ భూముల జాబితాలో చేర్చారని తెలిపారు. తర్వాత ఆ హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.33 లక్షల ప్రజాధనం మంజూరు చేస్తూఏకంగా జీవోనే ఇచ్చారని ఆక్షేపించారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులు తగులపెట్టారని గుర్తుచేశారు. వాళ్లు చేసిన పాపం కడగడానికి ఏడాది పట్టిందన్నారు. ఈ ఏడాదే రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి రాజముద్రతో పాస్ పుస్తకాలు జారీచేస్తామన్నారు. ప్రతి ఒక్కరి భూమికీ భద్రత కల్పించేలా కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పనిచేస్తున్నాయన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్నందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

కరెంటు వాడకుండానే 9 వేల కోట్ల చెల్లింపు..

గత పాలకులు రాష్ట్ర ప్రజలపై రూ.32,166 కోట్ల విద్యుత్తు భారం మోపారు. విద్యుత్ వాడకుండానే సోలార్, విండ్ ప్రాజెక్టుల్లో రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. మొత్తంగా రూ.1,22,422 కోట్ల విద్యుత్ బకాయిలు పెట్టి పోయారు. 78 నుంచి 90 శాతం మేర కరెంటు చార్జీల భారం వేశారు. కరెంటు చార్జీలు పెంచబోమని మేం చెప్పాం. దానికి కట్టుబడి ఉన్నాం. రూ.4,860 కోట్ల ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. వచ్చే మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీలు పెంచం.

రాయచోటికీ హంద్రీ-నీవా నీరు..

వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేస్తాం. పోలవరం-వంశధారను అనుసంధానిస్తాం. ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాది అనకాపల్లి వరకూ నీటిని తీసుకెళ్తాం. ఎన్టీఆర్ రాయలసీమలో హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులు చేపట్టారు. ఇప్పుడు హంద్రీ-నీవా కాలువలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. చెరువులు నింపాం. రాయచోటికి కూడా నీరు తీసుకెళ్తాం. గాలేరు-నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లు తరలిస్తాం. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లో ముంచేశారు. డయాఫ్రం వాల్ ధ్వంసం చేశారు. మేం ఈ పాజెక్టును 2027 జూన్‌లోగా జాతికి అంకితం చేస్తాం. ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు కూడా ప్రత్యక్షంగా చూడాలి.

తెలంగాణకు అభ్యంతరమెందుకు?


సముద్రంలోకి వృధాగా పోతున్న వరద జలాలను నల్లమలసాగర్‌కు తరలిస్తామంటే.. తెలంగాణ అభ్యంతరం చెప్పడం సరికాదు. సంప్రదింపుల ద్వారా నిర్ణయానికి రావొచ్చు. కూర్చుని మాట్లాడుకుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రతిపాదించారు.

శాంతి భద్రతల విషయంలో కఠినం

రాజకీయ ముసుగులో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ప్రతిపక్ష నేత రోడ్డుపైకి వస్తున్నాడంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకొంటోంది. ఎక్కడకు వెళ్లినా దౌర్జన్యాలు, రోడ్డంతా బ్లాక్ చేయడం వంటివి చేస్తున్నారు. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లడానికి ఆరు గంటలా? ప్రజలు నరకం అనుభవించాలా? జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు.

విజన్-2047తో అగ్ర స్థానంలో..

2047-స్వర్ణాంధ్ర విజన్ ద్వారా ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా ప్రణాళికలు తయారుచేశాం. పది సూత్రాలతో ఈ విజన్‌ను సాధించేందుకు లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీని తీర్చిదిద్దుతాం. 2047నాటికి భారత్ నంబర్ వన్ ఎకానమీగా ఉంటుంది. అందులో ఏపీ అగ్రస్థానానికి చేరుతుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ అనేది మా విధానం. ప్రతి ఐదేళ్లకూ తలసరి ఆదాయం రెట్టింపయ్యేలా ప్రణాళికలు చేపడుతున్నాం. రైతుల ఆత్మహత్యలను నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదు. విద్యార్థులు కూడా ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పరీక్షలు ఎదుర్కోవాలి.



> సంపద ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలం.. దానిని పంచగలం.. అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి చేయూతనందించే పీ-4 దేశంలోనే పేదరిక నిర్మూలనకు అత్యుత్తమ మోడల్.
>
> - సీఎం చంద్రబాబు

3 లక్షల కోట్ల రైల్వే ప్రాజెక్టులు..

రాష్ట్రంలో రూ.3 లక్షల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు చేపట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఇచ్ఛాపురం నుంచి దిగువ వరకూ నాలుగు వరుసల రైల్వే ట్రాక్ వచ్చే అవకాశముంది. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే పాలసీ తెస్తాం. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాదిలోనే టీచర్లకు పోస్టింగ్‌లు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తిచేసి స్టయిపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచాం. అమరావతిలో క్వాంటమ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటమ్ కోర్సుకు 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర మోడల్ అవుతాయి. సోలార్ ప్యానెళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసి గ్రిడ్‌కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలను విస్తృతం చేస్తాం.

పరిశ్రమలకు భూములిస్తే వివాదం చేస్తారా?

ప్రముఖ పరిశ్రమలకు భూములిస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. భూమి, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి? విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం రాష్ట్రానికి వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువేంటో అందరూ అర్థం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్‌రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. 11 సంఖ్యతో వైసీపీకి అవినాభావ సంబంధమున్నట్లుంది. అందుకే గవర్నర్ ప్రసంగిస్తుండగానే సభలో అడ్డంకులు సృష్టించి 11 నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు.

16న రాష్ట్రానికి బిల్‌గేట్స్



ఈ నెల 16న బిల్‌గేట్స్ రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్‌కార్డులను తయారుచేసి వ్యక్తిగత ఔషధాలను కూడా అందించే అవకాశముంది. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి.

కల్తీ నెయ్యిని హెరిటేజ్‌కు ముడిపెడతారా?

- దాని బ్రాండ్‌ను దెబ్బతీసే యత్నాలు: సీఎం
- ఆ పత్రికవి తప్పుడు ఆరోపణలు: కుటుంబరావు



తిరుమల లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశమని సీఎం అసెంబ్లీలో స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిందే కాక ఆ వివాదంలోకి హెరిటేజ్ సంస్థను తీసుకు రావడంపై మండిపడ్డారు. 'ఆ సంస్థ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా తీసుకున్న చరిత్ర లేదు. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్‌కు ముడిపెట్టి ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ అనేది ఫ్యామిలీ బిజినెస్. దాని బ్రాండ్ దెబ్బతీసేలా జగన్ రోతపత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురిస్తున్నారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్లో భాగంగా కక్ష తీర్చుకునేందుకు చీనీ చెట్లను నరికేసేవారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయడం ఫ్యాక్షనిస్టులకు అలవాటు. ఇప్పుడు ఇలాంటి వ్యవహారాన్నే వారు నడిపిస్తున్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఘటనలో ఎన్నో నాటకాలాడారు. ఆ పత్రికలో నారాసుర రక్తచరిత్ర అని రాశారు. వాళ్లు చేసిన నేరాల నుంచి తప్పించుకోవడానికి ఇతరులపై నెట్టేసే ప్రయత్నాలు చేస్తున్నారు' అని ధ్వజమెత్తారు. మరోవైపు.. హెరిటేజ్ ఫుడ్స్‌పై వైసీపీ, జగన్ రోతపత్రిక చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధాలు, కల్పిత కథలతో కూడినవేనని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు అన్నారు. హెరిటేజ్ వెబ్‌సైట్ నుంచి ఒక ఫొటోను తీసుకుని.. అందులో ఒక కాలమ్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించి జగన్ పత్రిక ప్రచురించిందని విమర్శించారు. దేశంలో ఆ పత్రిక కంటే పెద్దవైన దైనిక్ జాగరణ్, దైనిక్ భాస్కర్ పత్రికల ప్రస్తుత మార్కెట్ క్యాప్ రూ.1,500 కోట్లుగా ఉంటే.. 2008లోనే ఆ పతికకు రూ.3500 కోట్ల వాల్యుయేషన్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఇది క్విడ్ ప్రో కో కాదా అని నిలదీశారు.

ధన్యవాద తీర్మానానికి ఆమోదం

ఈ నెల 11న బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. టీడీపీ సభ్యుడు మద్దిపాటి వెంకటరాజు ప్రవేశపెట్టి.. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు బలపరచిన తీర్మానాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభ ముందుంచగా.. సభ ఆమోదించింది.

వైసీపీ నుంచి వారసత్వంగా అరాచకం

(మొదటి పేజీ తరువాయి)



నిలబెట్టుకుంటూ, సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా శుక్రవారం అసెంబ్లీలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సభ్యులు వెల్‌లోకి వచ్చి గొడవ చేయడం బాధాకరమన్నారు. ప్రతిష్ఠాత్మకమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి బాధ్యతలు నిర్వహించిన గవర్నర్ ఎదుట వారి చేష్టలు హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేయడంలా ఉన్నాయని మండిపడ్డారు. మరో మూడు నెలల్లో రెండేళ్ల పాలనను ఎన్డీయే పూర్తి చేసుకుంటున్నదంటూ రాష్ట్ర ప్రజలకు, ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. "నీలో సాహసం ఉంటే దేశం అంధకారంలో ఉంటుందా..?' అని కవి శేషేంద్ర అన్నారు. ఈ వాక్యానికి నిలువెత్తు ప్రతిరూపం ప్రధాని మోదీ. ఆయన సహకారంతో రాష్ట్రం ముందుకుపోతోంది. గవర్నర్ ప్రసంగం ప్రేరణను అందించింది. రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసింది. 'వికసిత్ భారత్‌'లో భాగంగా 'వికసిత్ ఆంధ్రప్రదేశ్‌'ను సాధించాలనే గవర్నర్ పిలుపు అందరికీ స్ఫూర్తిదాయకం కావాలి. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకూ చేరాలని మాజీ ప్రధాని వాజపేయి ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచింది. సామాజిక పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.2,738 కోట్లను పెన్షన్ల రూపంలో అందిస్తున్నాం. రూ.10 వేల కోట్ల నిధులను 'తల్లికి వందనం' కోసం అందిస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశాం. అన్నం పెట్టే రైతాంగాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. వారి నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లించాల్సిన రూ.1674 కోట్లను ఎగ్గొట్టింది. ఆ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది" అని పవన్ కల్యాణ్ వివరించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

మీ వాడిగా చెబుతున్నా..

'కౌలు రైతుల కష్టాలు, కన్నీళ్లు తెలిసివాడిగా అసెంబ్లీ సాక్షిగా చెబుతున్నా. మీ కోసం ఈ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని హామీ ఇస్తున్నా. ఉమ్మడి ఏపీలో మాజీ ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా ప్రభుత్వ ఉద్యోగుల నిరాశానిస్పృహలు నేను అర్థం చేసుకోగలను. అందువల్లే పంచాయతీ రాజ్ శాఖ బాధ్యతలు తీసుకోగానే 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాను. 77 మందికి తొలిసారి జిల్లా పరిషత్ సీఈవోలుగా పదోన్నతులు కల్పించాను. సంస్కరణలో భాగంగా 77 డీడీవో కార్యాలయాలను ప్రారంభించాం."

'జల జీవన్'కు మళ్లీ జీవం పోశాం

"రాష్ట్రంలో రికార్డుస్థాయిలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, ఉదయగిరి నియోజకవర్గ స్కూల్ పిల్లలు తమ గ్రామాలకు రోడ్డు వేయమని కోరగా, అప్పటికప్పుడు అనుమతులు ఇచ్చాను. జాతీయ ఉపాధి హామీ నిధులతో 'అడవి తల్లి బాట' పేరుతో 625 గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ, రూ.1,005 కోట్లతో 1,069 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం ప్రారంభించి.. సగానికిపైగా పూర్తి చేశాం. కొన్ని రోడ్లకు గంటల వ్యవధిలోనే అనుమతులు ఇచ్చాను. ప్రతి ఇంటికీ కుళాయి పథకం కోసం జల్ జీవన్ మిషన్ కింద 2019-24 మధ్య కాలంలో ఏపీకి రూ.27 వేల కోట్ల మేర కేటాయించగా, గత ప్రభుత్వం రూ.4 వేల కోట్ల విలువైన పనులు మాత్రమే చేసింది. పైపులైన్ వేయడం తప్ప ఒక్క గ్రామానికీ నీరు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర నాయకత్వాన్ని అడిగి... అప్పట్లో వినియోగించుకోని రూ.23 వేల కోట్లు ఖర్చు చేసేందుకు గడువును పొడిగించుకున్నాం. ప్రతి ఇంటికీ కుళాయి అందించి తీరుతాం.ఈ పథకం కింద రూ.1,242 కోట్లతో ఉద్దానం, డోన్, పులివెందుల బహుళ గ్రామ ప్రాజెక్టులను పూర్తి చేయనున్నాం. చిత్తూరు, పల్నాడు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లతో వచ్చే రెండేళ్లలో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టనున్నాం." అని పవన్ కల్యాణ్ అన్నారు. తన ప్రసంగంలో ఆయన మాజీ ప్రధాని వాజపేయి, మహాకవి శేషేంద్ర సహా పలువురు ప్రముఖులు, కవుల సూక్తులను, కవితా చరణాలను ఉటంకించారు.

గవర్నర్‌ను కలిసిన పవన్..

గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం లోక్ భవన్‌కు వెళ్లిన పవన్‌కు అధికారులు స్వాగతం పలికారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై వారిద్దరు చర్చించుకున్నారని తెలిసింది.

ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే!

> మీకైనా.. నాకైనా అదే సూత్రం వరిస్తుంది

- ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ముందుకు సాగడం ద్వారా ఉత్తమ ఫలితాలు
- చిత్తూరు ప్రజాప్రతినిధులతో భేటీలో సీఎం చంద్రబాబు
- తన నియోజకవర్గ పనితీరునూ విశ్లేషించుకున్న సీఎం
- ఎమ్మెల్యేల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టు అందజేత

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'కుప్పం నియోజకవర్గ ప్రజల్లో నేను మరింత అందుబాటులో ఉంటే బాగుండు అనే భావన ఉంది. దీన్ని సరిదిద్దేందుకు తరచూ కుప్పంకు వస్తాను. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే విషయంలో మీరైనా, నేనైనా ఏ మాత్రం రాజీ పడే ప్రసక్తే ఉండకూడదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల పరస్పర సమన్వయంతో పాలనలో వేగం పెంచేందుకు ప్రారంభించిన 'ప్రజాప్రతినిధులతో భేటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన చిత్తూరు జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు కలెక్టర్, ఎస్పీలు కూడా హాజరయ్యారు. సుమారు 2 గంటలపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్వయంగా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశాలనూ చంద్రబాబు చర్చించడం గమనార్హం. చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులందరి పనితీరు బాగుందని, అలాగని సంతోష పడకుండా ఎక్కడ వెనుకబడి ఉన్నామో.. దానిపై దృష్టి సారించి మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి ముందుకు సాగడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కూటమి ప్రభుత్వ ముద్ర కనబడేలా పనిచేయాలన్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు విషయంలో ప్రజల్లో సానుకూల దృక్పథం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం చర్చించారు. 20 నెలల్లో స్థానికంగా తీసుకున్న చర్యలు, వచ్చిన ఫలితాలు, రాజకీయ స్థితిగతులు, రానున్న 3-4 నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పరిష్కరించాల్సిన అంశాలపై ఎమ్మెల్యేలతో సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రజల సమస్యలపై ప్రజాప్రతినిధులు ఇచ్చే ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

తొలిసారి ఎమ్మెల్యేలు మరింత అందుబాటులో..

'చిత్తూరు జిల్లాలో నేను, అమర్నాథ్ రెడ్డి తప్ప మిగిలిన వారంతా తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లే. తొలిసారి ఎమ్మెల్యేలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలి. ప్రజల్లో కలిసిపోయి వారి సమస్యలు పరిష్కరించాలి' అని చంద్రబాబు సూచించారు. వివిధ మార్గాల ద్వారా తాను తెప్పించుకున్న సర్వేలు, నివేదికల ఆధారంగా వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఎమ్మెల్యేలతో పంచుకున్నారు. ప్రధానంగా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, మీడియా, సోషల్ మీడియాలో చొరవ చూపడం, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం, అధికారులతో సమన్వయం చేసుకోవడం, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడం, పొలిటికల్ యాక్టివిటీ చేయడం వంటి అంశాలపై ఎమ్మెల్యేల పనితీరు గురించి సవివరంగా చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై నివేదికను సీల్డ్ కవర్‌లో సీఎం చంద్రబాబు వారికి అందజేశారు. అందులో ఎమ్మెల్యే పనితీరు ఆధారంగా.. రాష్ట్రస్థాయిలో ఏ స్థానంలో ఉన్నారు, జిల్లా స్థాయిలో ఏ స్థానంలో ఉన్నారనే దానిపై ర్యాంకులు ఇచ్చారు. బాగా పనిచేసిన వారిని అభినందిస్తూ.. వెనుకబడిన వారికి సూచనలు చేశారు. అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేయాలని, అధికారులు కూడా ఆయా సమస్యలపై మరింత వేగంగా స్పందించాలని సూచించారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాల వినియోగం ఎలా జరుగుతుందని ఆరా తీశారు. ఆ కార్యాలయాలు, సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో మరింత కఠినంగా ఉండాలని ఎస్పీని ఆదేశించారు.

డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం!

- ఆగడాలను సహించేది లేదు: చంద్రబాబు
- జాతీయ స్థాయిలో 'బెస్ట్ ప్రాక్టీస్ స్టేట్'గా ఏపీ
- ఈగల్ నివేదిక-2025ను విడుదల చేసిన సీఎం


ఈగల్ నివేదికను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మాఫియా ఆగడాలను సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మాఫియాపై తమ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై కట్టుదిట్టమైన పోరాటానికి నిదర్శనంగా నిలిచిన 'ఈగల్' వార్షిక నివేదిక-2025ను శుక్రవారం సచివాలయంలో సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీ పోలీసు వ్యవస్థ సాధించిన ఫలితాలతో మన రాష్ట్రం 'బెస్ట్ ప్రాక్టీస్ స్టేట్'గా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీవోఆర్‌డీ) ప్రాధాన్యాలకు అనుగుణంగా రాష్ట్రం మెరుగ్గా నిలిచిందని ప్రశంసించారు. డ్రగ్ నిరోధక వ్యవస్థను సాంకేతిక, ఇంటెలిజెన్స్ ఆధారితంగా రూపుదిద్దిన ఈగల్ బృందాన్ని సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత అభినందించారు. డ్రగ్ మాఫియా ఆగడాలపై చర్యలతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడం, కమ్యూనిటీ భాగస్వామ్యం, డీ-అడిక్షన్‌పై దృష్టి సారించడం ప్రశంసనీయమని హోంమంత్రి పేర్కొన్నారు. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఇంటెలిజెన్స్ ఆధారిత చర్యలు, అంతర్రాష్ట్ర సమన్వయం, ఆర్థిక దర్యాప్తు వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల ఈగల్ సాంకేతికంగా బలమైన సంస్థగా మారిందని వివరించారు. కార్యక్రమంలో ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ, ఎస్పీ కె.నాగేశ్‌బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



24 నుంచి సభ్యులకు క్రీడాపోటీలు: స్పీకర్



అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పీకర్ సభలో ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన ఎమ్మెల్యేలకు సమావేశాల చివరి రోజున బహుమతులు అందజేస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఆయా చీఫ్ విప్‌లకు పేర్లు ఇవ్వాలన్నారు. సభ చివరి రోజు బహుమతుల ప్రదానం కార్యక్రమంలో కుటుంబ సమేతంగా హాజరుకావాలని స్పీకర్ సభ్యులను కోరారు. కాగా, 24, 25, 26 తేదీల్లో విజయవాడలో క్రీడా పోటీలను, మార్చి 6న సాంస్కృతిక కార్యక్రమాలను రాజధాని అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు.

అంబటి ఓ క్రిమినల్.. రాజకీయ ఉగ్రవాది

» మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ



అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు ప్రజలను నిత్యం భయభ్రాంతులకు గురిచేసే ఓ క్రిమినల్ అని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను అడ్డగోలుగా దోచుకుని, ఇప్పుడు కులం కార్డు బయటకు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు, ఆర్యవైశ్యులను అడ్డగోలుగా దోచుకున్న రాజకీయ ఉగ్రవాది రాంబాబు అని విమర్శించారు. చిరంజీవి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను జగన్ తిట్టించినప్పుడు.. అంబటికి కాపు కులం గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. కాపులతోపాటు అన్ని వర్గాలను ఇబ్బంది పెట్టిందే కాకుండా.. ఇప్పుడు తగ్గేదేలే అంటూ సైగలు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భువనేశ్వరిపై మాట్లాడినప్పుడే ఆయనకు కుటుంబసభ్యులు గడ్డి పెట్టి ఉంటే, నేడు వారు రోడ్డెక్కాల్సిన పని ఉండేది కాదని హితవు పలికారు. కాపులు తాగుబోతులంటూ అంబటి చేసిన వ్యాఖ్యలను అనురాధ మీడియాకు వినిపించారు.

వైసీపీ.. పెద్ద డ్రామా కంపెనీ!

» తప్పు చేసి, బుకాయించడం ఆ పార్టీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య: జనసేన ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ అనేది ఓ పెద్ద డ్రామా కంపెనీ అని, తప్పు చేయడం తర్వాత బుకాయించడం ఆ పార్టీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని జనసేన ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. జగన్ బాబాయి హత్య దగ్గర నుంచి తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం వరకు ఆ పార్టీ నాయకుల డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులు గత ఏడాదిన్నరగా ప్రతిపక్ష హోదా గురించే తప్ప, ప్రజలకు అవసరమైన అంశాలపై ఒక్క మాట మాట్లాడలేదన్నారు. ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చించే అవకాశాన్ని వదులుకుని, రోడ్ల మీద 'రప్పా రప్పా..' డైలాగులతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వైసీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరూ.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదని నిలదీయాలని సూచించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలనను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతుంటే, జగన్‌కు కడుపు మంటగా ఉందని మండిపడ్డారు. గత ఐదేళ్లు సంక్షేమం పేరుతో దోచుకున్నారన్నారని విమర్శించారు. తన పార్టీ ఎమ్మెల్యేలను సభకు వెళ్లనీయకుండా జగన్ అడ్డుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వివాదం వ్యక్తిగత విషయమని, దానిపై కమిటీ వేశామని, తప్పు చేసి ఉంటే కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి తప్పుడు కథనాలపై ఫిర్యాదు చేశా: విజయకుమార్



తనపై సాక్షి పత్రికలో రాస్తున్న తప్పుడు కథనాలపై శాసనసభ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశానని జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వం తీసుకుంటే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రాంబిల్లిలో డీ పట్టా భూముల అంశం అంతా చట్టప్రకారమే జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమికి తనకేం సంబంధమని ఆయన ప్రశ్నించారు. ఇదే అంశంపై ఆయన సభలో కూడా మాట్లాడారు.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు 50 లక్షలు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. నిధులు మంజూరు చేసినందుకు టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారు నాయక్ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.



అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులతో లోకేశ్ విందు

వైసీపీపై ఇక అఫెన్సే!

» గేమ్‌ప్లాన్ మారుద్దామన్న లోకేశ్
» మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఇష్టాగోష్టి
» చిత్తూరు, అనకాపల్లి ప్రజాప్రతినిధులతోనూ ఆత్మీయ భేటీ
» నేడు విజయవాడ, గుంటూరు ప్రజాప్రతినిధులతో లంచ్
» 28న యలమంచిలిలో బ్లూజెట్‌కు శంకుస్థాపన

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు వైసీపీ మనపై విమర్శలు చేస్తే.. మనం డిఫెన్స్ ఆడుతూ సమస్యను అధిగమిస్తున్నామని, ఇకపై గేమ్ ప్లాన్ మారుద్దామని, మనమే అఫెన్స్ గేమ్ ఆడదామని మంత్రి లోకేశ్ అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని టీడీఎల్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రాన్ని వైసీపీ ఐదేళ్లలో ఏ స్థాయిలో సర్వనాశనం చేసిందో ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ వెళ్దామన్నారు. ఆ పార్టీ వైరస్‌లా ఎంత ప్రమాదకారో వివరించాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. ఈ అఫెన్స్ గేమ్‌లో మంత్రులు కీలకంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. ఈ నెల 28న అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గంలో అతిపెద్ద ఫార్మా సంస్థ బ్లూజెట్‌కు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో ఓ వ్యక్తి బ్లూజెట్ సంస్థలో ఉద్యోగిగా ఉన్నారని, సంస్థ విస్తరణ ఆలోచనపై ఆయన తనకు పెట్టిన మెసేజ్ ఆధారంగా ఫాలో అప్ చేసి ఆ సంస్థను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల్లో గెలిచిన టీడీపీ మద్దతుదారులతో ఈ నెలాఖరులోపు సీఎం సమావేశమవుతారని తెలిపారు. కాగా.. చిత్తూరు ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశం అనంతరం వారు లోకేశ్‌ను కలిశారు. 'లీడర్‌తో ఆత్మీయ సమావేశం'లో పాల్గొన్నారు. ఇందులో అనకాపల్లి ఎంపీ స్థానం పరిధిలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నేడు విజయవాడ, గుంటూరు ప్రజాప్రతినిధులతో లోకేశ్ భేటీ అవుతారు. సాధారణంగా రాత్రి 7 గంటలకు జరుగుతున్న ఈ సమావేశాలు శనివారం మాత్రం మధ్యాహ్న భోజన భేటీగా మారాయి. అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత ఈ సమావేశం జరుగుతుంది. గుంటూరు, విజయవాడ ఎంపీలతోపాటు రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరుకానున్నారు.

సీఎం తల్లిని అవమానిస్తే.. 2 చిన్న మాటలా?

(మొదటి పేజీ తరువాయి)

అంబటి రాంబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైసీపీ సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ ఆరోపించారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యల్లో తప్పులు గుర్తించి క్షమాపణ చెప్పినా.. అరెస్ట్ చేసి, జైల్లో పెట్టారని బొత్స వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "అంబటి రాంబాబు ముఖ్యమంత్రి తల్లిని అవమానించారు. అవునా.. కాదా..? వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అలాంటిది అంబటి తప్పుడు మాటలు మాట్లాడితే వదిలిపెడతామా..? టీడీపీ కార్యకర్త వైఎస్ భారతీరెడ్డి గురించి మాట్లాడితే తక్షణమే చర్యలు తీసుకున్నాం. అదీ మా చిత్తశుద్ధి. ఐదేళ్లు మీరేం చేశారు..? మా పార్టీ ఆఫీస్‌పై దాడిచేస్తే ఏం చర్యలు తీసుకున్నారు..? అసెంబ్లీలో మా తల్లిని అవమానిస్తే.. మీరేం చేశారు..? అంబటి అన్నది రెండు చిన్న మాటలని జగన్ అంటున్నారు. ఒక తల్లిని అవమానిస్తే చిన్న మాటగా చూస్తామా..? మాజీ మంత్రి అయి ఉండి అలాంటి మాటలు మాట్లాడితే సమర్థిస్తారా..? సొంత తల్లిని, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు. కానీ మాకు ఉంది. మహిళల జోలికొస్తే వదిలిపెట్టం. జగన్ తల్లి విషయంలోనైనా... ఇంకెవరి తల్లి, చెల్లి, అక్క, కూతురు గురించైనా తప్పుగా మాట్లాడితే ప్రజా ప్రభుత్వం వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. నెల్లూరులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే టీడీపీ మహిళా ఎమ్మెల్యే గురించి ఏం మాట్లాడారో చూశాం. దానికి సమాధానం లేదు. అంబటి విషయంలో మాత్రం జగన్ వెళ్లి ప్రెస్‌మీట్‌లో సింపుల్‌గా రెండు చిన్న మాటలన్నాడని చెబుతారు. అవి చిన్నమాటలెలా అవుతాయి? నాయకత్వం వహించే వ్యక్తి అలా అనొచ్చా..? టీడీపీ నేతలెవరైనా తప్పుగా మాట్లాడితే ఆధారాలు ఇవ్వండి.. చర్యలు తీసుకుంటాం. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. మహిళలను కించపరచకూడదనే విజ్ఞత ఉండొద్దా..? అలాంటి వారిని, ఇలాంటి మాటలను ప్రోత్సహించవద్దని కోరుతున్నా. వైసీపీ మాజీ మంత్రి అని అంబటిపై మేం కక్ష సాధింపులకు పాల్పడటం లేదు" అని లోకేశ్ స్పష్టం చేశారు.

> "సొంత తల్లిని, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు... కానీ మాకుంది. ఈ రాష్ట్రంలో ఏ మహిళ జోలికొచ్చినా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. జగన్ తల్లి అయినా.. ఎవరి తల్లి అయినా.. కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ఆడబిడ్డల జోలికొస్తే అదే చివరి రోజని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. అలాంటిది అంబటి రాంబాబు ముఖ్యమంత్రి తల్లినే అవమానిస్తే వదిలిపెడతామా..?"
> \- నారా లోకేశ్

పాఠశాలలకు స్టార్ రేటింగ్ ముఖ్యం..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ చెప్పారు. శాసనమండలిలో 'మన బడి-మన భవిష్యత్' పథకంలో 2020 నుంచి 2026 వరకు ఖర్చు చేసిన నిధుల వివరాలను విపక్ష సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలత, రామచంద్రారెడ్డి అడిగారు. మంత్రి సమాధానమిస్తూ... 'కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.7,500కోట్లు పెట్టాల్సిన అవసరముందని అధికారులు చెప్పారు. ప్రతి పాఠశాలకూ ఫైవ్ స్టార్ రేటింగ్ ఇవ్వాలని చెప్పాం. 40శాతం పాఠశాలలు 2స్టార్ రేటింగ్ కన్నా తక్కువగా ఉండగా అభివృద్ధికి నిర్ణయించాం. జీవో 117కు ప్రత్యామ్నాయంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్ కింద తరగతికో టీచర్ ఉండే విధానాన్ని తెచ్చాం. గతంలో కేవలం 3 శాతం పాఠశాలల్లోనే తరగతికో టీచర్ ఉంటే ఇప్పుడు 33 శాతానికి తెచ్చాం. దీనివల్ల కొన్ని చోట్ల గదుల అవసరం ఏర్పడింది. గతంలో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన 233 పాఠశాలలు మూతపడ్డాయి. నిధులు వృథా చేయకుండా ఎక్కడ అవసరమో అక్కడ ఖర్చు చేస్తున్నాం. నాడు-నేడు కింద గత ప్రభుత్వం పెట్టిన రూ.500కోట్ల బకాయిలు చెల్లించాం. వైసీపీ ప్రభుత్వానికి నాడు-నేడుపై చిత్తశుద్ధి ఉంటే బకాయిలు ఎందుకు చెల్లించలేదు? వైసీపీ సభ్యులు వాకౌట్ చేయకుండా ఉంటే అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్తాం. వైసీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తే లెర్నింగ్ ఔట్ కమ్స్ ఎందుకు పడిపోయాయి..? 47 శాతం మంది 8వ తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్య పుస్తకాలు కూడా చదవలేకపోయారు. అందుకే ఏఐ టూల్ ద్వారా గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ చేపట్టాం. ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చిదిద్దుతాం' అని చెప్పారు.



గత ప్రభుత్వం 4వేల కోట్ల ఫీజు బకాయి పెట్టింది: లోకేశ్

గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు రూ.4వేల కోట్లపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని మంత్రి లోకేశ్ శాసనమండలిలో వెల్లడించారు. దీనిపై వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఫీజు బకాయిలపై చర్చకు రావాలని మంత్రి సవాల్ చేశారు. మండలి ప్రశ్నోత్తరాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైసీపీ సభ్యులు జయేంద్ర భరత్, రమేశ్‌యాదవ్, మురళీధర్ వేసిన ప్రశ్నకు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమాధానం ఇస్తూ... గత ప్రభుత్వం రూ.4,064కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని చెప్పారు. అయితే బకాయిలు ఎప్పటి లోగా ఇస్తారు? అసలు ఇస్తారా లేదా..? అని బొత్స ప్రశ్నించారు. దీనిపై అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. మీకు చిత్తశుద్ధి ఉంటే బకాయిలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని మంత్రి స్వామి అనగానే వైసీపీ సభ్యులు పెద్దగా కేకలు వేశారు. ఈ క్రమంలో మంత్రి లోకేశ్ జోక్యం చేసుకుని.. 'బొత్స ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలే లేవంటున్నారు. 2020-21లో క్యూ4 రూ.683.1 కోట్లు, క్యూ3, 4 బకాయిలు రూ.1,753.98 కోట్లు, 2023-24లో రూ.895కోట్లు ఎంటీఎఫ్ బకాయిలు పెట్టారు. ప్రభుత్వం మారే సమయంలో రూ.645కోట్ల బకాయిలు చెల్లించలేదు. ఈ మాట రికార్డు ప్రకారం చెప్తున్నాను' అన్నారు. దీనిపై వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయగా.. 'విద్యాశాఖ మంత్రిగా దీనిపై మాట్లాడే హక్కు నాకుంది. రూ.4,064.59 కోట్లు వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టి వెళ్లింది. దీనిపై చర్చకు సిద్ధమా' అని లోకేశ్ నిలదీశారు. బొత్స మాట్లాడుతూ... ఇంటర్ విద్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సమాధానాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నామని చెప్పి వైసీపీ సభ్యులంతా బయటకు వెళ్లిపోయారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. 'నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్ధాలు చెప్పి వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వ విధానాలతో ఇంటర్ కాలేజీల్లో 70వేల మంది విద్యార్థులు పెరిగారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 12లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. మధ్యాహ్న భోజనం రద్దు చేశారు. మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు వాళ్లకెక్కడిది..? ఆరోపణలు చేసి, వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది. సమస్యలు లేవని మేం చెప్పడం లేదు. అధ్యక్షా.. విపక్ష నేతలను పిలిపించండి. వాళ్లని ప్రశ్నించే హక్కు మాకూ ఉంది. వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే మా ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాలి' అన్నారు.



జేఎన్‌టీయూ-జీవీ చట్ట సవరణ చేస్తాం

జేఎన్‌టీయూ-జీవీకి బోధన, బోధనేతర సిబ్బంది కేటాయింపు కోసం ఐచ్ఛికాలు ఇచ్చేందుకు చట్ట సవరణ చేస్తామని మంత్రి లోకేశ్ శాసనమండలిలో ప్రకటించారు. మండలిలో జేఎన్‌టీయూ, గురజాడ, విజయనగరంపై వైసీపీ సభ్యులు విక్రాంత్, ఇసాక్ బాషా అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ... '2008లో జేఎన్‌టీయూ 30వ చట్టాన్ని సవరించిన కారణంగా 2021లోని 22వ చట్టం ద్వారా జేఎన్‌టీయూ-జీవీ 2022లో ఏర్పాటైంది. దీనివల్ల న్యాయపరమైన చిక్కులు వచ్చాయి. కోర్టులో 27 కేసులు ఉన్నాయి. యాక్ట్30, సెక్షన్45 విభాగాన్ని నెల రోజుల్లో సవరిస్తాం. సెక్షన్ 46 విషయంలో ఆడిట్ అభ్యంతరం వచ్చింది. ముందు ఆడిట్ పూర్తి చేసిన తర్వాత యూనివర్సిటీకి పేమెంట్స్ చేస్తాం. ఇప్పటికే రూ.119 కోట్లు బదిలీ చేశాం. బ్యాలెన్స్ కూడా త్వరలో ఇస్తాం' అని చెప్పారు.

రెవెన్యూ సమస్యలు తీర్చాలి

» భూములు లాక్కున్నారని రైతులు గగ్గోలు
» వైసీపీ హయాంలో మ్యుటేషన్లన్నీ అక్రమమే
» కూటమి ప్రభుత్వ సదస్సుల్లోనూ పరిష్కరించలేదు
» సమస్యలు విని పరిష్కరించామంటే ఎలా?: ఎమ్మెల్యేలు
» 2.34 లక్షల వినతుల్లో 2.33 లక్షలు పరిష్కరించాం: అనగాని
» సీఎంతో చర్చించి చర్యలు చేపట్టాలి: అయ్యన్న

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'భూములు లాక్కున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ హయాంలో చేసిన రీ సర్వే తప్పుల తడక. మ్యుటేషన్లన్నీ అక్రమమే. నియోజకవర్గాల్లో మాకు వినిపిస్తున్న ప్రధాన సమస్య ఇదే. రెవెన్యూ సదస్సుల్లో బాధితుల విజ్ఞాపనలు పరిష్కారం కాలేదు. సమస్య పరిష్కరించకుండానే చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం దీన్ని ప్రధాన సమస్యగా తీసుకుని పరిష్కరించాలి' అని పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో కందుల నారాయణరెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర, ఏలూరి సాంబశివరావు, ఉగ్ర నరసింహారెడ్డి తదితరులు రెవెన్యూ సమస్యల్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. 2019-2024 మధ్యలో జరిగిన రెవెన్యూ అక్రమాలు, అవకతవకలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు కనీస పరిష్కారం చూపించలేదన్నారు. బాధితుల సమస్యలు విని పరిష్కరించామని చెబితే ఎలా? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కలెక్టర్లు సైతం రెవెన్యూ సమస్యలపై సరిగా స్పందించడం లేదన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ బదులిస్తూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూకు సంబంధించినవి వినతులు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. 2,34,644 వినతులు అందగా 2,33,578 పరిష్కరించినట్లు వెల్లడించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ.. 'ప్రతి నియోజకవర్గంలో ఈ సమస్య ఉంది. ముఖ్యమంత్రితో చర్చించి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతోపాటు ఎమ్మెల్యేలను సైతం ఆహ్వానించి ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేయండి' అంటూ రెవెన్యూ మంత్రికి సూచించారు.

ఆహార కల్తీ పరీక్షలు సరిగా జరగలేదు: మంత్రి సత్యకుమార్



రాష్ట్రంలో ఆహార కల్తీపై పరీక్షలు అనుకున్న స్థాయిలో జరగడం లేదని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అంగీకరించారు. హోటళ్లు, ఆహార దుకాణాల్లో నాసిరకం, కల్తీ పదార్థాలను వినియోగిస్తూ ప్రజల్ని ఆసుపత్రిపాలు చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రశ్నించారు. మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం తనిఖీలు చేపట్టాలంటే 700 మంది సిబ్బంది అవసరం ఉండగా, 579 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఆహార కల్తీ పరీక్షల ల్యాబ్‌లు కూడా లేవన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి 150 మంది నియామకానికి ప్రక్రియ ప్రారంభించామని, విశాఖ, గుంటూరు, తిరుపతిలో రూ.100 కోట్లు ఖర్చు చేసి ల్యాబ్‌లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. టీటీడీకి ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్పీకర్ అయ్యన్న స్పందిస్తూ.. 'గ్రామ సచివాలయాల సిబ్బందిలో ఫుడ్ సేఫ్టీ కోర్సు చేసిన వారు ఉన్నారట.. వీలైతే వారిని డిప్యుటేషన్‌పై తీసుకోండి' అని సూచించారు. మన్యం ప్రాంతంలో గిరిజన విద్యార్థుల మరణాలకు కామెర్లు, వైరల్ జ్వరాలు కారణం కాదని.. వివిధ కారణాల వల్ల 11 మంది మరణించారని ఓ ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు.

వైసీపీ ప్రభుత్వంలో దోపిడీ: కొల్లు



గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం విధానాన్ని అనుకూలంగా మార్చుకుని దోపిడీ చేశారని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాసిరకం మద్యాన్ని తీసుకొచ్చి మాఫియా తరహాలో రూ.3500 కోట్ల దోపిడీకి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు సైతం ఇంత పెద్ద లిక్కర్ స్కామ్‌లో నిందితులకు బెయిల్ ఇవ్వలేమని వ్యాఖ్యలు చేసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అభాసుపాలు చేసేందుకు ఇబ్రహీంపట్నం, ములకలచెరువు ప్రాంతంలో నాసిరకం మద్యాన్ని తయారు చేశారన్నారు. తాము అప్రమత్తమై చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం మద్యం నాణ్యతపై 13 రకాల పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. అక్రమ మద్యం సరఫరా కేసుల్లో సీజ్ చేసిన వాహనాల్లో కోర్టు ఆదేశాల మేరకు కొన్నింటిని విడుదల చేశామని, ఇంకా 26,804 ఉన్నాయని తెలిపారు. సీజ్ చేసిన వాహనాల వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారని, ప్రభుత్వం ఒక విధానం తీసుకొచ్చి వాటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగాలు కల్పిస్తాం: రామ్‌ప్రసాద్



నిరుద్యోగ యువతకు భృతి అందించే పథకం ఏదీ రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేయట్లేదని, 2029 నాటికి 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని.. వైసీపీ ఎమ్మెల్యేలు అమరనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, శివప్రసాద్ రెడ్డి, విరూపాక్షి రాతపూర్వకంగా అడిగిన ప్రశ్నకు మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఐదు లక్షల మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో డ్వాక్రా గ్రూపుల సొమ్ము రూ.60.35 కోట్లు దుర్వినియోగం అయిందని, అందులో రూ.17.78 కోట్లు తిరిగి వసూలు చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పదవీ విరమణ చేసిన పింఛనుదారులు మరణించాక వారి భార్యలకు పింఛను అందజేస్తున్నామని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో త్వరలో మినీ జెట్టి నిర్మాణానికి శంకుస్థాపన చేయబోతున్నట్లు మంత్రి అచ్చెన్న తెలిపారు.



₹3.32 లక్షల కోట్లతో నేడే బడ్జెట్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను శనివారం శాసనసభ, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ దఫా బడ్జెట్ దాదాపు రూ.3.32 లక్షల కోట్లుగా ఉండే అవకాశముంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. ఈసారి దాదాపు రూ.10,000 కోట్లు పెంచనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో ఉదయం 11:15 నిమిషాలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. దానికి ముందు పదిన్నర గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. పయ్యావుల బడ్జెట్ పెట్టిన తర్వాత వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను సభ ముందుంచుతారు. హోం మంత్రి అనిత శాసనమండలిలో రాష్ట్ర బడ్జెట్‌ను, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం ఉభయసభలూ వాయిదాపడతాయి. 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలుపుతాయి. కాగా.. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు రెవెన్యూ లోటు నిధులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో మన రాష్ట్రానికి ఏడాదికి రూ.10,000 కోట్లు తగ్గిపోయినట్లే. ఇతర గ్రాంట్లను కూడా కేంద్రం నిలిపివేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా పెరుగుతుందని భావించినా అతి స్వల్పంగా పెరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత అప్రమత్తమైంది. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను 10 శాతం పెంచుతూ వస్తున్నారు. ఈసారి మాత్రం కేవలం రూ.10,000 కోట్లే పెంచినట్లు తెలిసింది. అభివృద్ధి, సంక్షేమం, మహిళలు, రైతులకు ప్రాధాన్యమిస్తూ.. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీల అమలుకు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. పారిశ్రామిక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తారని అంటున్నారు. రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణంపై కూడా దృష్టి సారిస్తున్నారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగు

» వైసీపీ డెమొక్రసీని డీగ్రేడ్ చేసింది
» గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన విష్ణుకుమార్ రాజు
» రాష్ట్రంలో బూతుల నివారణకు ప్రత్యేక చట్టం తేవాలి: సోమిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగులు తీస్తోందని బీజేపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ఆయన మాట్లాడారు. 'జగన్ పాలనలో అసెంబ్లీలో బూతులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని డీగ్రేడ్ చేశారు. గత పాలకుల అరాచకాలకు, బెదిరింపులకు పరిశ్రమలు వెళ్లిపోయాయి. వికృత రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని అత్యంత అద్భుతమైన విధానంతో అభివృద్ధి పథంలోకి సీఎం చంద్రబాబు తీసుకువెళ్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు ప్రధాని మోదీని ఒప్పించి నిధులు తెస్తూ ఏపీ పురోభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు. గవర్నర్‌ను, సభలోని సభ్యుల్ని, ఏపీ ప్రజల్ని వైసీపీ అగౌరవపరిచింది. వైసీపీ విధానాన్ని బీజేపీ తరఫున ఖండిస్తున్నా. లిక్కర్‌తో పాటు శ్రీవారి లడ్డూనూ కల్తీ చేశారు. ఆలయాల్ని ధ్వంసం చేశారు. ఇలాంటి పరిస్థితి నుంచి సూపర్ ఫాస్ట్‌గా సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ రూ.43 కోట్ల విలువైన ఫ్రీ బస్సు సౌకర్యాన్ని మహిళలు ఉపయోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా విశాఖలో అభివృద్ధి జరుగుతుంది. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గవర్నర్ తన ప్రసంగం ద్వారా సుస్పష్టంగా తెలియజేశారు. గవర్నర్‌కు మా పార్టీ తరఫున ధన్యవాదాలు' అని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ... 'అధికారంలో ఉన్నప్పుడు పాలన ఎలా చేయకూడదో చూపించిన వైసీపీ... ఇప్పుడు ప్రతిపక్షం ఎలా ఉండకూడదో చూపిస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు బూతులు, తల్లిదండ్రులను కించపరిచేలా మాట్లాడుతున్నారు. అలాంటి వారిని కట్టడి చేయడానికి ప్రస్తుత పరిస్థితిలో ప్రత్యేక చట్టం అవసరం. ఆ చట్టం కింద కేసు నమోదైతే బెయిల్ రాకుండా ఉండేలా నిబంధనలను పొందుపరచాలని స్పీకర్‌ను కోరుతున్నా' అని అన్నారు.

సభలోకి మూడు బిల్లులు

ఆంధ్రప్రదేశ్ శాసన సభలో మంత్రులు మూడు బిల్లులు ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టానికి రెండు సవరణలను ప్రతిపాదిస్తూ రెండు బిల్లులను మంత్రి నారాయణ స్థానంలో పరిశ్రమల మంత్రి టీజీ భరత్ సభలో ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ సవరణ బిల్లును మంత్రి గొట్టిపాటి రవి ప్రవేశపెట్టారు.

గుంటూరు జిల్లా ఉప్పలపాడులో విదేశీ పక్షులు, వాటి పిల్లలు సందడి చేస్తున్నాయి. చిట్టి చిట్టి రెక్కలను రపరపలాడిస్తూ తల్లి కోసం

రారండోయ్.. సందడి చేద్దాం..

పిల్లల ఆరాటం.. పిల్లల కోసం తెచ్చిన ఆహారాన్ని తినిపిస్తూ తల్లులు చూపుతున్న మమకారం సందర్శకులను ముగ్ధుల్ని చేస్తున్నాయి. గూడ బాతులు (పెలికాన్), పెయింటెడ్ స్టార్క్‌లు సంతాన ఉత్పత్తి కోసం ఇక్కడ గూళ్లు కట్టి కొంత కాలంగా ఇక్కడే ఉంటున్నాయి.



ఆర్టీసీ ఎండీగా బాలసుబ్రమణ్యం

» జైళ్ల శాఖ డీజీగా అదనపు బాధ్యతలు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.బాలసుబ్రమణ్యం నియమితులయ్యారు. శుక్రవారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ విభాగంలో, రాష్ట్ర విభజన తర్వాత రవాణా శాఖ కమిషనర్‌గా ఆయన పనిచేశారు. దేశంలోనే అత్యధికంగా 83 రవాణా సేవల్ని ఆన్‌లైన్ విధానంలో ప్రజలకు అందజేసి ప్రశంసలు పొందారు. ఇటీవలే ఆయన్ను జైళ్ల శాఖ డీజీగా నియమించిన ప్రభుత్వం.. రెండు వారాల్లోనే ఆర్టీసీ ఎండీగా నియమిస్తూ జైళ్ల శాఖ బాధ్యతలు అదనంగా అప్పగించింది. జనవరి 31న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పదవీకాలం ముగియడంతో రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు ప్రభుత్వం తాత్కాలిక బాధ్యతలు అప్పగించింది.

లిక్కర్ గ్యాంగ్‌కు రిమాండ్ పొడిగింపు

» 'రాజ్ కసిరెడ్డి అండ్ కో' తిరిగి జైలుకు.. వాయిదాకు హాజరైన చెవిరెడ్డి

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 27 వరకు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బూనేటి చాణక్య, అనిల్ చోక్రా, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న రోణక్ కుమార్, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణను శుక్రవారం కోర్టులోహాజరుపరచగా రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే బెయిల్‌పై విడుదలైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, పైలా దిలీప్, పి.కృష్ణమోహన్‌రెడ్డి వాయిదాకు హాజరయ్యారు. రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి వాయిదాకు హాజరుకాలేమని ఆబ్‌సెంట్ పిటిషన్ దాఖలు చేశారు.

334.30 కోట్లతో 7174 చెరువులు అభివృద్ధి

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో రూ.334.30 కోట్ల వ్యయంతో 7,174 చెరువులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. అనంతపురం చీఫ్ ఇంజనీరు పరిధిలో 234 చెరువులను రూ.22 కోట్లతోనూ, ఎన్‌టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో 326 చెరువులను రూ.22 కోట్లతోనూ, సీఈ కర్నూలు పరిధిలో 474 చెరువులను రూ.37 కోట్లతోనూ, కడప సీఈ పరిధిలో 80 చెరువులను రూ.5 కోట్లతోనూ, సీఈ ప్రాజెక్టుల పరిధిలో రూ.ఏడు కోట్లతో 71 చెరువులు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు గుంటూరు పరిధిలో 797 చెరువులను రూ.37.44 కోట్లతోనూ, సీఈ విశాఖ పరిధిలో 534 చెరువులను రూ.24 కోట్లతోనూ, పోలవరం ప్రాజెక్టు పరిధిలో 80 చెరువులను రూ.ఐదు కోట్లతోనూ, గోదావరి డెల్టా పరిధిలో 1,751 చెరువులను రూ.81 కోట్లతోనూ, కృష్ణా డెల్టాపరిధిలో 1,411 చెరువులను రూ.50 కోట్లతోనూ, విజయవాడ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు పరిధిలో 1,431 చెరువులను రూ.55 కోట్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ నెల 11న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చెరువుల అభివృద్ధిపై నిర్ణయం తీసుకున్నారు.

సిమెంట్ స్కామ్‌లో 'భారతి'

(మొదటి పేజీ తరువాయి)

విలువైన సిమెంట్ కొనుగోలు చేయాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.110 కోట్ల విలువైన సిమెంట్ అదనంగా తీసుకున్నారు. అప్పటి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు వైసీపీ పెద్దలతో కుమ్మక్కయినట్టు విజిలెన్స్ విభాగం తేల్చింది. ముందస్తు ప్రణాళికలో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తెరమీదకు తెచ్చినట్లుగా కనిపిస్తోందని పేర్కొంది. లబ్ధిదారులకు తెలియకుండా, వారి ప్రమేయం లేకుండా లక్షలాది పక్కా ఇళ్ల నిర్మాణం కోసం సిమెంట్‌తో పాటు ఇనుము, ఇతర మెటీరియల్స్‌ను ఒకే సారి కొనుగోలు చేసి రూ.వేల కోట్ల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసినట్టు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. గత ప్రభుత్వ పెద్దలకు కావలసినవారి సిమెంట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసం భారీ స్థాయిలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడం వెనుక బంధుప్రీతి, రాజకీయ కుట్ర ఉన్నట్లుగా పరిగణించవచ్చని విజిలెన్స్ విభాగం నివేదికలో వెల్లడించింది.

ఆప్షన్-3 ఆలోచనలోనే కుట్ర

బలహీనవర్గాలకు పక్కా ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశల వారీగా సబ్సిడీ నిధులు విడుదల చేస్తుంటే.. లబ్ధిదారులు సొంతంగానే తమ ఇళ్లు పూర్తి చేసుకునేవారు. కానీ 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల గృహనిర్మాణ పథకం పూర్తిగా పక్కదారి పట్టింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే రాయితీ నిధులతో పక్కా ఇళ్లు కట్టుకోలేని పేదలకు ఆప్షన్-3 కింద రాష్ట్ర ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇస్తుందని అప్పటి ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 3.51 లక్షల మంది లబ్ధిదారులు తమ సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఆప్షన్-3ని ఎంపిక చేసుకున్నారు. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందని నమ్మేశారు. జగన్ ప్రకటించిన ఆప్షన్-3 వెనుక కుట్ర కోణం దాగి ఉందని ఎవరూ ఊహించలేకపోయారు. జగన్ ప్రభుత్వం ముందస్తు పథకం ప్రకారం.. ఆప్షన్-3 ఎంపిక చేసుకున్న పేదల ఇళ్లను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా కట్టించకుండా నిర్మాణ రంగంలో కనీస పరిజ్ఞానం, అనుభవం, అర్హతలు లేని వైసీపీ నాయకులకు బాధ్యతలు అప్పగించింది. టెండర్లు, అగ్రిమెంట్లు, పూచీకత్తుల వంటివి ఏమీ లేకుండానే ఒక్కొక్కరికి రూ.వందలు, వేల కోట్ల విలువైన కాంట్రాక్టులు కట్టబెట్టింది. ఇళ్ల పనులు మొదలు పెట్టకుండానే కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీ కింద వచ్చిన రూ. వేల కోట్ల నిధులను హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టర్లకు అడ్వాన్సుల కింద ఎడాపెడా దోచిపెట్టారు. నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి ఈ దోపిడీలో భాగస్వాములైన హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు.. పనిలోపనిగా నాటి ముఖ్యమంత్రి జగన్ సతీమణికి కూడా అవినీతిలో భారీగా వాటా కల్పించారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణానికి వినియోగించే సిమెంట్, స్టీలు, ఇతర నిర్మాణ సామగ్రిని నిబంధనలకు విరుద్ధంగా సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించడానికి ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. వెంటనే తమ ప్రణాళికను చకచకా అమలు చేసేశారు.

ఇతర కంపెనీలకు అన్యాయం

భారతీ సిమెంట్స్ కన్నా ఎక్కువ ప్లాంట్ సామర్థ్యం అర్హత ఉన్న అల్ట్రా టెక్, రామ్‌కో, మై హోం, పెన్నా, సాగర్, జువారీ కంపెనీలతో పాటు కేసీపీ, జేఎస్‌డబ్ల్యూ, రెయిన్, పరాశక్తి, భవ్య, ఎన్‌సీఎల్, శ్రీచక్ర, శ్రీజయజ్యోతి సిమెంట్ ప్రైవేట్ కంపెనీలకు మాత్రం వాటి ప్లాంట్ సామర్థ్యాల కంటే తక్కువ కొనుగోళ్ల ఆర్డర్లు ఇచ్చారు. మొత్తంగా 18 సిమెంట్ కంపెనీలకు రూ.1143.11 కోట్లు చెల్లించారు. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించిన 22,64,855 టన్నుల సిమెంట్‌ను అన్ని జిల్లాల్లో గోదాముల్లో నిల్వ చేశారు.

ధరలోనూ అదనంగా చెల్లింపు

పేదల ఇళ్ల నిర్మాణం కోసం మొత్తం 18 సిమెంట్ తయారీ కంపెనీల నుంచి మొత్తం 22,64,855 టన్నుల సిమెంట్‌ను కొనుగోలు చేశారు. ఆయా సిమెంట్ తయారీ కంపెనీల ప్లాంట్ సామర్థ్యాలను బట్టి దామాషా ప్రకారం సిమెంట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ 2020లో నాటి ముఖ్యమంత్రి జగన్ మెప్పు కోసం ఆయన కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ ప్లాంట్ సామర్థ్యం అర్హతకు మించి 3 రెట్లు ఎక్కువ బిజినెస్ ఇచ్చారు. దాదాపు లక్షా 10 వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉండగా, ఏకంగా 3,31,528 టన్నుల సిమెంట్ కొన్నారు. ఇందుకుగాను రూ.165.58 కోట్ల ప్రభుత్వ ధనాన్ని భారతీ సిమెంట్స్‌కు చెల్లించారు. కాగా ధర కూడా ముందుగా నిర్ణయించిన దానికంటే అధికంగా చెల్లించారు. మొదట బస్తా ధరను పీపీసీ రకానికి రూ.225, ఓపీసీ రకానికి రూ.235గా నిర్ణయించారు. అయితే బస్తాపై రూ.3 ఎక్కువగా టన్నుకు రూ.60 అదనంగా చెల్లించారు. భారతీ సిమెంట్స్ తర్వాత ఇండియా సిమెంట్స్ లిమిటెడ్, చెట్టినాడ్, దాల్మియా కంపెనీలకు వాటి ప్లాంట్ల సామర్థ్యానికి మించి 2 రెట్లు ఎక్కువగా సిమెంట్ కొనుగోలు చేశారు.

లిక్కర్ స్కామ్‌లో మరో 'స్కీమ్'

(మొదటి పేజీ తరువాయి)

ఎవరున్నారో తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. రూ.3200కోట్ల లిక్కర్ స్కామ్‌ను వెలికి తీసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికే (సిట్) ఈ బాధ్యతను అప్పగించింది. దీనిపై ఈ నెల 10న సీఐడీ కేసు (11/2026) నమోదు చేయగా... పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, అక్రమాలు నిగ్గు తేల్చే బాధ్యతను ప్రభుత్వం సిట్‌పై పెట్టింది. ఐపీసీలోని 420, 409, 468, 471, 120(బి), సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111, 212, 217, 317 కింద పలువురిపై సీఐడీలో కేసు నమోదైంది.

అసలేం జరిగింది...

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం షాపులు ప్రభుత్వమే నిర్వహించేలా లిక్కర్ పాలసీ రూపొందించారు. ముడుపులు ఇచ్చిన వారికే ఆర్డర్లు వెళ్లేలా చేసి... భారీ కుంభకోణానికి తెరలేపారు. ఇందులో... మద్యం రవాణాలోనూ కోట్లు గిల్లుకున్నారు. మద్యం తయారీదారులు డిపోల వరకూ సరుకును చేరవేస్తారు. అక్కడి నుంచి షాపులకు చేర్చేందుకు ప్రతి మద్యం కేసుకు రూ.13 చొప్పున ఏపీఎస్‌బీసీఎల్ చెల్లించేది. దానిని జగన్ హయాంలో ఏకంగా రూ.34కు పెంచేశారు. మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డికి సన్నిహితుడైన తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి అప్పటికే కార్గో వ్యాపారం చేసేవాడు. కిరణ్ కుమార్ రెడ్డిని బినామీగా పెట్టుకుని రాజ్ కసిరెడ్డి 'సిగ్మా' పేరుతో ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని మద్యం షాపులకు లిక్కర్ సరఫరా చేసే టెండర్లు ట్యాంపరింగ్ చేశారు. రూ.13ఉన్న కేసు సరఫరా ధరను ఏకంగా రూ.34కు పెంచి టెండర్ దక్కించుకున్నారు. దీనిని... జిల్లాల వారీగా కొందరు ముఖ్యమైన వైసీపీ నేతలకు సబ్ కాంట్రాక్టు ఇచ్చేశారు. అనంతపురం జిల్లాలో 'గుడ్ మార్నింగ్ స్టార్'గా పేరొందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. ఇటీవల ముఖ్యమంత్రిని దూషించి జైలు పాలైన గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి, రైతులను బూతులు తిట్టి వివాదం చెలరేగడంతో 'బుజ్జికన్నా' అంటూ బూతులకు కొత్త అర్థాన్ని తీసిన గోదావరి జిల్లాలకు చెందిన మాజీ మంత్రి కుమారుడు, శాసనమండలిలో వైసీపీకి పెద్ద దిక్కైన ఉత్తరాంధ్ర నాయకుడి మేనల్లుడు... ఇలా పలువురికి సబ్‌కాంట్రాక్టులు దక్కాయి. సరుకు రవాణా చార్జీలను ఒకేసారి రూ.13 నుంచి 34కు పెంచి... మొత్తంగా రూ.400 కోట్లు దోచేసినట్లు అంచనా. ఈ విషయం ఇప్పటికే సిట్ విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆయా నేతలకు నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉందని గత ఏడాది సెప్టెంబరు రెండో వారంలోనే 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అన్ని ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన తర్వాత కేసు నమోదుకు ఈ నెల మొదటి వారంలో సీఐడీకి ఆదేశాలు జారీ అయ్యాయి. నమోదైన కేసు దర్యాప్తు బాధ్యతలు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు నేతృత్వంలోని సిట్‌కు అప్పగిస్తూ శుక్రవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు.

అంబటిని 5 రోజులు కస్టడీకివ్వండి

» లాటరీ కేసులో ఆధారాలున్నాయి: పోలీసులు

» కోర్టు తీర్పు సోమవారానికి వాయిదా

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబుని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలుచేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. '2023లో సంక్రాంతి సంబరాల పేరుతో సత్తెనపల్లిలో నాటి వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు లక్కీ లాటరీ పేరుతో ఓ స్కీం ప్రారంభించారు. ఒక్కో టికెట్టుకు రూ.100 వసూలు చేశారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా బలవంతంగా పెన్షనర్లకు వీటిని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వీటన్నిటికీ ఆధారాలు ఉన్నాయి. ఈకేసును మరింత సమగ్రంగా దర్యాప్తు చేయడానికి ప్రధాన నిందితుడైన మాజీ మంత్రి అంబటిని కస్టడీకి తీసుకొని విచారించాలి. ప్రస్తుతం కేంద్ర కారాగారంలో ఉన్న ఆయనను ఐదు రోజులు కస్టడీకి ఇవ్వండి' అని పీపీలు విజయలక్ష్మి, జగదీశ్ నివేదించారు.అంబటి తరపున మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇది కేవలం రాజకీయ ప్రేరేపిత కుట్రలో భాగంగా నమోదైన కేసన్నారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయాధికారి కుముదిని సోమవారం మధ్యాహ్నం తీర్పు వెల్లడిస్తానని తెలిపారు.

అంబటి మురళికి నోటీసివ్వండి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అంబటి రాంబాబు సోదరుడు మురళి, మరొకరికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. గుంటూరు బజరంగ్ జూట్ మిల్ భూములకు సంబంధించి యాజమాన్యం, కార్మికుల మధ్య వివాదం నేపథ్యంలో తాను దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారని, కులం పేరుతో దూషించారంటూ కార్మిక నేత పిల్లి బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2025లో అంబటి మురళి, మరొకరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. దానిని కొట్టివేయాలని కోరుతూ వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఈ ఉత్తర్వులు ఇచ్చారు. జగన్ పర్యటన సందర్భంగా అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడం, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించారంటూ నల్లపాడు ఎస్ఐ మధుపవన్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో వైసీపీ నేతలు బాలసాని కిరణ్‌కుమార్, పోతిన వెంకట మహేశ్‌కు సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు.

'శ్రీశైలం ఘటన'లో తొలి వికెట్

శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్ బదిలీ

ఆ ఘటనపై సీఎంవో సీరియస్.. త్వరలో మరికొందరిపైనా వేటు!

నంద్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : 'శ్రీశైలం ఉద్రిక్తతల' ఘటనలో తొలి వికెట్ పడింది. శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్‌ను (ఐఎఫ్ఎస్) బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పోస్టింగ్ కేటాయించకుండా 'పీసీసీఎఫ్'కు (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) రిపోర్టు చేయాలని ఆదేశించారు. గుంటూరు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ విభాగంలో పనిచేస్తున్న కాశీవిశ్వనాథ్‌కు శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. శ్రీశైలంలో జరిగిన పరిణామాలపై 'ఉద్రిక్తత వెనుక కుట్ర కోణం..' పేరిట 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం ఆధారంగా సీఎంవో చర్యలు ప్రారంభించిన విషయం తెలిసిందే. సీఎంవో ఆదేశాలతో ఇప్పటికే ప్రత్యేక ఇంటిలిజెన్స్ విభాగం రంగంలోకి దిగి రహస్య విచారణ ప్రారంభించింది. శివభక్తుల పాదయాత్రకు ఫీల్డ్ డైరెక్టర్ ఆలస్యంగా అనుమతి ఇవ్వడమే ఉద్రిక్తతలకు దారితీసిందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. మరికొందరు అధికారులపైనా వేటు వేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. శ్రీశైలం పాదయాత్ర జరిగే అటవీ పరిధిలో ఆత్మకూరు, మార్కాపురం డీఎఫ్‌వోలు ఉన్నారు. శ్రీశైల బ్రహ్మోత్సవాలకు వారం రోజుల ముందుగానే మంత్రుల బృందం అటవీ, జిల్లా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ఆత్మకూరు, మార్కాపురం డీఎఫ్‌వోలు సైతం హాజరయ్యారు. సమీక్షలో జరిగిన అంశాలను శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవాల సన్నాహాలను పర్యవేక్షిస్తున్న శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్ దృష్టికి ఆ డీఎఫ్‌వోలు తీసుకెళ్లారా లేక తొక్కిపెట్టేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పాదయాత్రకు అనుమతులు డీఎఫ్‌వో స్థాయి అధికారులే ఇస్తారు. కాగా, ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో ఈనెల 6నుంచి 15వ తేదీ వరకు పాదయాత్రకు అనుమతి ఇచ్చారు. అసలు అనుమతి లభిస్తుందో,లేదోనని అప్పటివరకు సందిగ్ధతలో ఉన్న శివభక్తులు ఈ ప్రకటన రాగానే వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఎనిమిదో తేదీన శ్రీశైలంలో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. ఆత్మకూరు డీఎఫ్‌వో వ్యవహారశైలి మొదటి నుంచీ వివాదాస్పదంగానే ఉన్నదని, ఆయనపైనా త్వరలో వేటు పడొచ్చని సమాచారం.

కొండవీడు కోట అభివృద్ధికి నిధులివ్వండి

» కేంద్ర మంత్రికి టీడీపీపీ నేత లావు వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చారిత్రక కొండవీడు కోట వారసత్వ సంపదను కాపాడుకుంటూ, దానిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆర్థికంగా సహకరించాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో శుక్రవారం భేటీ అయిన ఆయన, ఈమేరకు వినతిపత్రం అందించారు. కొండవీడు కోట అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను(డీపీఆర్) తక్షణమే ఆమోదించాలని కోరారు. స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 కింద.. సుమారు రూ.100 కోట్ల అంచనాతో రూపొందించిన ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలని విన్నవించారు.

దొంగ సొమ్ము దోపిడీ

» లిక్కర్ స్కామ్ నిందితుల ఇంట్లో డబ్బు కొట్టేసి ఆస్తుల కొనుగోలు

» హైదరాబాద్, ఒడిశాలో స్థిర, చరాస్తులు ..అటాచ్ చేసిన సిట్

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో నిందితులు దాచిన దొంగ సొమ్మునే కొందరు దొంగతనం చేశారు. ఆ సొమ్ముతో ఒడిశా, హైదరాబాద్‌లో స్థిర, చరాస్తులు కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లిక్కర్ స్కామ్‌పై విచారణ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ ఆస్తులను అటాచ్ చేస్తూ హోం శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. లిక్కర్ కమీషన్లను హైదరాబాద్‌లో ఏ-44 కొల్లిపూరి మోహన్‌కుమార్ నివాసంలో భద్రపరిచారు. ఆ ఇంటిని కలెక్షన్ నగదు పాయింట్‌గా వినియోగించారు. 2024లో అక్కడ పనిచేసే రస్మితా బూరా అనే మహిళ(సాక్షి) ఇంట్లోని నగదు పెట్టెలను చూసింది. వాటిని దొంగతనం చేసేందుకు ప్లాన్‌చేసి ఇర్షాద్ అహ్మద్(మరో సాక్షి)కి సమాచారం ఇచ్చింది. అతను కటక్ నుంచి కొందరు వ్యక్తులను, హైదరాబాద్‌కు చెందిన ముబారక్ అలీ(మరో సాక్షి)ని పిలిపించి మొత్తం ఆరు పెట్టెలను దొంగతనం చేశారు. ఆ డబ్బులో రస్మితా బూరాకు రూ.30 లక్షలు వాటా దక్కింది. ఆమె బంగారం కొనుగోలు, ఇతర అవసరాలకు ఆ డబ్బు వాడుకుంది. కొనుగోలు చేసిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టింది. ఇర్షాద్ అహ్మద్ ఒడిశాలో కటక్- పారాదీప్ రోడ్డులోని గాటిరావుపట్నాలో నాలుగు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ముబారక్ అలీ హైదరాబాద్ టోలిచౌకి ప్రాంతంలోని హకీంపేటలో 178 చదరపు గజాల్లో ఉన్న రెండు అంతస్తుల భవనాన్ని కొనుగోలు చేశాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.